VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

700388

# విశాలాంధ్ర

6 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం. A 193

7 సంపుటి ] విజయవాడ * 4 ఫిబ్రవరి 1959 * బుధవారం [ సంచిక 313

### లోహియాపై రాజుగారి విమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 3

భారతదేశంలో సోషలిస్టు ఉద్యమం కొంతకాలంగా అపప్రచారానికీ అపనిందకూ, పిరికితనానికీ, గీర్వాణానికీ బలిఅవుతూ వచ్చింది. బాధ్యతతోను, నిర్మాణాత్మకంగాను ఉండడాని కెవరైనా యత్నిస్తే వారినిడాక్టర్ లోహియా స్వార్థపరులనీ, అవకాశవాదులనీ నిందించారు అని శ్రీ పి. వి. జి. రాజుగారు డాక్టర్ రామమనోహర లోహియాను నేడిక్కడ పత్రికాగోష్టిలో విమర్శించారు. (వి. వి.)

### తెలంగాణాలోకూడా మూడవ ఫారంవరకు ఉచితవిద్య

హైదరాబాద్, ఫిబ్రవరి 3

తెలంగాణాలోకూడా మూడవఫారం వరకు ఉచిత విద్యావ్యవస్థని ప్రవేశపెట్టే విషయాన్ని ఆంధ్రప్రభుత్వం పరిశీలిస్తున్నది. దీనికి అదనంగా ఎంతఖర్చు అవుతుందో ఆర్థికవివరాలు సేకరిస్తున్నారు. త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తారు. (వి. వి.)

# ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఉమ్మడి ప్రతిపక్షం కోసం యత్నం

## కాంగ్రెసునుండి వైదొలగినవారితో చర్చలు జరుపుతున్నట్లు పి. వి. జి. రాజుగారి వెల్లడి

## కాంగ్రెసు-కమ్యూనిస్టుపార్టీలతోసమదూరంగావుండాలన్న లోహియా సిద్ధాంతానికి తిరస్కృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 3

ఇటీవల కాంగ్రెసునుంచి విడివడినవారితో కలిసి ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక ఉమ్మడి ప్రతిపక్షాన్ని రూపొందించడంకోసం చర్చలు జరుపుతున్నట్లు, ఈ చర్చ నింకా కొనసాగించదలచినట్లు శ్రీ పి.వి.జి. రాజుగారు నేడిక్కడ పత్రికలవారితో చెప్పారు.

ఇంతకాలంగా సోషలిస్టుపార్టీ వారు రాష్ట్ర శాసనసభలో కమ్యూనిస్టు పార్టీతో సహా అన్ని ప్రతిపక్షపార్టీల వారితోను సహకరిస్తూ వస్తున్నారు. ఇలాంటి సహకారం ఇక ముందుకూడా ఉండగలదన్నారు.

ప్రభుత్వ విధానాలపట్ల ప్రాథమిక వ్యతిరేకత ఉన్నంతకాలం ప్రతిపక్షాల మధ్య ఈ సహకారం అసంభవంకాదు సరికదా అట్టిది అవసరం కూడా నని ఆయన చెప్పారు.

ఏ వ్యక్తినికాని, వర్గాన్ని కాని వారి గత చరిత్రనుబట్టి తాను అభ్యుదయ నిరోధకులుగా భావించబోనన్నారు. ప్రస్తుత సమస్యలపట్ల వారి దృక్పథమేమిటి అన్నదాన్నిబట్టి వారిపట్ల తను వైఖరిని నిర్ణయించుకొంటా మన్నారు.

కాంగ్రెసును కమ్యూనిస్టుపార్టీనీ ఒకే రకంగా చూడాలన్న శ్రీ లోహియా సిద్ధాంతంతో తానేకీభవించడం లేదన్నారు.

ఆత్మకూరు ఉపఎన్నిక సందర్భంలో కమ్యూనిస్టుపార్టీతో ఎందుకు సహకరించలేదో వివరిస్తూ చేసిన ఉపన్యాసం సంగతి ఒక విలేఖరి గుర్తుచేగా ఆ ఉపన్యాసానికి తానిప్పటికీ కట్టుపడి వుంటానన్నారు.

కమ్యూనిస్టులు ప్రజా సమస్యలను పరిష్కరించగలరనే భావం తనకు కలిగిన పక్షంలో ఇంకొకడుగు ముందుకువేసి ఎన్నికల్లో వారికి పోటీ పెట్టకుండా వుండాలనేది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. అయితే ఈ విషయమై ఇంకా తన సహచరులతో చర్చలు జరపవలసి వుందన్నారు.

సోషలిస్టు, ప్రజా సోషలిస్టుపార్టీల ఏకీకరణకోసం ఆంధ్ర, తమిళనాడు, మైసూరు, కేరళ సోషలిస్టు-ప్రజాసోషలిస్టుల సదస్సు మార్చి 14-15 తేదీల్లో మైసూరులో జరుగుతుంది.

## సోషలిస్టు పార్టీనుండి పి.వి.జి. రాజు బర్తరఫు

### పార్టీ కంట్రోలు కమిషన్ నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 2

పార్లమెంటు సభ్యుడు శ్రీ పి. వి. జి. రాజు, శ్రీ బిపిన్ పాల్ దాస్, శ్రీ బి. యస్. మహాదేవసింగ్, మరిముగ్గురిని పార్టీనుండి తొలగించడానికి పార్టీ కంట్రోలు కమిషన్ నిర్ణయించిందని నేడు సోషలిస్టుపార్టీ కేంద్ర కార్యాలయంవారు ప్రకటించారు.

ప్రజా సోషలిస్టుపార్టీతో విలీకరణకు రాయబారాలు సాగించడానికిగాను వీరు "సంప్రతింపుల కమిటీ"గా ఏర్పడినందున పార్టీనుండి తొలగించడమైనదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

"ఆ సంప్రతింపుల కమిటీ"తో సంబంధాన్ని పూర్తిగా వదులుకొని ఆ విషయాన్ని పార్టీ కార్యాలయానికి వారు తెలియపరచినపక్షంలో కంట్రోలు కమిషన్ నిర్ణయం అమలుజరపబడదని పార్టీ ప్రకటనలో వుంది.

## ప్రైవేట్ కంపెనీలో ఉక్కు ఉత్పత్తి తగ్గుదల

కలకత్తా, ఫిబ్రవరి 2

ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీకిచెందిన బర్నపూర్, కుల్టీ ఉక్కుకర్మాగారాలు ఈ సంవత్సరం జనవరిలో చేయాల్సిన ఉక్కుఉత్పత్తి పడిపోయింది. 4,999 టన్నుల మేరకు ఉత్పత్తి పడిపోయింది. అంటే 1958 డిసెంబర్‌లో జరిగిన ఉత్పత్తి 50,697 టన్నులు. జనవరిలో 45,698 టన్నులకు పడిపోయిందన్నమాట. ఈ లెక్కల్ని నేడిక్కడ కంపెనీ ఏజెంట్లు ప్రకటించారు.

ఈ కంపెనీలలో తయారయ్యే ఉక్కును అమ్మకానికి వినియోగిస్తుంటారు. ఇదేకాలంలో దుక్కఇనుము ఉత్పత్తికూడా పడిపోయిందని పై ఏజెంట్లు తెలుపుతున్నారు.

## లోక్‌సభకు సోషలిస్టు సభ్యుని ఎన్నిక

వారణాసి, ఫిబ్రవరి 2

చాక్యా - అందాలీ పార్లమెంటు నియోజకవర్గం నుండి లోక్‌సభకు జరిగిన ఉపఎన్నికలో సోషలిస్టు సభ్యుడైన శ్రీ ప్రభునారాయణసింగ్ నేడు గెలుపొందారు. ఈయన ప్రత్యర్థియైన కాంగ్రెసు అభ్యర్థి శ్రీ జగత్ నారాయణ్ దూబేమీద 35,387 వోట్ల మెజారిటీతో గెలుపొందారు.

అంతకుముందు సభ్యులైన శ్రీ టి. ఎన్. సింగ్ ప్రణాళికాసంఘ సభ్యుడుగా నియమితుడు కావడంవల్ల ఈ ఉపఎన్నిక జరిగింది.

ఓట్ల వివరాలు యివి:

| | | |
|---|---|---|
| శ్రీ ప్రభునారాయణసింగ్ | (సోష్టు) | 1,04,133 |
| జగత్ నారాయణదూబే | (కాం) | 68,746 |
| సమ్యార్ సింగ్ | (కమ్యూ): | 18512 |
| హరిశ్చంద్ర త్రిపాఠీ | (రామరాజ్య పరిషత్): | 5042 |

శ్రీ సమ్యార్ సింగ్, శ్రీ త్రిపాఠీలు డిపాజిట్లను కోల్పోయారు.

మొత్తం నియోజకవర్గంలోని ఓటర్లసంఖ్య 4,01,352. పోలైన ఓట్లు: 2,06,599. మురిగిపోయిన ఓట్లు 10,166.

## ఖిలాయ్‌లో సాంకేతిక విద్యా సంస్థ

భిలాయ్, ఫిబ్రవరి 2

వివిధవృత్తులలో తరిఫీదు నిచ్చేందుకై భిలాయ్ ఉక్కు కర్మాగారానికి చెందిన అధికారులు ఒక సాంకేతిక శిక్షణా సంస్థను ప్రారంభించనున్నారు.

ప్రారంభంలో ఈసంస్థ ఫిట్టింగ్, టర్నింగ్, వెల్డింగ్, కంసాలిపని, తదితర పనుల్లోను మొత్తం 170 మందికి తరిఫీదు నిస్తుంది. ఆ తర్వాత కొంతకాలానికి కర్మాగారంలోని వివిధశాఖల నిర్వహణకు అవసరమైన ఉన్నత సాంకేతిక పనివారలకు తరిఫీదు చేస్తుంది.

ఈ సాంకేతిక విద్యాసంస్థ, కర్మాగారంలో పనిచేసే మరో వెయ్యి మంది కార్మికులకుకూడ సాయంత్రం పూట తరగతులు పెట్టి తరిఫీదు నిస్తుంది. కార్మికులకు సాంకేతిక విజ్ఞానం పెంపొందడానికి, ఫలితంగా వారు ఉన్నత పదవుల్లోకి వెళ్ళేందుకు అనువుగా తరిఫీదు నివ్వడం జరుగుతుందని తెలుస్తోంది.



ఖిలాయ్‌లో ఇనుమును కరిగించే కోక్ ఓవెన్ దృశ్యం

## నేలతల్లి బిడ్డలకిచ్చినవాగ్దానమే భూసంస్కరణలు

### శ్రీ రంగాగారి వాదనలకు పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుని జవాబు

జలంధర్, ఫిబ్రవరి 2

"నేలతల్లి బిడ్డలకు మనమిచ్చిన వాగ్దానమే నేటి మన భూసంస్కరణలు. ఏదెమకైనా ఈ నిర్ణయాని కింక తిరుగు లేదు" అంటూ పంజాబ్ రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడైన శ్రీ సర్దార్ దర్బారాసింగ్ ఇటీవల శ్రీ రంగాగారు భూసంస్కరణలకు వ్యతిరేకంగా లేవదీసిన దుమారానికి సమాధానమిస్తూ అన్నారు.

అధికోత్పత్తి సాధనలో అభివృద్ధి చెందిన సాంకేతిక పద్ధతుల్ని సామాన్య సాగుదారికి అందుబాటులోకి తేవడానికి సహకార వ్యవసాయ మొక్కటే శరణ్యమని పంజాబు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు, శాసనసభ్యులైన శ్రీ సర్దార్ దర్బార్‌సింగ్ నేడొక ప్రకటనలో తెలియ చెప్పారు. ఈ సందర్భంలో ఈయన రంగాగారి అభిప్రాయాల్ని ఖండించారు.

ఈ సహకార వ్యవసాయ పద్ధతి సమిష్టి వ్యవసాయపద్ధతికన్నా భిన్నమైనట్టిదని శ్రీ సింగ్ ఆ ప్రకటనలో తెలియజేశారు. పంజాబ్ రైతుసదస్సు చర్చలపై వ్యాఖ్యానిస్తూ ఆయన వైవిధంగా చెప్పారు.

### శ్రీ రంగాపై విమర్శ

సోవియట్ నుండి అరువు తెచ్చుకున్న స్టేట్ సోషలిజానికి రాజకీయంగాను, ఆర్థికంగాను 'దాసుల' చేసేందుకు కాంగ్రెస్ విధానకర్తలు ప్రయత్నిస్తున్నారని ఇటీవల శ్రీ రంగాగారు చేసిన ఆరోపణలను శ్రీ దర్బారాసింగ్ ఖండించారు. "భారతదేశ జాతీయ ప్రయోజనాల కనుగుణంగానే కాంగ్రెస్ సోషలిస్టుభావాన్ని రూపొందించింది. అంతేగాని ఏ విదేశీ 'యిజం'తోను దానికి నిమిత్తంలేదు. నేలతల్లి బిడ్డలకు మనమిచ్చిన వాగ్దానమే మనం రూపొందించిన భూసంస్కరణలు. ఎన్ని అడ్డంకులువచ్చినా ఈ నిర్ణయాని కింక తిరుగులేద"ని శ్రీ సింగ్ స్పష్టపరిచారు.

(మిగతా 6 వ పేజీలో)

## ఖిలాయ్ కోక్ ఓవెన్సు

### మొదటి బ్యాటరీ పని ప్రారంభం

భిలాయ్, ఫిబ్రవరి 2

భిలాయ్ కర్మాగారానికి చెందిన మూడు కోక్ ఓవెను బ్యాటరీలలోను మొట్టమొదటి బ్యాటరీ నిన్న పని చేయడం ప్రారంభించింది.

ఈ బ్యాటరీలు కర్మాగారంలోని మూడుఉక్కుబట్టీలకుకావలసినబొగ్గును సప్లయి చేస్తాయి. ఈ ఉక్కుబట్టీలలో ఒకదాని పనికి ఫిబ్రవరి 4వ తేదీన రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రారంభోత్సవం చేయనున్నారు. 30 చదరపుమైళ్ళ విస్తీర్ణంలోవున్న నిర్మితమైన ఈ ఉక్కు కర్మాగారంలో ఇంజనీర్లుగాని, సాంకేతిక నిపుణులుగాని, నిపుణులైన కార్మికులు గాని మొత్తం 65,000 మంది పైచిలుకు పని చేస్తున్నారు. కర్మాగారం ఫిబ్రవరి 6న ఉక్కు ఉత్పత్తి ప్రారంభిస్తుంది. రోజుకి వెయ్యిటన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుంది.

### 600 మంది సోవియట్ ఇంజనీర్లు

సోవియట్ సహాయంతో నిర్మిస్తున్న ఈ భిలాయ్ కర్మాగార నిర్మాణం 1957 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. సోవియట్ ఆర్థిక సహాయమేగాకుండా సాంకేతిక సహాయాన్నికూడా అందిస్తోంది. ఇప్పటికి నిర్మాణంలో 40 వంతుల పని పూర్తయి పోయింది. కర్మాగార నిర్మాణానికి సంబంధించిన ప్రధాన భాగం పూర్తవడానికి కావలసిన పరికరాలలో 85 శాతం సిద్ధంగా వుంది.

రు. 63.3 కోట్ల విలువచేసే కర్మాగారానికి కావలసిన ప్రధాన యంత్రాలన్నీ సోవియట్ యూనియన్ సరకు అప్పు పద్ధతిమీద సప్లయి చేసింది. ఈఅప్పును 2½ శాతం వడ్డీచొప్పున 12 సాంవత్సరిక వాయిదాలలో చెల్లించుకోవచ్చు. కర్మాగార నిర్మాణ పనిలో ప్రస్తుతం 600 మంది సోవియట్ యింజనీర్లు,సాంకేతిక నిపుణులు నిమగ్నులై యున్నారు.

భిలాయ్ కర్మాగారం పూర్తిగా ఉత్పత్తి ప్రారంభించినప్పుడు దుక్కఇనుము, ఉక్కు ఉత్పత్తి చేయడానికయే ఉత్పత్తిఖర్చు ప్రస్తుత ఉక్కు కర్మాగారాలలోని ఉత్పత్తి ఖర్చులతో సమానంగానే వుంటాయని యిక్కడి అధికారి ఒకరు చెప్పారు.

దుక్కఇనుము, ఉక్కు ఉత్పత్తి చేయడానికి టన్ను ఒక్కింటికి 120 నుండి 220 రూపాయలవరకు ఖర్చు అవుతుంది. భిలాయకు 150 మైళ్ళ దూరంలో వున్న కార్గావద్ద లోహపరిశ్రమలకు పనికివచ్చే బొగ్గు లభ్యమైతే ఈ ఖర్చున్ని యింకా తగ్గించడంసాధ్యమవుతుందని ఆ అధికారి తెలిపారు.

## రు. 4 లక్షల విలువగల దొంగ బంగారం స్వాధీనం

బొంబాయి, ఫిబ్రవరి 2

దాదాపు 4 లక్షల రూపాయల విలువగల 3,500 తులాల దొంగబంగారాన్ని నేటి ఉదయం యిక్కడ కస్టమ్స్ శాఖాధికారులు ఎయిర్ యిండియా ఇంటర్‌నేషనల్ విమానంలో పట్టుకున్నారు.

## ఉత్తర ప్రదేశ్‌లో కుటుంబ కమతం 50 ఎకరాలు!

మీరట్, ఫిబ్రవరి 2

ప్రస్తుత కమతాలను దృష్టిలో వుంచుకుని ఉత్తర ప్రదేశ్‌లో ఒక్కొక్క కుటుంబానికి 50 ఎకరాల చొప్పున సీలింగ్ విధించడానికి నిర్ణయించామని ఉత్తర ప్రదేశ్ రెవెన్యూ మంత్రి శ్రీ చరణసింగ్ నిన్న నిక్కడ ఒక సందర్భంలో అన్నారు.

ఈ సీలింగునుండి తోటలను మినహాయించారు.

## ఆసియా - ఆఫ్రికా యువజనమహాసభ ప్రారంభం

కైరో, ఫిబ్రవరి 2

సామ్రాజ్యవాద పీడను పూర్తిగా నిర్మూలించేందుకు ఆసియా - ఆఫ్రికా దేశాల యువకులు నడుంబిగించాలని ఐక్య అరబ్బు రిపబ్లిక్ విద్యాశాఖ మంత్రి కమాల్ అల్ దిన్ హుస్సేన్ నేడు కైరోలో ఆసియా - ఆఫ్రికా యువజన ప్రథమ మహాసభను ప్రారంభిస్తూ ఉద్బోధించారు.

ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని నలభై రెండు దేశాలనుండి మొత్తం, అయిదువందలమంది యువజన ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటున్నారు. మహాసభ వారం రోజులు జరుగుతుంది.

కెన్యా, ఉగాండా, బెల్జియం కాంగోలాంటి ఆఫ్రికా వలసదేశాల నుండి రాదలచిన ప్రతినిధులకు అక్కడి వలస అధికారులు పాస్‌పోర్టులను నిరాకరించడమో, లేక ఆ ప్రతినిధులను అరెస్టుచేయడమో చేశారు. ఆకారణంచేత ఇతరదేశాల్లోవున్న ఆ ప్రాంతాల పౌరులు ప్రతినిధులుగా పాల్గొన్నారు.

(మిగతా 2 వ పేజీలో)



భారత, సోవియటు ఇంజనీర్లు ఖిలాయ్‌లో దైనందిన కార్యక్రమాన్ని గురించి చర్చలు జరుపుతున్నారు

## క్యూబా యుద్ధ నేరస్థుని ఉరితీత

హవానా, ఫిబ్రవరి 1

క్యూబాలో రెండవ యుద్ధ నేరస్థుడుగా పరిగణింపబడుతున్న పెడ్రో మోరిజాన్‌ను క్యూబా విప్లవ ప్రభుత్వం గత అర్థరాత్రి ఉరితీసింది.

డాక్టర్ ఫైడల్ కాస్ట్రో ఉగాది నాడు పదవీ స్వీకారంచేసిన తరువాత విధించబడ్డ ప్రప్రథమ ఉరిశిక్ష ఇదే.

వారంరోజుల క్రితం మిలిటరీ కోర్టు మోరిజాన్‌ను యుద్ధ నేరస్థుడుగా తీర్పు చెప్పి ఉరిశిక్ష ఖాయంచేసిన విషయం పాఠకులకు విదితమే.

## హిందీ భాషా వ్యాప్తి

### ప్రత్యేక నిధి అవసరమని శ్రీ అనంతశయనం సూచన

ఇండోర్, ఫిబ్రవరి 2

హిందీయేతర భాషా ప్రాంతాలలో హిందీ భాషావ్యాప్తికై ప్రత్యేక నిధిని కేటాయించాలని లోక్‌సభా స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగార్ నేడొక సూచన చేశారు.

ఇక్కడికి 17 మైళ్ళ దూరంలో వున్న ఒక గ్రామంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర, భాషా ప్రచార సమ్మేళన ప్రథమ సమావేశానికి ప్రారంభోత్సవం చేస్తూ శ్రీ అయ్యంగార్ పై విధంగా చెప్పారు.

కేవలం సంస్కృత భాషా వాఙ్మయాన్ని పదిలపరచుకోనే ఉద్దేశంతోనే గాదు, హిందీ భాషాభివృద్ధికి సహితం హిందీ మాట్లాడేవారికి సంస్కృత భాషాధ్యయనం అవసరమని శ్రీ అయ్యంగార్ చెప్పారు. సంస్కృతం నేర్చుకోకపోతే హిందీలో పాండిత్యం సాధించడం ఎవరికీ సాధ్యం కాదన్నారు.

### దక్షిణాదివారి అభిప్రాయం

దక్షిణాదివారు హిందీభాషావ్యాప్తికి వ్యతిరేకులు కారు. వాస్తవానికి వారికి హిందీ అంటే సుముఖమే. హిందీని జాతీయభాష చేయాలనికూడా వారు కోరుకుంటున్నారు. అయితే హిందీ భాషలోని లోతుపాతుల్ని గ్రహించడానికి వారికి కొంత వ్యవధి అవసరం. అందుచేత హిందీభాష నలుగురికీ అందుబాటులో వుండాలంటే సమ్మేళన్‌వారు ఆ భాషను ఎంత తేలిగ్గా రూపొందించితే అంత మంచిదని శ్రీ అయ్యంగార్ పేర్కొన్నారు.



విశాలాంధ్ర

బుధవారం 4-2-1959

## ఉక్కు పరిశ్రమ-2

రూర్కెలా, భిలాయ్ ఉక్కు కర్మాగారాలకు ప్రారంభోత్సవాలు జరుగుతున్న ఈ సమయంలో, ప్రతిభారతీయుడు కొన్ని సమస్యలను గురించి శ్రద్ధగా ఆలోచించవలసి ఉంటుంది. ఉక్కు కర్మాగారాల నిర్మాణంలో మనకు సహాయం చేస్తున్న దేశాలలో ఏదేశం సహాయం మన కెక్కువ లాభకరం అనేది మొదటి ప్రశ్న. ఉక్కు పరిశ్రమలు మరింత త్వరితగతిని అభివృద్ధి చెందాలంటే మనం అవలంబించవలసిన పద్ధతులేవి అనేది రెండవప్రశ్న.

రూర్కెలా కర్మాగారాన్ని పశ్చిమ జర్మనీ నిర్మిస్తున్నది. భిలాయ్ కర్మాగారాన్ని సోవియట్ యూనియన్, దుర్గాపూర్ కర్మాగారాన్ని బ్రిటన్ నిర్మిస్తున్నాయి.

ఈ సందర్భంలో ఒక ముఖ్య విషయాన్ని మనం మరచిపోలేము. మన దేశంలో భారీ పరిశ్రమలను నిర్మించేందుకు, అమెరికా, బ్రిటన్, పశ్చిమ జర్మనీ వంటి పెట్టుబడిదారీ దేశాలు మొదట్లో అంగీకరించలేదు. ఈ దేశాల విముఖతను గుర్తించిన పిమ్మటనే భారత ప్రభుత్వం సోవియట్ సహాయానికై ప్రయత్నించింది. వెంటనే సోవియట్ యూనియన్ భిలాయ్ లోఉక్కు కర్మాగారం నిర్మించేందుకు అంగీకరించింది. సోవియట్ ప్రభావం భారతదేశంలో పెరిగిపోతుందేమోననే భయంతో వెన్వెంటనే బ్రిటన్, పశ్చిమ జర్మనీలు కూడా ముందుకు వచ్చాయి.

అంతేకాదు పైమూడు కర్మాగారాలలోను భిలాయ్ కర్మాగారం తక్కువఖర్చుతో నిర్మించబడుతున్నది. దీనికి మొత్తం 131 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఈ నిర్మాణానికవసరమైన 63కోట్ల 10 లక్షల రూపాయల ఖరీదుగల యంత్రాలను సోవియట్ యూనియన్ మనకు అప్పుగా ఇచ్చింది. ఈ అప్పును మనం 12 సాంవత్సరిక వాయిదాలలో తీర్చుకోవచ్చు. వడ్డీ 2½ శాతం మాత్రమే. అమెరికా ప్రోత్సాహ్యాన నడుస్తున్న ప్రపంచ బ్యాంకు మనకు ఇచ్చే అప్పులకు నూటికి 4 నుండి 7 శాతం వరకు వడ్డీ ఉంటున్నది.

చౌకవడ్డీతో మనకు విలువైన యంత్రసామగ్రిని సప్లై చేయటం మాత్రమేకాక, సోవియట్ ప్రభుత్వం మరొక గొప్ప సహాయం కూడా చేస్తున్నది. కర్మాగార నిర్మాణంలోని కీలకాంశాల నన్నిటినీ భారత ఇంజనీర్లకు తెలియజెప్పి, సాధ్యమైనంత త్వరలో మొత్తం కర్మాగారం అంతా భారతీయుల నిర్వహణకింద కు వచ్చేటట్లు చేయటమే సోవియట్ లక్ష్యం. ప్రస్తుతం భిలాయ్ లో 630 మంది సోవియట్ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. ప్రతిఒక్క రష్యన్ నిపుణునికి తోడుగా ఒక భారతీయ నిపుణుడు నియమించ బడ్డాడు. నిర్మాణ రహస్యాలను ఎట్టి అరమరికలు లేకుండా రష్యన్ ఇంజనీర్లు భారతీయ ఇంజనీర్లకు నేర్పుతున్నారు.

రూర్కెలా, దుర్గాపూర్ ల జర్మన్, బ్రిటిష్ ఇంజనీర్లు ఇందుకు విరుద్ధమైన వైఖరి నవలంబిస్తున్నారు. నిర్మాణ రహస్యాలను భారతీయులకు తెలియజేయటానికి నిరాకరిస్తున్నారు.

సోవియట్ ప్రభుత్వసాయంలోని ఈ సోదర భావం, పెట్టుబడిదారీ ప్రభుత్వాలసాయంలో ఇమిడిఉన్న స్వార్థం ప్రతి ఒక్కరూ గమనించవలసి వుంటుంది.

ఇక రెండవప్రశ్న. దాదాపు మనతోపాటే స్వాతంత్ర్యాన్ని పొందిన చైనా - ఈ పదిసంవత్సరాలలో, అన్నిరంగాలలోను మనకంటె అతివేగంగా పురోగమిస్తున్నది. చైనా అనుభవాల నుండి భారతదేశం నేర్చుకోవలసిన అంశాలు ఎన్నో ఉన్నాయని ఈనాడు మనదేశస్థులు చాలామంది గుర్తిస్తున్నారు. ఇది ముదావహం.

ముఖ్యంగా ఉక్కు పరిశ్రమలో చైనా సాధించిన అభివృద్ధిని గమనించటం అవసరం.

1949 లో చైనాలో ఉక్కు ఉత్పత్తి 16 లక్షల టన్నులు మాత్రమే. అలాంటిది 1958 లో ఉక్కు ఉత్పత్తి 1 కోటి 10 లక్షల టన్నులైంది. ఉత్పత్తి మొత్తంలోనేకాకుండా ఉత్పత్తివేగంలో కూడా చైనా గొప్ప అభివృద్ధి సాధించింది. 1957 ఉత్పత్తి కంటె 1958 లో ఉక్కుఉత్పత్తి రెండింతలైంది. సాధ్యమైనంత త్వరలో ఉక్కు ఉత్పత్తిలో బ్రిటన్ను అధిగమించాలనేది చైనా లక్ష్యం.

ఇక భారతదేశం విషయం చూదాం. 1947 లో మన ఉక్కు ఉత్పత్తి 12 లక్షల టన్నులు. 1961 ఆఖరుకు, అనగా ద్వితీయ ప్రణాళిక ఆఖరుకు ఈ మొత్తం 60 లక్షల టన్నులు అవుతుందని అంచనా.

చైనా శరవేగాన పురోగమించడానికి కారణా లేమిటి.

ఇందుకు కారణాలు రెండు. చైనాలో ఇతర అన్ని భారీ పరిశ్రమల వలెనే, ఉక్కు పరిశ్రమ కూడాపూర్తిగా ప్రభుత్వరంగాన నిర్వహించ బడుతున్నది. చైనా ప్రభుత్వం సోషలిస్టు ప్రభుత్వం కావటం మరొక విశేషం.

అంతేకాదు కేవలం భారీ కర్మాగారాల నిర్మాణంపైననే కేంద్రీకరించక చైనాప్రభుత్వం, చిన్న, మధ్యరకం ఉక్కు కర్మాగారాలను దేశం అంతటా స్థాపించింది.

చైనాలో భారీ ఉక్కు కర్మాగారాలు మూడు ఉన్నాయి. ఇవి అన్షాన్, వుహాన్, పాటో కర్మాగారాలు - ఈ మూడూ కాక దేశం మొత్తం మీద 200 చిన్న, మధ్యరకం ఉక్కు బట్టీలను ప్రభుత్వం స్థాపించింది. ఈ బట్టీలలో మొత్తం 13 వేల కొలుములను స్థాపించింది. గ్రామసీమలలో విరివిగా దొరికే కాకిరాయిని, ఉపయోగించి ఎక్కడికక్కడ తేలికపద్ధతులలో బట్టీలద్వారా ఇనుము, ఉక్కు తయారుచేస్తున్నది. ఉక్కు పోతలో కూడా సాంప్రదాయికమైన పద్ధతులలో అనేకమైన మార్పులను ప్రవేశపెట్టి, తక్కువఖర్చుతో, ఎక్కువ ఉక్కు తయారయే పద్ధతులను చైనా ప్రవేశపెట్టింది. వేలసంఖ్యలో ఇంజనీర్లను, నిపుణులను తయారుచేస్తున్నది.

ఈ నవీన పద్ధతులతో పాటు, దేశపునర్నిర్మాణానికై యావత్ ప్రజాసీకాన్ని చైనా ప్రభుత్వం సమీకరించగలిగింది. చైనా ప్రభుత్వవిధానాల ఫలితంగా ఇట్టి అపూర్వోత్సాహం చైనా అంతటా తొణికిసలాడుతున్నది.

ఉక్కు ఉత్పత్తిలో చైనా అవలంబిస్తున్న పద్ధతులు మనమూ అవలంబించవచ్చు. మన దేశంలో అనేకరాష్ట్రాల్లో, కాకిరాయి పుష్కలంగా ఉంది. ప్రస్తుతం ఈరాయి జపానువంటి విదేశాలకు ఎగుమతి అవుతున్నది. చిన్నతరహా ఉక్కు బట్టీలను మనం స్థాపించుకుంటే, మన దేశంలోనే ఈ కాకిరాయి వినియోగపడగలదు.

చైనా అవలంబిస్తున్న పద్ధతులను పరిశీలించటానికి ఒక ప్రతినిధి వర్గాన్ని పంపనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రతినిధివర్గంత్వరలో చైనా పర్యటించి, అక్కడి అనుభవాలను సేకరిస్తుందని ఆశించుదాం.

చైనావంటి ఇతర దేశాల అనుభవాలను నేర్చుకోవటం; మనకు లాభకరమైన పద్ధతిలో సహాయం చేస్తున్న సోషలిస్టు దేశాల సహాయాన్ని మరింతగా స్వీకరించటం; వీటన్నిటికంటె ముఖ్యంగా భారత ప్రజలలో దేశ పునర్నిర్మాణ దీక్షను కలిగించే విధానాలను ప్రభుత్వం అవలంబించటం - ఇవి జరిగిననాడు, ఉక్కు పరిశ్రమ అభివృద్ధిలో మనం ఎంతో పురోగమించగలం. ఆర్థికాభివృద్ధికి కీలకమైన భారీపరిశ్రమల నిర్మాణానికి దృఢమైన పునాదిని ఏర్పరచుకోగలం.

# భారతదేశ పారిశ్రామిక చరిత్రలో ప్రముఖాధ్యాయం

రూర్కెలా, భిలాయ్ లలో మొదటి మరకొలుములకు ప్రారంభోత్సవం చేయడంలో, భారతదేశ పారిశ్రామిక చరిత్రలో ఒక ప్రముఖమైన అధ్యాయం ప్రారంభమైందని చెప్పవచ్చు.

మరకొలిమిలో ఇనుము ఉత్పత్తి ఒకసారి ప్రారంభమైందంటే, ఆ ప్రక్రియ నిరంతరాయంగా రాత్రింబవళ్ళు సాగిపోతుంది. రోజూ 1700 టన్నుల ఇనుము ఖనిజం, 1000 టన్నుల "రాతిబొగ్గు" సుమారు 500 టన్నుల సున్నపురాయి కొలిమిలోకి ఎక్కిస్తారు.

రూర్కెలా, భిలాయ్ లలో కొన్ని బొగ్గు బట్టీలు ఇదివరకే పని ప్రారంభించాయి. ఇవి రోజుకు 1600 టన్నుల బొగ్గును 1000 టన్నుల రాతి బొగ్గుగా మార్పిడిచేస్తాయి. 130 అడుగుల ఎత్తు ఉన్న 3 బ్రహ్మాండమైన స్టౌవుల ద్వారా వేడిగాలి కొలిమిలోకి ప్రవహింపజేసి, ఇనుము కరిగిస్తారు. విద్యుత్కర్మాగారాలు విద్యుత్తును ఆవిరిని ఉత్పత్తిచేస్తాయి.

మరకొలిమిని ఏర్పాటు చేయడం పైకి సులువైన పనిగానే కన్పించవచ్చును. కాని మరకొలిమిలో ఇనుము ఉత్పత్తి ప్రారంభించేముందు, అనేక యంత్రాగారాలను ఏర్పాటుచేసి అవి సమన్వితమైన పద్ధతిలో సక్రమంగా పనిచేసేటట్లు చూడవలసి ఉంటుంది. బొగ్గు బట్టీలు, ఉప ఉత్పత్తుల యంత్రాగారం, విద్యుత్కర్మాగారం, కొలిమి యంత్రం, వాయువును పరిశుభ్రంచేసే యంత్రాగారం ఏర్పాటు చేయడమే కాక, బొగ్గును ఖనిజాన్ని సరఫరాచేసే ఏర్పాట్లు, విద్యుత్తును, వాయువును, నీటిని సరఫరాచేసే ఏర్పాట్లుచేయవలసి ఉంటుంది. ఈ ఏర్పాట్లన్నీ చేయడానికి గడచిన కొలది నెలలుగా, వేలాది సిబ్బంది నిరంతరాయంగా కృషి సాగిస్తున్నారు. యంత్రాగారం స్థాపన నిర్మాణ కార్యక్రమం అంతకంతకు భారతపారిశ్రామిక చరిత్రలో త్వరితగతిని సాగుతోంది. రూర్కెలాలో సుమారు 59,000 మంది భిలాయ్ లో 64,00 మంది పనిచేస్తున్నారు.

మరకొలిమికి ప్రారంభోత్సవం జరపడం అనేది చాలా ముఖ్యవిషయమే గాని, అయితే నిజానికి అది తొలిమెట్టు మాత్రమే. మరో రెండు మరకొలుములు, ఉక్కు కడ్డీల కార్ఖానా, రోలింగు మిల్లులు ఏర్పాటైతేనే గాని ఉక్కు యంత్రాగారం నిర్మాణం, పూర్తిఅయినట్లుకాదు. ఇందుకు సంబంధించిన పని చాలవరకు ఇదివరకే జరిగింది. యంత్ర సామగ్రిలో చాలభాగం ఇండియాకు చేరుకున్నది. ఉక్కు కొలుములు, బొగ్గు బట్టీలు, ఉక్కుకడ్డీల కర్మాగారాలకు పునాదులు పూర్తి అయాయి.

యంత్రాగారం నిర్మాణం కూడా చకచకా సాగిపోతోంది. రూర్కెలా, భిలాయ్ లలో ఉక్కు ఉత్పత్తి సంవత్సరం మధ్యలో ప్రారంభం కాగలదని తెలుస్తున్నది. మొదటి రోలింగు మిల్లులు సంవత్సరాంతంలోగా ఉక్కు ఉత్పత్తిని ప్రారంభించేస్తాయి.

అంటే 1959 లో పెద్ద ఎత్తున నిర్మాణంతో పాటు ఉత్పత్తి కూడా సాగుతోంది.

## యంత్రాగారాలలో ఉత్పత్తి

ఉక్కు యంత్రాగారంలోని వివిధ శాఖలు పని ప్రారంభించిన తర్వాత, రూర్కెలాలో 2,00,000 టన్నుల ప్లేట్లు, రకరకాల మందాలుగల 470,000 రోల్డు రేకులు, 50,000 టన్నుల టిన్ ప్లేట్లు, సుమారు 50,000 టన్నుల కొలిమి ఇనుము ఉత్పత్తి అవుతుంది.

ఉప ఉత్పత్తుల కర్మాగారం రోజుకు 130 టన్నుల తారుతో, బెంజాల్, క్రియోసోట్, నాఫ్తలీన్ మొదలైన పదార్థాలను ఉత్పత్తి చేస్తుంది. ఇవిగాక ప్రాణ వాయు యంత్రాగారంలో మిగులు తేలే నత్రజనిలో ఎరువులను తయారు చేయడానికి ఒక ఎరువుల ఫ్యాక్టరీనికూడాఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ 5,80,000 టన్నుల నైట్రో లైమ్ స్టోన్ ఉత్పత్తి అవుతుంది. అంటే ఈ ఎరువుల కర్మాగారం సింద్రీఅంత పెద్దదిగా ఉంటుందన్నమాట. భిలాయ్ లో 200,000 టన్నుల రైలు పట్టాలు, స్లీపర్లు, 160,000 టన్నుల భారీఉక్కునిర్మాణ సామగ్రి, 26,000 టన్నుల మధ్యరకం ఉక్కునిర్మాణ సామాగ్రి, 150,000 టన్నుల ఉక్కు కడ్డీలు, 300,000 టన్నుల ఇనుము ఉత్పత్తి అవుతాయి.

భిలాయ్ లోని ఉప ఉత్పత్తుల యంత్రాగారం, రోజుకు 130 టన్నుల తారునూ ఉపయోగిస్తుంది. రూర్కెలాలో ఏయే రకాల బొగ్గు తారు పదార్థాలు ఎంతెంత ఉత్పత్తి అవుతాయో యిక్కడా అంతే ఉత్పత్తి అవుతాయి.

రూర్కెలా భిలాయ్ లలో ఉత్పత్తి ప్రారంభమైతే, చిరకాలంగా దేశంలో ఏర్పడిన ఉక్కు కొరత చాలవరకు తీరిపోతుంది. బర్న్ పూర్, జెమ్ షెడ్ పూర్ లలో కొత్తమర కొలుములు పని ప్రారంభించిన తర్వాత, దేశంలో ఉక్కు ఇనుము సరఫరా చాలా అభివృద్ధిఅయింది. రూర్కెలా భిలాయ్ లలో కూడా మర కొలుములు పనిచేయడం ప్రారంభమైతే పరిస్థితి యింకా బాగుపడుతుంది.

## అభివృద్ధి

ఉక్కు ఉత్పత్తుల విషయంలో కూడా 1959 లో పరిస్థితి క్రమంగా అభివృద్ధి అవుతుంది. ఈ సంవత్సరం ప్రథమార్థంలో బర్న్ పూర్, జెంషెడ్ పూర్ లలో సాధారణ భవననిర్మాణానికి కావలసిన ఉక్కు ఉత్పత్తి అవుతుంది. రూర్కెలా భిలాయిలలో రోలింగు మిల్లులు పని ప్రారంభించిన తర్వాత, పరిశ్రమలకు కావలసినరేకులు, రైల్వేలకు కావలసిన ఉక్కు సామగ్రి సరఫరా అధికం అవుతుంది.

మూడు పెద్ద ఉక్కు యంత్రాగారాలను పికాలంలో నిర్మించడం అంటే, చాలా ప్రయాసతో కూడిన పని. చేసే ఎప్పుడవసరం లేదు. ప్రారంభదశలో చిక్కులు ఎక్కువగా ఎదురవడం సహజం.

భిలాయికి కావలసిన యంత్రసామగ్రి యావత్తు రష్యాసరఫరాచేసింది. అయితే నిర్మాణం సాగించి యంత్ర సామగ్రిని అమర్చేపని స్థానికుల మీదే పడింది. విశాఖపట్నం రేవు నుంచి ఈ యంత్ర సామగ్రిని భిలాయికి చేరవేయవలసి వచ్చింది. మొదట్లో ఈ రేవు యింతి సామగ్రిని దింపుకొని రవాణా చేయగల్గిన స్థితిలో ఉండేదికాదు. రూర్కెలాకు కావలసిన యంత్ర సామగ్రిని సుమారు 50 విదేశ కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. కర్మాగారానికి పునాదులువేసి, సివిలు ఇంజినీరింగు పనులు సాగించడానికి ఎంతోమంది కాంట్రాక్టర్లను కుదుర్చుకోవలసి వచ్చింది. ఈ కాంట్రాక్టర్లకు పని కొత్తే కాక అవివిమాలినవైంది. అందువల్ల పనిని సమన్వయపరచడం చాలా కష్టమైంది.

రూర్కెలాలోను భిలాయిలోను గూడ పెద్దవసతి బంగళాలు, గనులు పికాలంలో నిర్మించవలసి వచ్చింది. కాని అనుభవంమీద మొదట్లో ఏర్పడిన చిక్కులన్నీ విడిపోయి 1959 లో సాగించవలసిన నిర్మాణానికి అనువైన వాతావరణం ఏర్పడింది.

### సిబ్బంది శిక్షణ

అన్నిటికన్నా యంత్రాంగారాల నిర్మాణము నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సేకరించి తర్ఫీదు ఇచ్చే పని చాలా క్లిష్టమైనది. దేశంలో ఇదివరకే ఒక పెద్ద ఇనుము, ఉక్కు పరిశ్రమ నెలకొని ఉంటే; శిక్షణ సౌకర్యాల కోసం ఇంతకా తొక్కిసలాడవలసి వచ్చేదిగాదు. దేశంలో ఉన్న రెండు పెద్ద ఉక్కు యంత్రాగారాలను అభివృద్ధి కార్యక్రమాలకు పూనుకోవడంలో, ఆ యంత్రాగారాలలో సిబ్బందికి శిక్షణ యిప్పించే అవకాశం లేకపోయింది. ఇందువల్ల అనుభవం లేని యువక ఇంజనీర్లను రష్యా, జర్మనీ, బ్రిటన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలలో శిక్షణ నిమిత్తం పంపడం అయింది.

ఇదిగాక, కార్మికులకు సాంకేతికులకు అనేక మందికి ఇండియాలోని అనేక పారిశ్రామిక సంస్థలలో శిక్షణ యివ్వడం జరుగుతున్నది. ఇప్పటివరకు సుమారు 1000 మందికి శిక్షణ యివ్వడం పూర్తి అయింది. రూర్కెలా భిలాయిలలో వివిధశాఖలు పని ప్రారంభించిన తర్వాత, అక్కడనే కార్మికులనేక మందికి తర్ఫీదు యివ్వడం అవుతుంది.

అతి వేగంగా ఇంతటి బృహత్తర నిర్మాణ కార్యక్రమాన్ని సాగించడం వల్ల మన సాంకేతికులకు అమూల్యమైన అనుభవం కల్గింది.

ఇప్పుడు లేచే ఉక్కు యంత్రాగారాలలో సాంకేతికులకు కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి అపారంగా సౌకర్యాలు ఏర్పడగలవు. నిర్మాణ సామగ్రితో పాటు, నమూనాలు రూపొందించే వ్యవస్థకూడా మనకు అప్పుడు అందుబాటులో ఉంటుంది.

అదీగాక రాంచీలో భారీ యంత్ర నిర్మాణ కర్మాగారం, దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేక ఫ్యాక్టరీలు ఉక్కు సామగ్రి నిర్మాణకర్మాగారాలు త్వరలోనే నెలకొంటాయి. దీనితో తృతీయ ప్రణాళికలో దేశం నిర్వహించవలసిన కార్యకలాపాలను ఆత్మవిశ్వాసంతో స్వయంకృషితో కొనసాగించడానికి వీలవుతుంది.

### భిలాయ్ లో కంట్రాక్టర్ల దోపిడీ

భిలాయ్, ఫిబ్రవరి 3

మన పరిశ్రమల, ప్రాజెక్టుల నిర్మాణంలో కనిపించే కంట్రాక్టర్ల బెడద భిలాయ్ లోకూడా కానవస్తుంది. ఇక్కడ వారిదోపిడీ సంగతి ఎలావుంచినా, పనికూడా మందకొడిగా వుండడం విశేషం. భిలాయ్ కర్మాగార నిర్మాణంలో కంట్రాక్టర్లు నత్తనడకతో పని సాగించారు.

ఇంతకీ ప్రశ్నేమిటంటే అసలక్కడ కంట్రాక్టర్ వుండాల్సిన పనేమిటి? భిలాయిలోవున్న ప్రతీ కంట్రాక్టరు నిర్మాణానికి అవసరమైన ప్రతి ఒక టన్ను ఉక్కుకి రు. 183 గుంజుకుంటున్నారు. వాస్తవానికి వారికి క్రేన్లు, విద్యుచ్ఛక్తి, ఎలక్ట్రోడ్స్, సాంకేతిక సలహాలు ఉచితంగా లభిస్తాయి. వీటన్నింటినీ రష్యా, భారత ప్రభుత్వాలే సప్లయి చేస్తున్నాయి. అటువంటప్పుడు వారికి టన్ను ఉక్కుకి 183 రూపాయలు చెల్లించాల్సిన అవసరం ఏమివచ్చింది? ఇంతకూ కంట్రాక్టర్ సప్లయి చేసేది ఏమిటయ్యా అంటే కూలీల్ని మాత్రమే. అటువంటప్పుడు ఆ పనిని డిపార్టుమెంటల్ గానే కొనసాగించవచ్చు గదా? ప్రజాధనం ఈ విధంగా దుర్వినియోగపడ్డం క్షంతవ్యమేనా?

డిపార్టుమెంటల్ పని అయితే ఎలా వుంటుందో ఒక ఉదాహరణను చూడండి:

మొట్టమొదటి ఓపెన్ హార్త్ ఫర్నేస్ కు సంబంధించిన ఒక నిర్మాణాన్ని డిపార్టుమెంటువారే కొనసాగించారు. ఫలితంగా పని త్వరగా పూర్తయింది. ఆపని కూడా చాలా నైపుణ్యంతో, దుబారా లేకుండా చక్కగా కొనసాగింది. అటువంటప్పుడు ఇంకా కంట్రాక్టర్ల బెడదవుండాల్సినపనేమిటి?

అలాగే కోక్ ఓవెన్ ఫ్యాక్టరీవిషయం కూడా. వాస్తవానికి దాని నిర్మాణానికి కంట్రాక్టర్ల అవసరంలేదు. కానివాళ్లని తీసుకొచ్చారు.

అలాగేమరో ఉదాహరణ: కాంక్రీట్ పనికి సంబంధించిన ఉక్కు సప్లయిచేసే సంయుక్తానా హిందుస్థాన్ కన్ స్ట్రక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ వారికి టన్ను ఒక్కింటికి 1500 రూపాయలు ఇచ్చారు. సరిగ్గా ఇటువంటి పనికే "గేమన్ ఇండియా" అనే కంపెనీకి టన్ను ఒక్కింటికి రు. 500 లు చొప్పున చెల్లించారు! ఈ వ్యత్యాసం ఏమిటి? ఈ అవకతవక లేమిటి! ఎక్కడో ఒక చోట లోపముంది. దానినే వెదకి పనికట్టి ఇటువంటి అవకతవకలు తొలగి జరగకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం వుంది అన్నారు.

అందువల్లనే మనదేశంలో మూడు ఉక్కు కర్మాగారాల్లోను అత్యంత నైపుణ్యంతో నిర్మితమవుతున్న భిలాయ్ ఉక్కు కర్మాగార నిర్మాణంలో మనకు నిపుణులైన రష్యన్ ఇంజనీర్లు సాయపడుతున్నప్పుడు యిటువంటి అవకతవకల్ని జరుగనీయడం మంచిదికాదు. ఈ లోట్లుకూడా లేకపోతే కర్మాగార నిర్మాణం యింకా త్వరితగతిని పూర్తయేదని యిక్కడి ప్రజలు, అధికారులూ భావిస్తున్నారు.

జాతీయ నిర్మాణ కార్యక్రమంలో ఏమాత్రపు అవకతవకలు జరిగినా మన ఆర్థికాభివృద్ధి క్రమంలో అవి అడ్డంకులుగా తయారవుతాయన్న సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సివుంది.

## భారతదేశంలో సమిష్టి సహకార వ్యవసాయం

### అవసరమని పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకటన

జలంధర్, ఫిబ్రవరి 2

సహకార వ్యవసాయసంఘాలకంటే సమిష్టి సహకార క్షేత్రాల స్థాపనే పంజాబ్ ప్రభుత్వఆశయమని పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ సర్దార్ ప్రతాపసింగ్ కైరాన్ నేడన్నారు. సమిష్టి వ్యవసాయ సహకార సంఘాలతో ఈ కార్యక్రమం ప్రారంభ మవుతుందని ఆయన అన్నారు.

దేశ జనాభా ప్రస్తుతగతిని గనక పెరిగినట్లయితే ఇప్పటికే చాలీ చాలకుండా వున్న కమతాలు ముందు ముందు ఎందుకూ పనికిరాని కొలతలక్రింద విభాగమై పోతాయన్నారు. అందుచేతనే సమిష్టి సహకార వ్యవసాయాన్ని దేశం చేపట్టాలి. ఫలితంగా బ్రహ్మాండమైన పంటలు పండడంలో శాంతి, సౌభాగ్య శకంలో దేశం కాలిడుతుందన్నారు.

భారతదేశఆర్థికదుస్థితికి సహకారవ్యవసాయమే నేడిచక్కటి ఉపాయం. ఈ నూతన విధానంవైపు దేశం ఏనాడు పురోగమిస్తుందో ఆనాడు అందరికీ శాంతి సుఖాలు లభిస్తాయన్నారు; మధ్యదళారీలను తొలగించి ఉత్పత్తిదారునికి వినియమదారునికి సరసమైన లాభాన్ని చేకూర్చాలని ప్రణాళికాసంఘం చేసిన సూచనలు సరైనవే నన్నారు.

భూసంస్కరణల్నిగూర్చి మాట్లాడుతూ శ్రీ కైరాన్ యింకా యిలా అన్నారు: భూములపై గరిష్టపరిమితిని నిర్ణయించే విషయమై స్వార్థపరవర్గాల వారు కొంత గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. పంజాబు విషయమే తీసుకుంటే, యిక్కడ ప్రజలు 97 శాతం మందికి 30 స్టాండర్డ్ ఎకరాలకన్నా ఎక్కువలేదు. ప్రస్తుత సంస్కరణల వల్ల .7 శాతంకూడా నష్టపోరు. ఒకవేళ నష్టపడ్డ వారెవరన్నా వుంటే వారి నుండి తీసుకున్న భూమికి తగు నష్టపరిహారం యివ్వడం జరుగుతుంది.

## దేవాలయ సంఘాల పునర్నిర్మాణం

హైదరాబాద్, ఫిబ్రవరి 2

ఏటా లక్ష రూపాలకు పైబడ్డ ఆదాయంగల దేవాలయాల సంఘాలను తిరుపతి దేవస్థానం సంఘం పంథాలో పునర్నిర్మించాలన్న ప్రతిపాదనఇప్పుడు ఆంధ్రమంత్రివర్గం పరిశీలనలోఉన్నట్లు తెలుస్తున్నది.

దేవాలయ ధనాన్ని విద్యావ్యాప్తికి కాని నగరాభివృద్ధికి కాని వినియోగించడంకోసం ఈ సంఘాలను పైవారితో నిర్మిస్తారు. సంఘాలు ఏర్పడినప్పుడు స్థానిక ధర్మకర్త సంఘాలు రద్దు అయిపోతాయి. (వి. వి.)

## ఎన్. జీ. వో. సలహా సంఘాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2

చిన్న పరిశ్రమల మంత్రి శ్రీ అనగాని భగవంతరావుగారు ఎన్. జీ. వో. ల పోరాటాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ బ్రిటన్ లోలాగా ఇక్కడకూడా సలహా సంఘాలను ఏర్పరిస్తే బాగుంటుందని తామభిప్రాయ పడుతున్నట్లు చెప్పారు. పరస్పర సంప్రతింపులకోసం ఈ సలహా సంఘాలు ప్రతిపాదనలు చేయవచ్చు నన్నారు.

## నల్లగొండ జిల్లాలో పంచాయతీలు

హైదరాబాదు, ఫిబ్రవరి 2

కొన్ని కొత్త పంచాయతీలను ఏర్పరుస్తూ ఆంధ్రప్రభుత్వం జనవరి 17 వ తేదీ గల అసాధారణ గెజిటులో ఒక ప్రకటన చేసింది.

ఈ ప్రకటన ప్రకారం నల్లగొండ తాలూకాలో 48, భువనగిరి తాలూకాలో 61, రామన్నపేట తాలూకాలో 66, సూర్యాపేట తాలూకాలో 72, మిరియాలగూడెం తాలూకాలో 71, హుజూర్ నగరు తాలూకాలో 46, దేవరకొండ తాలూకాలో 88 పంచాయితీలను నిర్మించారు.

## యువజన మహాసభ

(1 వ పేజీ తరువాయి)

భారతదేశంనుంచి భారత జాతీయ కాంగ్రెసు కార్యదర్శి అయిన రామ్ లాల్ పరీక్ నాయకత్వాన ముగ్గురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తర కొరియా, ఉత్తరవియత్నామ్ నవచైనా దేశాలనుండికూడా ప్రతినిధులు వచ్చారు.

సోవియట్ ప్రధాని కృశ్చేవ్, అరబ్బు రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్ ఈ మహాసభకు శుభసందేశాలను పంపారు.

కృశ్చేవ్ సందేశం చదువుతున్నప్పుడు అరబ్బు దేశాల్లోని కొందరు ప్రతినిధులు "తూర్పు వద్దు, పశ్చిమ వద్దు —తాటస్థ్యం కావాలి," అని అరిచారు.

సిరియా కమ్యూనిస్టు నాయకుడయిన ఖలీద్ బాగ్దాద్ కూటమికి వ్యతిరేకంగా కూడా నినాదాలిచ్చారు.

కైరోలో ఆసియా - ఆఫ్రికా బ్యూరో కార్యదర్శి యూసఫ్ అల్ సిబాయి నేటి ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, బాండుంగ్ మహాసభ నిర్ణయించినలక్ష్యాల ననుసరించి పురోగమించడంలో ఏలాంటి ఆటంకాలూ రానివ్వమని అన్నారు.

## రొడీషియా - న్యాసాలాండ్ సమాఖ్య

### బ్రిటిష్ ప్రభుత్వానికి ఆఫ్రికా సమితి వినతి

లండన్, ఫిబ్రవరి 2

రొడీషియా, న్యాసాలాండ్ లసమాఖ్య భవిష్యత్తునుగూర్చి బ్రిటిష్ ప్రభుత్వం మూడు అంశాలతో కూడుకున్న ఒక ప్రకటన చేయాలని "ఆఫ్రికా సమితి" నేడు కోరింది.

సమితి కోరిన మూడుఅంశాలుయివి:

1. పౌరులందరికీ సమానహక్కులు కల్పించడం, జాతి వివక్షకు స్వస్తి చెప్పడం — యివి లక్ష్యాలుగా వున్న ప్రజాతంత్ర దేశాన్ని ఏర్పరచడమే మధ్య ఆఫ్రికా స్వాతంత్ర్యోద్యమం ప్రధాన లక్ష్యాలు.
2. అలా ఏర్పడబోయే సమాఖ్యలో ఫెడరల్ పార్లమెంటు, ప్రభుత్వ పాలనలో ఆఫ్రికన్లకు సముచిత స్థానాన్ని కల్పించడం, యింతకు ముందుకన్నా ఎక్కువ ప్రాతినిధ్యం కల్గించడం అవసరం. లేకపోతే సమాఖ్యాస్వాతంత్ర్యం నామమాత్రమే అవుతుంది.
3. రొడీషియా - న్యాసాలాండ్ సమాఖ్య రాజ్యాంగం స్వరూప స్వభావాలనుగూర్చి, రాజ్యాంగ ఉపోద్ఘాత పాఠాన్ని తు. చ. తప్పక అమలుపరచడాన్నిగూర్చి 1960 నాటి సమావేశం చర్చిస్తుంది. సమాఖ్యనుండి విడిపోవడానికి ఆఫ్రికన్లకుగల హక్కునుగూర్చి కూడా సమావేశం చర్చించాలి.

# నెల్లూరులో ఎన్. జీ. వోల దీక్షా దినం

నెల్లూరు, ఫిబ్రవరి 2

నిన్నటిరోజున నెల్లూరులో ఎన్. జీ. వోలు, ఉపాధ్యాయుల దీక్షాదినం ఘనంగా జరిగింది. పెద్ద ఊరేగింపు అనంతరం బహిరంగసభ జరిగింది. పలువురు వక్తలు ఎన్. జీ. వోల ఇబ్బందులను, ప్రభుత్వవైఖరిని వివరిస్తూ ప్రసంగాలు చేశారు.

నిన్న ఉదయం 8-30 గం॥లకు, ఎన్. జీ. ఓల ఆఫీసు సమీపమున పతాకావిష్కరణము జరిగినది. సాయంకాలము 4 గంటలకు అదేస్థలమునుండి ఊరేగింపు జరిగింది. అందులో నెల్లూరు టౌన్ లో గల ఎన్. జీ. ఓలు, జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘసభ్యులు, నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగస్థులు తమ కోర్కెలను తెలుపు ప్లేకార్డులను ధరించి బ్యాడ్జీలు వేసుకొని 400 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, క్రమశిక్షణతో నినాదరహితంగా ఊరేగింపు జరిపారు. ఈ ఊరేగింపు వి. ఆర్. కాలేజి; పాత పోస్టాఫీసు రోడ్డు, చిన్న బజారు, రంగనాయకులపేట, రైల్వే స్టేషన్ రోడ్డు, సుభాష్చంద్ర బోసు రోడ్డు, ట్రంకు రోడ్డుల గుండా నడిచి, ఎన్. జీ. ఓల, కార్యాలయం వద్దకు చేరింది. అక్కడ సాయంకాలము 7 గంటలకు బహిరంగ జరిగింది. పైసభలో తొలుత వి. ఆర్. హైస్కూలు ఉపాధ్యాయులు, జిల్లా టీచర్సుగిల్డు కార్యదర్శి శ్రీ ఎస్. సుందర రాజారావుగారు మాట్లాడుతూ కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో గూడా మధ్యతరగతులవారు మానసికంగాను, శారీరకంగాను ఏ విధంగా కష్టపడుచున్నారో వివరించారు. 1947 లో జీవిత ప్రమాణ సూచిక 164 వుండగా యీనాడు 390 నుండి 394 వరకు వున్నట్లు ప్రభుత్వ లెక్కల బట్టే తెలుస్తూ వున్నదని, అయినా ప్రభుత్వంచే నియమించబడిన పేకమిటీ సిఫార్సులు ప్రభుత్వోద్యోగుల, ఉపాధ్యాయుల స్థితిగతులను మెరుగుపర్చలేక పోయాయని అన్నారు.

పిమ్మట జిల్లా నాన్ గెజిటెడ్ ఆఫీసర్లసంఘం ప్రతినిధి శ్రీ జె. బాపయ్యగారు పేకమిటీ రిపోర్టులోని ముఖ్యాంశాలను అన్నింటిని విశదీకరించి లోపాలెత్తి చూపించారు. ఈ కమిటీ రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను దృష్టిలోకి తీసుకోలేదనీ, ముఖ్యంగా లోయర్ డివిజన్ క్లర్కులలో నూటికి 70 మందివరకు మాగ్జిమం స్కేలును అందుకోజాలరనీ, [illegible] పది రూపాయలు తగ్గించబడిందనీ, ఈ సిఫార్సులు అమలుజరుపుతున్నందువల్ల ప్రభుత్వానికి యేడాదికి నాల్గున్నర కోట్ల రూపాయలు హెచ్చువ ఖర్చు అవుతున్నదని ప్రకటించినందువల్ల గుమాస్తాలకు ఇంటి అద్దె హెచ్చువ యివ్వవలసివుంటూ చాలిపుంది యేమాయలు అడుగుతున్నారనీ అందుచే ఈ రిపోర్టు ప్రజలకు, ప్రభుత్వోద్యోగులకు వైరుధ్యాన్ని తెచ్చిపెట్టిందనీ చెప్పారు. నేటి ప్రదర్శనంలో పాల్గొన్న అందరికీ అభినందనలు తెలియజేశారు.

తదుపరి శాసనమండలి సభ్యులూ, ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ సంఘ నాయకులూ శ్రీ శింగరాజు రామకృష్ణయ్యగారు ఉపన్యాసం చేశారు. ఇన్ని తరగతుల ఉద్యోగులను ఒకే వేదికమీదకు తెచ్చిన ఫిబ్రవరి 1 వ తేదీ ఉద్యోగుల దినంగా చరిత్రకారులు పేర్కొనవలసి వుంటుందన్నారు. వారిలా అన్నారు. "ఇంతకాలమూ ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు ప్రజలతో సంబంధం లేకుండానే తమ ధర్మాన్ని నిర్వహిస్తూ వచ్చారు. కాని అటుధాన్యం పండించే రైతు అనేక విలువలను సృష్టించుతున్న కార్మికులే కాకుండా యీనాడు బల్ల నంటుకొని రోజుకు ఆరేడు గంటలు పనిచేస్తున్న ఉద్యోగులుకూడ యిలా అన్యాయం చేయబడుతున్నారో చూచాక ప్రజలలో సన్నిహితత్వం లేకపోతే యీసమస్య పరిష్కారం కాదనేసత్యం తేటతెల్లమవుతున్నది. ఈ సంపదంతా యేమయిపోతున్నదో మనం తెలుసుకోవాలి. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమేకాదు. ఇది చాలా లోతు సమస్య. ప్రస్తుత ప్రభుత్వం యిప్పుడున్న పరిధిలో యింతకంటె మెరుగైన సిఫార్సులు చేస్తుందని అనుకోడానికి వీలులేదు. ఆదాయాన్ని బట్టి వ్యయం అనే సిద్ధాంతం కాలదోష సిద్ధాంతం. వ్యయాన్ని బట్టి ఆదాయాన్ని సంపాదించాలి. లేకపోతే యే ప్రణాళికయినా అమలు జరుగుతుందా? ప్రభుత్వోద్యోగులు తమ కోర్కెలను తెలియజేస్తుంటే, రికగ్నిషన్ రద్దు చేస్తానంటుంది ప్రభుత్వం. కాని, మనకు కావలసింది ప్రభుత్వ రికగ్నిషన్ కాదు. అన్ని తరగతుల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజల రికగ్నిషన్ మనం సంపాదించాలి. ఈ ఐక్యతనింకా ముందుకు తీసుకుపోవాలి. మన రాష్ట్రం యీ విషయంలో యావద్భారతదేశానికి ఆదర్శమవ్వాలి" అన్నారు.

తర్వాత జిల్లా ప్రాథమికోపాధ్యాయసంఘ కార్యదర్శి శ్రీ కె. తిరుపాలుగారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ప్రతిదినం పాఠశాలలో ఆరోగ్యమే మహాభాగ్యమని ఉపదేశిస్తుంటారనీ, నాసిరకాల జీతాలతో అర్థాకలి పడుతూ ఆరోగ్యంగూర్చి ఉపదేశాలు చేయడం యెంత అవ్యక్తితమో అర్థమవుతున్నదనీ అన్నారు.

శాసనసభ్యులు శ్రీ జి. యల్లమందారెడ్డిగారు మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ యన్. జి. ఓ. ల, ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను తప్పక బలపర్చుతుందనీ, అనేక కారణాలవల్ల రేపు జరగబోయే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చాలా వుధృతంగా వుంటుందన్నారు.

ఈఅన్ని వుపన్యాసాల పిమ్మట సభాసదులందరిని వుర్రూత లూగించిన వుపన్యాసం కట్టకడపటిది నాల్గవక్లాసు వుద్యోగుల సంఘనాయకుడు శ్రీ వి. బల్లయ్యగారిది. వారిలా చెప్పారు.

'మా వాళ్ళకు కొందరికి అయిదారు రూపాయలు పెంచారు. ఎవరికో తెలుసా. టెంపరరీ వారికి. పర్మనెంటు వాళ్ళకు కాదు. ఇంతకుముందు ముఖ్యమంత్రిగారు మమ్ములను పిలిచి మీకు నెలకు రు 30/ లు చాలవా అని అడిగారు. ఇప్పుడు రు 26/- చేశారు. కోత అన్నమాట. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనవలసిన భూస్వాములు, పెద్దవ్యాపారస్తులు, పెద్ద ఆఫీసర్ల ముక్కులకు తాళంవేయలేక మామీద పడింది యీ ప్రభుత్వం. ఈ మంత్రులంతా ఆరునెలలు బొమ్మగిలోవుండి పెళ్ళాన్ని బిడ్డల్ని పోషించుకున్న రకమైతే మాకు జీతాలు పెంచాల్సిన అవసరంకూడా అర్థమై వుండేది. కాని మనమంత్రులా రకం కాదుగదా. మీ చిన్న వుద్యోగం కోసం ప్రాథేయపడ్డా నీ వేమి ప్యాసయినావు? నీకు డిగ్రీ వుందా అని అడుగుతారే, మరి రెండవ ఫారం తప్పినవాళ్ళుకూడా మంత్రులవి చేస్తున్నారే వింతకాదూ. అందుచేత ఓ మంత్రులూరా! మీరు భూలోకంలోకి వచ్చి మా కష్టాల్ని చూడండి అంటున్నాం" అని ముగించారు.

మహారాష్ట్రప్రాంతంతో మైసూరులోని మరాఠీ ప్రాంతాన్ని కలపాలన్న ఉద్యమం సందర్భంలో అయిదుగురు అరెస్టయినారు.

## శ్రీ వనపర్తి రాజాకు లక్షలడబ్బు ముట్టజెప్పడానికై కుట్ర

### విద్యుదుత్పాదక యంత్రాన్ని రాజాకు అప్పజెప్పి పట్టణానికి విద్యుచ్ఛక్తిసప్లయి లేకుండా చేసిన వైనం

వనపర్తి, ఫిబ్రవరి 2

మహబూబ్‌నగరు జిల్లా వనపర్తి పట్టణంలోని విద్యుదుత్పాదక యంత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాజాగారికి చెందిన ఆస్తి అని ముద్రవేసి, వారికి స్వాధీనంచేసింది. అది స్వాధీనం చేసుకొన్న తరువాత రాజాగారు దాన్ని నడపడానికి నిరాకరిస్తూ, అవసరమయితే ప్రభుత్వం ఆయంత్రాన్ని కొని నడుపుకోవచ్చునని బేరాలు పెడుతున్నారు.

ఈ విధంగా ప్రభుత్వంనుండి కొన్ని లక్షలడబ్బు కాజేయాలని రాజాగారు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారమంతా మంత్రివర్గంలోని ఒక ముఖ్యుని సలహా సంప్రదింపులపైననే జరుగుతున్నదనీ, ఈ డబ్బును ఉభయులూ పంచుకోవాలని రహస్యంగా ఒప్పందం చేసుకొన్నారనీ ఇక్కడ ప్రబలమైన వదంతివుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడా విద్యుచ్ఛక్తి లేనికాలంలోనే వనపర్తిలో విద్యుచ్ఛక్తి సప్లయి జరిగేది. అటువంటిది, ఈ కుట్రవల్ల, గత 10 నెలలుగా పట్టణంలో విద్యుచ్ఛక్తి లేదు.

ఈవిషయమై జనవరి26న వనపర్తిలో కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది. సభకు శ్రీ గోవిందయ్య అధ్యక్షత వహించారు. విద్యుచ్ఛక్తి సప్లయి విషయంలో జరిగిన కుట్రను భగ్నంచేసి పట్టణానికి విద్యుచ్ఛక్తి మళ్ళీ సప్లయిచేయించడానికై 87 మందితో ఒక కార్యాచరణ కమిటీ సభలో ఎన్నుకోబడింది.

సభలో శ్రీయుతులు సత్యనారాయణ, తాలూకాకమ్యూనిస్టు కార్యదర్శి శ్రీహరి, డా. బాలకృష్ణయ్య మొదలగువారు ప్రసంగించారు.

తరువాత క్రింది తీర్మానం చేశారు.

మహబూబునగరం జిల్లాలో, ఏతాలూకాలోనూవిద్యుచ్ఛక్తిలేనప్పుడు వనపర్తిలో 20 సంవత్సరాల నుండి వుంటుంది. కాని యితర తాలూకాల్లో విద్యుచ్ఛక్తి వచ్చినప్పుడు, వనపర్తిలో విద్యుచ్ఛక్తి ఆగిపోవటం ఊహకు అందరాని విషయం. ఆగిపోయినప్పటి నుంచి వనపర్తిలో విద్యుచ్ఛక్తి కావాలని మంత్రి శ్రీ జె. వి. నరసింగరావుతో ప్రజలు మనవిచేస్తూవచ్చారు. కాని నేటివరకూ విద్యుచ్ఛక్తి రాలేదు. తక్షణమే వనపర్తిలో విద్యుచ్ఛక్తి సప్లయిచేయాలని ఈ సభ మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తూఉన్నది.

తీర్మానంపై ప్రసంగిస్తూ శ్రీహరి ఇలా అన్నారు:

ఈవిద్యుచ్ఛక్తిచాలాకాలంనుండి వనపర్తి సంస్థాన ప్రభుత్వంక్రింద నడుస్తోంది. మంత్రి శ్రీ జె.వి.నరసింగరావు, విద్యుచ్ఛక్తి యంత్రాలు మొదలగు ఆస్తి వనపర్తి రాజాగారిదనిముద్రవేసి ఆయనగారి పరంచేశారు. వీరుభయులూ కూడ పాల్గొని అన్ని తాలూకాలకు మంజూరైన విద్యుచ్ఛక్తిని వనపర్తికి మాత్రం రాకుండా చేసివేశారు. రాజాగారిపరమైన ఈ ఆస్తికి కొన్ని లక్షల డబ్బు ఆ రాజాగారికి ఒప్పజెప్పాలని కుట్రతో మంత్రిగారు ఇలారాకుండా చేశారు. ఇప్పటికీ విద్యుచ్ఛక్తిని ఇంకా పెంపొందించి ప్రజల అవసరాలను తీర్చవలసిందివుంది. విద్యుచ్ఛక్తినిఅసలే తీసివేయటం మంత్రులు చేయవలసిన పనికాదు. ప్రజాప్రతినిధిగా చలామణి అయ్యేవారు శ్రీ రామేశ్వరరావుగారు ఈ కుట్రలో పాల్గొన్నారంటే గర్హనీయం.

సభకు సుమారు 2 వేల మంది వచ్చారు. రంగస్వామిదళంవారి గొల్లసుద్దులూ, చిత్ర విచిత్రవేషాలతో సభ ముగిసింది.

### అల్లూరి సీతారామరాజు జీవిత వివరాల సేకరణ

తణుకు, ఫిబ్రవరి 1

విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జీవిత వివరాలను సేకరించేందుకు ప్రభుత్వం "నేతాజీ" గ్రంథకర్త శ్రీ యర్రమిల్లి నరసింహారావుగారిని నియమించింది.

సీతారామరాజు చరిత్రను ప్రచురించడానికి ప్రభుత్వం సంకల్పించిన సంగతి పాఠకులకు తెలుసు.

శ్రీ నరసింహారావుగారు వివరాల సేకరణకై త్వరలోనే విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో సంచారం చేస్తారు. సీతారామరాజుని ఎరిగినవారు, ఆయన వీరకృత్యాలను గురించి తెలిసినవారూ చాలామంది వున్నారు. వారినందరిని, వీలైనంతవరకూ కలుసుకోవాలని శ్రీ నరసింహారావుగారి అభిలాష. అట్టివారందరూ తమకు వ్రాయవలెనని ఆయన కోరుతున్నారు.

### పంటలు దెబ్బతిన్న గ్రామాలకు రెమిషన్

ఘట్టుపల్లి సభ అభ్యర్థన

కాగజ్‌నగర్, జనవరి 31

నేడిక్కడ తాలూకా రైతుసంఘ ఆధ్వర్యాన జరిగిన బహిరంగసభలో, వరదలవల్ల పంటలు దెబ్బతిన్న గ్రామాలకు శిస్తు రెమిషను ఇవ్వాలనీ, అధిక వర్షాలవల్ల వ్యాపారపంటలు దెబ్బతిన్నందున, వ్యాపార పంటలపై పన్నులు రద్దుచేయ్యాలని, చెట్లు లేక సాగుకు లాయకైన భూములను రిజర్వు నుండి తొలగించి భూమిలేని పేదలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

సభకు శ్రీ గోపీనాథ్ అధ్యక్షత వహించారు. తాలూకాలో 15 గ్రామాల రైతులుఈ సభలో పాల్గొన్నారు.

సభలో పాల్గొనడానికై ఇక్కడకు వచ్చిన శాసనమండలిసభ్యులూ, కమ్యూనిస్టు నాయకులు శ్రీ గంగారాంగారికి కాగజ్‌నగర్ స్టేషన్‌లో ప్రజలు ఘన స్వాగతమిచ్చారు. స్టేషన్ నుండి ప్రజలు, పార్టీ కార్యాలయానికి వచ్చారు. తదనంతరం దగ్గరలోవున్న ఘట్టుపల్లి గ్రామంలో బహిరంగసభ జరిగింది.

### వనపర్తిలో నలభై ఏళ్లనాటి పన్ను బకాయీల వసూలు

వనపర్తి, జనవరి 31

"సంస్థాన ప్రభుత్వం హయాములోని ముఫ్ఫయి, నలభై ఏండ్ల పన్నుల బకాయీలను కాంగ్రెసు ప్రభుత్వం కూడ రైతులనుండి వసూలు చేయ సమకట్టడం క్షమించరాని విషయం" అని మహబూబ్‌నగరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శ్రీ లక్ష్మణాచారి ఇక్కడికి 14 మైళ్ళలో వున్న శ్రీరంగపురం గ్రామంలో జరిగిన బహిరంగ సభలో అన్నారు.

సభకు శ్రీ అచ్చపురాజు అధ్యక్షత వహించారు.

శ్రీ లక్ష్మణాచారి ఇంకా యిలా అన్నారు:

ఈ బకాయీలు, ఇదివరకు జాగీరుదారు వసూలుచేసే గుర్రంపన్ను, గుగ్గిళ్ళపన్ను, కూటంపన్ను బాబతువి; ఆనాటి జాగీరుదారుల అడుగుజాడల్లోనే కాంగ్రెసు ప్రభుత్వంకూడ నడుస్తుందని మనం కలలో కూడా అనుకోలేదు. ఈ అన్యాయాలను రైతులు సంఘటితమై ఎదుర్కోవాలి."

శ్రీ కె. రంగస్వామి దళంవారి వైజ్ఞానిక ప్రదర్శనలతో సభ ముగిసింది.

### బోయిగూడ అభ్యుదయ యువజన సంఘ వార్షికోత్సవం

బోయిగూడ, జనవరి 27

సికింద్రాబాద్ బోయిగూడ అభ్యుదయ యువజనసంఘ ద్వితీయ వార్షికోత్సవం నిన్న సాయంత్రం జరిగింది. సికింద్రాబాదు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ ఎస్. సాంబమూర్తి అధ్యక్షత వహించారు.

సంఘ కార్యదర్శి శ్రీ కె. యస్. ప్రసాద్ సంఘ కార్యకలాపాలపై నివేదిక సమర్పించారు.

సభలో కమ్యూనిస్టు నాయకులు శ్రీ కె. యల్. మహేంద్ర, యస్. సత్యనారాయణరెడ్డిగారలు ప్రసంగించారు. తరువాత రాత్రి పాఠశాల విద్యార్థులకు శ్రీమతి ఇందిరాదేవి బహుమానాలు పంచారు.

శ్రీ బద్రీనాథ్ జానపద నృత్యాలు, బోలారాం యువకులు ప్రదర్శించిన "బ్రహ్మలోకంలో సమ్మె", చిరంజీవులు కల్పన, జగదాంబ, ఎలిజబెత్, విజయలక్ష్మి మొదలగువారి సమిష్టి గానం, సదస్యుల మెప్పులందుకొన్నాయి.

సభకు సుమారు 2 వేలమంది ప్రజలు వచ్చారు.

### పోలీసు సహాయంతో కాంగ్రెసు తీర్థం

కోహీర, జనవరి 30

కరీంనగరం తాలూకాలో మండల కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ఇట్కిరెడ్డి జగ్గారెడ్డి (కోహీరగ్రామ పంచాయితీ అధ్యక్షుడు) స్థానిక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరును తన వెంటబెట్టుకొని కాంగ్రెసులో సభ్యత్వం చేర్పిస్తున్నారు. చేరడానికి తిరస్కరించిన వారిని ఏదో ఒక కేసులో ఇరికించడానికి ప్రయత్నిస్తున్నారు.

### కమ్యూనిస్టులపై గూండాల దాడి ఖండన

కరీంనగరం, జనవరి 31

కరీంనగరం తాలూకా జనగామలో ఇటీవల కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలపైన, ముఖ్యంగా తాలూకా కమిటీ సభ్యుడైన అనజోయిన మల్లయ్యపైన గూండాలు చేసినదాడిని ఖండిస్తూ కరీంనగరం తాలూకా కమ్యూనిస్టుకమిటీ తీర్మానించింది. ఈ దాడికి పోలీసుల ప్రోత్సాహమున్నట్లు తెలుస్తున్నదనీ, పై అధికారులు వెంటనే జోక్యం కలిగించుకొని, గుండాలను అదుపులో పెట్టకపోతే, పరిస్థితులు విషమించగలవనీ కమిటీ హెచ్చరించింది.

### గొల్లపల్లి

నూజివీడు తాలూకా గొల్లపల్లి గ్రామంలో 30 వ తేదీ రాత్రి గ్రామ పార్టీశాఖ ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది. పంచాయితీ సభ్యులు చెన్నుపాటి వేణుగోపాలరావుగారు అధ్యక్షత వహించారు.

జిల్లారైతుసంఘ కార్యదర్శి పేట రామారావు, దాసరి నాగభూషణరావుగార్లు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమంపై మాట్లాడారు.

కోనూరి పున్నయ్య భాగవతార్ గారి తీర్థయాత్ర హరికథతో సభా కార్యక్రమం ముగిసింది.

### ప్రజాకవి మగ్దూం

జంషెడ్‌పూరు, ఫిబ్రవరి 2

"సామ్రాజ్యవాదానికి సైనిక నియంతృత్వానికి వ్యతిరేకంగా బడుగు దేశాల్లో సాగుతున్న పోరాటాలలో కమ్యూనిస్టుపార్టీ అగ్రగామిగావుంది. కొన్ని దేశాల్లో సామ్రాజ్యవాదుల కుట్రలు కొనసాగకుండ వుండడానికి ప్రధాన కారణం, అక్కడ బలమైన కమ్యూనిస్టుపార్టీ, ఇతర ప్రజాస్వామిక శక్తులూ ఉండడమే" అని ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు, కార్మిక నాయకులు అయిన మగ్దూం మొహియుద్దీన్ ఇక్కడ జరిగిన బ్రహ్మాండమైన సభలో అన్నారు.

రిపబ్లిక్ దినోత్సవంనాడు జరిగిన ఈ సభకు వేలమంది కార్మికులు వచ్చారు. సభ జిల్లాకమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన జరిగింది.

శ్రీ మగ్దూం మొహియుద్దీన్, హిందీ వారపత్రిక "స్వాధీనత" సంపాదకుడు ఆచార్య యదునందామిశ్రా గేయాలు వినడానికై వేలాది కార్మికులు రాత్రి చాలా పొద్దుపొయ్యేవరకు కాచుకొని కూర్చున్నారు.

టాటాకంపెనీవారు పట్టణంలో వుచితంగా చిత్రప్రదర్శనాలు మొదలగు వినోదాలు ఏర్పాటు చేసినప్పటికీ కార్మికులు ఈ సభకే రావడం గమనించవలసిన విశేషం. పెట్రొమాక్సు లైటు ఆరిపోయినప్పటికీ కార్మికులు చీకటిలో శ్రీ మగ్దూం గేయాలు వింటూ కూర్చున్నారు.

### పరీక్షల పర్యవేక్షణకు సెకండరీ ఉపాధ్యాయుల నిరాకరణ

లక్నో, జనవరి 29

ఈ యేటి బడ్జెట్‌లో ఉపాధ్యాయుల జీతాలు పెంచుతూ తగు ధనాన్ని కేటాయించకపోతే రేపు మార్చిలో జరగనున్న హైస్కూలు, ఇంటర్మీడియట్ పరీక్షల్లో తాము పర్యవేక్షణ చేసేదిలేదని యు. పి. సెకండరీ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి తెలియ పరిచారు.

జీతాలస్కేళ్ళు పెంచాలనీ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలోపాధ్యాయుల జీతాల వ్యత్యాసాన్ని తొలగించాలని వీరు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం సమానమైన పనికి సమానవేతనం అన్న సూత్రాన్ని అంగీకరించిందికాని ధనాభావంవల్ల ప్రైవేటు పాఠశాలోపాధ్యాయులజీతాలు పెంచజాలమని చెప్పింది. జీతాలు ఇంతలో అంతో పెంచుతామని మాత్రం చాలా సార్లు వాగ్దానం చేసింది.

ఈసారి ఉపాధ్యాయులు స్పష్టమైన హెచ్చరిక చేశారు. బడ్జెటులో విద్యాపద్దు చర్చకు వచ్చేరోజున శాసన సభముందు ప్రదర్శనం చేయాలని వారు నిశ్చయించారు. ఆతర్వాత నిరాహార దీక్ష పూనుతామనీ, పరీక్షపర్యవేక్షణను బహిష్కరిస్తామనీ తెలిపారు.

(ఐ. పి. ఏ.)

### 'లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీచేయాలి'

మంగళగిరి, ఫిబ్రవరి 2

మంగళగిరిప్రాంత అసిస్టెంటు లేబరు ఇనస్పెక్టరును వెంటనే బదిలీ చెయ్యాలని కార్మికశాఖామంత్రిని కోరుతూ జనవరి 30 వ తేదీ మంగళగిరి గుమాస్తాలసంఘ కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

అసిస్టెంటు లేబర్ ఇనస్పెక్టర్ సంఘ కార్యకర్తలమీద వొత్తిడి తీసుకొని వచ్చేందుకు వారి యజమానుల వద్దకు వెళ్ళి, సంఘంలోవున్న వారి పదవులకు రాజీనామాలను యిప్పించాలని, లేనియెడల వుద్యోగంనుండి తొలగించాలని, గుమాస్తాలమీద లేని పోని మాటలు చెప్పుతున్నాడనీ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ విషయమై లేబరు కమీషనరుకు రిపోర్టులువ్రాసినప్పటికి ప్రయోజనంలేకపోయిందని,ఇనస్పెక్టరు ఇష్టంవచ్చినట్లు ప్రవర్తించుటవల్లసంఘ మాజీ కార్యదర్శి శ్రీ వెలిగళ్ళ వీరాంజనేయులు తనవుద్యోగానికి రాజీనామా ఇవ్వవలసి వచ్చిందన్నారు.

### నౌపడాలో 10 వేల ఉప్పు కార్మికులకు నిరుద్యోగం

రాష్ట్రేతర ప్రాంతాలకు కార్మికుల వలస

నౌపడా, ఫిబ్రవరి 2

నౌపడాలో గత సంవత్సరం ఉత్పత్తి చేయబడిన ఉప్పులో. నూటికి పదివంతులుకూడ నేటివరకు అమ్ముడుపోలేదు. దీనివలన నౌపడాలో వున్న అన్ని ఉప్పు ఫ్యాక్టరీలు, మైనరు లైసెన్సుదారులు వుప్పు కార్మికులకు ప్రతి సంవత్సరం అడ్వాన్సు రూపంలో చెల్లిస్తున్న 5 లక్షల రూపాయలు యీ సంవత్సరం పూర్తిగా ఆపివేశారు. దీని ఫలితంగా నౌపడా ఫిర్కాలో 10 వేల మంది ఉప్పు కార్మికులకు నిరుద్యోగం ఏర్పడింది. ఉప్పు కార్మికులు చేలై,రూర్కెలా మొదలగు రాష్ట్రేతర ప్రాంతాలకు వలస పోతున్నారు.

ఇక్కడ 400 మంది మైనరులైసెన్సుదారులు వున్నారు. మైనరు లైసెన్సుదారు షావుకారులవద్ద రు 20/- కోత వడ్డీకి రు 100 లకు నోటు(వ్రాసి రు80లే వాడుతున్నారు) ఋణంతెచ్చి ఉప్పు ఉత్పత్తిచేయిస్తాడు. ఈఉప్పు మొదటనే చౌకగా వడ్డీ వర్తకులకు విక్రయిస్తాడు. వర్తకులు ఉప్పు ధర పడిపోవడంవల్ల బళ్ళు అద్దెలు మినహాయించి మైనరు లైసెన్సుదారునివద్ద ఉప్పుకొంటారు. అందువల్ల ఒకవైపున విపరీతమైనవడ్డీలు, రెండవవైపున వర్తకుడు భరించవలసిన బళ్ళ అద్దెలు మైనరు లైసెన్సుదారునిపై రుద్దడంచేత ఉప్పు వుత్పత్తి మైనరు లైసెన్సుదారునకు ఏ మాత్రం కిట్టుబాటులేదు. నష్టంకూడ వస్తున్నది.

### 'నౌపడాలో సోడా ఫ్యాక్టరీ స్థాపించాలి'

నౌపడా, జనవరి 31

నౌపడాలో సోడాఫ్యాక్టరీస్థాపించి, తద్వారా నౌపడా ఉప్పుకు మార్కెట్టు చూపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ టెక్కలి తాలూకా నౌపడా కమ్యూనిస్టుశాఖ సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి శ్రీ దుక్క సన్యాసిరెడ్డి అధ్యక్షతవహించారు.

ఉప్పు ఫ్యాక్టరీలన్నీ, మళ్ళీ తెరిచేటట్టు ప్రభుత్వమే చూడాలని, చౌక డిపోలు తెరువాలనికూడ సమావేశంలో తీర్మానించారు.

### రాజకోటలో విద్యార్థినుల ప్రదర్శన

రాజకోట, ఫిబ్రవరి 1

రాజకోట బాలికోన్నత పాఠశాల సమీపంలో థియేటరును నిర్మించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ 1000 విద్యార్థినులు పెద్ద ఊరేగింపు జరిపారు.

తమ పాఠశాలకు సమీపంలో థియేటరును నిర్మించరాదని కోరే వినతి పత్రంపై విద్యార్థినులు 20 వేల మంది వద్దనుంచి సంతకాలు సేకరించారు. ఈ వినతిపత్రాల ప్రతులను వారు జిల్లా కలెక్టరుకు సమర్పించారు.

### మానుకోట తాలూకా అధికార కాంగ్రెసువారిచే హత్యలూ, లూటీలు

వరంగల్లుజిల్లాకమ్యూనిస్టుకమిటీ తీర్మానం

వడ్లకొండ, జనవరి 31

మానుకోట తాలూకా కోరుకొండపల్లిలో అర్ధరాత్రివేళ ప్రదేశ్ కాంగ్రెసు కార్యదర్శి నూకల రామచంద్రారెడ్డి గ్రూపుకుచెందినకాంగ్రెస్‌వారు, దాసరి ముత్తిలింగం, చెన్నమల్లు రామస్వామి మొదలగువారు తమ ప్రత్యర్థి గ్రూపు జన్నారెడ్డి గ్రూపుకు చెందిన దాసరి. సాయిలును తోటవద్ద కాపలాగా పడుకొనివున్న సందర్భాన హత్య చేసినట్లు తెలిసింది.

పోలీసులు మొదట కొంత ఆలస్యం చేసినా 4 - 5 రోజులతర్వాత దాసరి ముత్తిలింగం, ఆయన తమ్ముడు చెన్నమల్లు, ఆయన కుమారుడు రామస్వామిని అరెస్టుచేసినట్లు, మానుకోట కస్టడీలో పెట్టినట్లు తెలుస్తుంది.

వరంగల్లుజిల్లా, మానుకోట తాలూకాలో అధికారకాంగ్రెసు గ్రూపుకు చెందినవారు ప్రత్యర్థులను హత్యచేయడం, వారి ఆస్తిని లూటీచేయడం మొదలగు ఘాతుకకృత్యాలు సాగిస్తున్నందువల్ల తాలూకాలో శాంతి భద్రతలు లేకుండా పొయ్యాయని వరంగల్లుజిల్లా కమ్యూనిస్టు కమిటీ తీర్మానించింది. తాలూకాలోని ప్రభుత్వ యంత్రాంగాన్ని శ్రీ నూకల రామచంద్రారెడ్డి తన గుప్పిట పెట్టుకొన్నందువల్ల పరిస్థితులు విషమించాయని, ఆ తీర్మానంలో పేర్కొన్నారు. కమిటీ జనవరి 23,24 తేదీల్లో వరంగల్లుజిల్లా వడ్లకొండ గ్రామంలో సమావేశమయింది.

కమిటీ చేసిన తీర్మాన పాఠమిది:

మానుకోట తాలూకాలో రోజురోజుకు అధికార కాంగ్రెసు గ్రూపువారు చేస్తున్న అరాచకచర్యలు, హత్యలపై వరంగల్ జిల్లా కమ్యూనిస్టు కమిటీ సమావేశం తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతున్నది.

జనవరి 12 వ తేదీన కోరుకొండపల్లిలో అధికార కాంగ్రెసు గ్రూపుకు చెందిన దాసరి ముత్తిలింగయ్య, చెన్నమల్లు మొదలగువారు తమ ప్రత్యర్థి గ్రూపుకు చెందిన దాసరి సాయిలును అర్ధరాత్రివేళ తోటవద్ద పండుకొనివున్న సమయంలో చంపారు. ముత్తులింగం, చెన్నమల్లు, రామస్వాములను అరెస్టుచేసినట్లు తెలియుచున్నది.

కొంతకాలంక్రింద ముంగిమడుగులో అధికార కాంగ్రెసుకు చెందిన కొందరు పరిసర గ్రామ జమీందార్ల నాయకత్వాన లంబాడితండాపై "నూకల రామచంద్రారెడ్డికి జై" అంటూ దాడిచేసి బజ్యా అను ముసలి లంబాడి రైతును చంపారు. మరో యిద్దరిని తీవ్రంగా గాయపర్చి కాళ్ళు, చేతులు విరుగగొట్టారు. ఇంకా వర్ణించరాని పనులు చేశారు. ఇంత జరిగినా పోలీసువారు ఈ కేసును పైకి రాకుండా చేశారు.

ఈమధ్యనే తోడెళ్ళగూడెంలో నూకలరామచంద్రారెడ్డి అనుయాయుడైన పగడాల వెంకయ్య తన పాలేరు అయిన పది సంవత్సరాల పిల్లవాడు గొల్ల లింగయ్యను కొట్టి చంపాడు. రెండు రోజులు శవాన్ని దాచివుంచి తర్వాత ఏదో పంచనామా చేయించి కేసును అణచివేయటం జరిగింది.

ఈ హత్యలే కాకుండా ఎన్నో గ్రామాలలో నూకల రామచంద్రారెడ్డి గ్రూపుకు చెందినవారు ప్రత్యర్థుల యిండ్లపై దాడిచేయడం, వారి ఆస్తులు లూటీచేయటం యింకా ఎన్నో అరాజకపనులు చేస్తున్నారు. ఉదాహరణకు, కందికొండ, అమ్మపాలెం, బొజ్జన్నపేట, వెన్నారం, ముంగిమడుగు, రామన్నగూడెం, కేసముద్రం మొదలగు గ్రామాలలో విచ్చలవిడిగా అరాజక చర్యలు సాగించబడుతున్నాయి.

రాజోలు గ్రామపంచాయితీబోర్డు అధ్యక్షులూ, జిల్లాకమ్యూనిస్టుకమిటీ సభ్యుడూ అయిన శ్రీ వెంకట్రాములుగారిని చంపుతామని నూకల రామచంద్రారెడ్డిఅనుచరులుగ్రామవీధులలో కేకలు వేస్తున్నారు.

ఈ హత్యలూ, అరాజకచర్యలలో తాలూకాలో శాంతిభద్రతలు లేకుండా పోయాయి. ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణలేకుండా వుంది. ఈ తాలూకాలోని ప్రభుత్వ యంత్రాంగం అంతా నూకల రామచంద్రారెడ్డిగ్రూపు చెప్పుచేతలలో వుండుటచే పరిస్థితులు మరీ విషమించాయి.

ఈ విషయాలపై వెంటనే నిష్పాక్షికంగా విచారణజరిపి, అరికట్టించాలని వరంగల్లుజిల్లా కమ్యూనిస్టుకమిటీ ప్రభుత్వాన్ని కోరుతున్నది. ఈ దారుణాలకు, హత్యలకు గురిఅయినవారి కుటుంబాలకు గాఢసంతాపాన్ని వెలిబుచ్చుతున్నది. వీటిని గురించి తగు విచారణ జరిపి అవసరమయిన చర్యలు తీసుకునేటట్లు చేయుటకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఆందోళన చేయాలని కోరుతున్నది.

### బాగ్దాద్ కూటమి సమావేశంపై చైనా పత్రికల వ్యాఖ్యలు

పెకింగ్, ఫిబ్రవరి 2

"కరాచీలో ఇటీవల జరిగిన బాగ్దాద్ కూటమి సమావేశం సమాప్తమైన తీరు చూస్తే పశ్చిమాసియాలో సామ్రాజ్యవాదులకు ముప్పతిప్పలై, మూడు చెరువుల నీళ్ళుతాగినట్లు అవుతుంద"ని ఇటీవల పెకింగ్‌లోని స్థానిక పత్రికలు వ్యాఖ్యానించాయి.

కరాచి సమావేశం ప్రధానంగా అరబ్ దేశాలకు వ్యతిరేకంగా ధ్వజమెత్తిందని, అందులోను ముఖ్యంగా ఐక్య అరబ్ రిపబ్లిక్, ఇరాక్ రిపబ్లిక్‌లకు వ్యతిరేకంగా జరిగినట్టిదేనని అవి వ్రాశాయి.

"వాస్తవానికి పశ్చిమాసియాలో దురాక్రమణ పథకాల్ని అమలు జరుపడంలో సామ్రాజ్యవాద శక్తులు తీవ్రమైన కష్టాల్ని ఎదుర్కోవలసివస్తుంది. అరబ్ దేశాల సమైక్యతాభావం, ప్రపంచంలోని శాంతికాముక శక్తుల ప్రతిఘటన - వీటిముందు సామ్రాజ్యవాద శక్తుల నూతన దురాక్రమణ పథకాలన్నీ నీట కలవాలిసిందేనని "టాకుంగ్ పావో" అన్న పత్రిక వ్యాఖ్యాత వ్రాశాడు.

### రైతుతో బండి కట్టించుకొని పోయి,బండీఎద్దుల్ని పన్నుకు జమకట్టించుకొన్న తహశీల్దార్

కొల్లాపురం, జనవరి 31

పన్ను బకాయీల వసూలుకై ఒక గ్రామానికి వెళ్ళిన డిప్యూటీ తహశీల్దారు అక్కడనుండి ప్రయాణానికై ఒక రైతుతో బండి కట్టించుకొని వెళ్ళిపోయి, ఆ రైతుకు చెప్పకుండా ఆ బండీ, ఎద్దులను బకాయీలకై జప్తుచేసినఉదంతం ఇక్కడ తెలియవచ్చింది.

కొల్లాపురం తాలూకా కొర్లమంట అనే గ్రామానికి జనవరి 18 న కొల్లాపురం నాయబు తహసీల్దారు వెళ్ళారు. వెళ్ళిందే తడవుగా శ్రీ ప్రకాశరావు ఇంటికివెళ్ళి జాగీరుకాలంనాటి బకాయీలూ తక్షణమే యివ్వమన్నారు. ప్రకాశరావుగారు చాలా ఆశ్చర్యం జెంది ఎక్కడి బకాయీ, ఏమిటి అని అడుగుతే, మొదట దాఖలు చేసి, తర్వాత మాట్లాడమన్నారు.

అంత ప్రకాశరావు "బకాయి వున్నట్లు నాకు జ్ఞాపకంలేదు. అయినా మీరు న్యాయంగా లెక్కలు చూపించితే జమకట్టుతా"నన్నారు. ఆతర్వాత నాయబు తహశీల్దారు "ఇక గ్రామానికి వెళ్ళిపోతాను బండికట్టి యివ్వండి" అన్నాడు. శ్రీ ప్రకాశరావు, నాయబు తహశీల్దారును బండిఎక్కించి పంపించారు. అధికారి నర్సాయపల్లి గ్రామానికివెళ్ళి రాత్రి 8గంటలకు అదే గ్రామంలో పంచనామా చేసుకున్నారు. సింగవట్నమనే గ్రామానికి వచ్చి పోలీసు పటేలు స్వాధీనం చేసినట్టురసీదు పొంది అదేబండిలో కొల్లాపురం వెళ్ళి ఎద్దులను బందెలో పెట్టాడు. బండినితహసీలు కచేరీముందు విడిచాడు. ఉదయమే బండివెంటపోయిన కావలివారువచ్చి బండి, ఎద్దును జాగీరు బకాయీలక్రింద తహశీల్దారు జప్తిచేసుకొనికొల్లాపురంతీసుకెళ్ళారనిచెప్పారు.

నాయబు తహశీల్దారు వైఖరిగా అక్రమ బకాయీవసూళ్ళకు నమ్మకద్రోహం చేసినందుకు మున్సిఫ్ మేజిస్ట్రేటుకోర్టులో కేసుపెట్టబడింది.

జాగీరుకాలంనాటి బకాయీలు వసూలు చేసేందుకు ప్రభుత్వానికి ఎలాటి అధికారంలేదని హైకోర్టులో రిట్ పెట్టబడింది.

జాగీరుకాలంనాటి బకాయీలు వసూలు ఆపువరకు ఆందోళనసాగించాలని తాలూకా కమ్యూనిస్టుపార్టీ, రైతు సంఘాల ఆధ్వర్యంక్రింద జరిగిన బహిరంగసభలో తీర్మానించారు.

### సభలు సమావేశాలు

తెనాలి తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుల, సానుభూతిపరుల సమావేశాలు ఈ దిగువవిధంగా ఏర్పాటు చేయబడ్డాయి. సమావేశాలన్నీ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమౌతాయి.

ఫిబ్రవరి 6 వ తేదీ వేమూరు: అమృతలూరుఫిర్కా, కొల్లూరుఫిర్కా, వేమూరు ఫిర్కాలు.

7వ తేదీ కొల్లిపర: కొల్లిపర ఫిర్కా, అనంతవరం, ఈపూరు, చిలుమూరు, చదలవాడ, కుచ్చళ్ళపాడు, క్రాప, యొల్లబాడు, దుగ్గిరాల ఫిర్కా.

8వ తేదీ తెనాలి: తెనాలిఫిర్కా, చేబ్రోలుఫిర్కా, కొలకలూరు, చిలువూరు, మంచికలపూడి, దుగ్గిరాల.

◆ ◆ ◆

పల్నాడుతాలూకా పడియ లేబరు సంఘ ద్వితీయ మహాసభ, ఫిబ్రవరి 8, 9 తేదీలలో ఒప్పిచెర్లలో జరుగుతుంది.

◆ ◆ ◆

శ్రీకాకుళం తాలూకా గ్రామోద్యోగుల వార్షికసభ శ్రీకాకుళంలో ఫిబ్రవరి 15 వ తేదీన జరుగుతుంది.

### గోకినేపల్లి ప్రాంతీయ కమ్యూనిస్టు కమిటీ

ఖమ్మం, జనవరి 31

ఖమ్మం తాలూకా గోకినేపల్లి ప్రాంతీయ కమ్యూనిస్టు కమిటీ కార్యకర్తల సమావేశం జనవరి 25వ తేదీనాడు మేడేపల్లి గ్రామంలో జరిగింది.

ప్రాంతీయ కమిటీ కార్యదర్శిగా శ్రీ పయ్యావుల లక్ష్మయ్యగారు ఎన్నుకోబడ్డారు. కమిటీ సభ్యులుగా యీ ప్రాంతంలో వున్న గ్రామ శాఖ కార్యదర్శులు, తాలూకా, జిల్లా సమితి సభ్యులు వుంటారు.

ఈ ప్రాంతంలో యీ సంవత్సర వెయ్యి రూపాయలు కమ్యూనిస్టు పార్టీ నిధికి వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

### నెల్లూరు కాల్పులకు నిరసన

జక్కేపల్లిగూడూరు, జనవరి 31

నెల్లూరుజిల్లా కావలి తాలూకా జక్కేపల్లిగూడూరు గ్రామ కమ్యూనిస్టుశాఖ సభ్యులు, సానుభూతిపరుల సమావేశము జనవరి 25 న సోమేశ్వరపురం గ్రామంలో శ్రీ మొల్లూరు శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తాలూకా కమ్యూనిస్టు కమిటీ సెక్రటేరియట్ సభ్యులు శ్రీ షేకు ఖాసింగారు ఈనాడున్న ఆహారపరిస్థితిని వివరించారు. నెల్లూరు పట్టణంలో గత డిసెంబరు నెలలో జరిగిన పోలీసు కాల్పులకు నిరసన తెలియజేస్తూ,తక్షణమే కాల్పులలోచనిపోయిన, గాయపడినవారి కుటుంబాలకు ప్రభుత్వము నష్టపరిహారము యివ్వాలనీ, కాల్పులపై బహిరంగ విచారణ జరుపవలసిందనీ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

### టెండరు నోటీసు

గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకా అచ్చమ్మపేట పంచాయితీ ఆఫీసునందు ఈ క్రిందచూపబడిన ఫర్నిచరు కొరకు ఈ క్రింద సంతకము చేసినవారిచే 10-2-59 వ తేదీ పగలు 4 గంటలకు టెండర్లు తీసుకొనబడును. అదే తేదీ సాయంకాలము 6 గంటలకు టెండర్లు తెరువబడును. తక్కిన వివరములు పంచాయితీ పనిచేయు కాలమందు తెలుసుకొనవచ్చును.

ఫర్నిచరు:

| | |
|---|---|
| 1. గాడ్రేజి బీరువా | 1 |
| 2. స్టూలు | 1 |
| 3. ఈజీచైరు, స్టాండు | 1 |
| 4. డ్రాయరు | 1 |
| 5. కుర్చీలు | 9 |
| 6. ఆనుడు బెంచీలు | 2 |

గంజవబోయినరామసూర్యనారాయణ,
అచ్చమ్మపేట, పంచాయితీ
బోర్డు ప్రెసిడెంటు, 2-2-59.

### టెండరు నోటీసు

తాడేపల్లి పంచాయితీ

గుంటూరుజిల్లా, తాడేపల్లి పంచాయితీ తాలూకు యీదిగువ వివరములు సప్లయిచేయుటకు 1959 సం॥ ఫిబ్రవరి నెల 9వ తేదీ సోమవారము సాయంత్రము 4 గంటలవరకు యీ దిగువ చెప్పబడినవారిచే సీలువేసిన టెండర్లు స్వీకరించబడును. అదేరోజు సాయంత్రము 4-15 గం. లకు టెండర్లు తెరువబడును. Dust bins టెండర్లు అప్రూవుడు కంపెనీలనుండి మాత్రమే తీసికొనబడును. పూర్తి వివరములు ఆఫీసు పనిచేయుకాలములో తెలిసికొనవచ్చును.

1. 4'X2½' సైజుగల రోలరు డిపాజిటు: రు. 20/-లు.
2. 3'X3' సైజుగల సిమెంటు Dust bins. డిపాజిటు : రు. 20/-
3. D. D. T స్ప్రేయర్ (కొటేషన్లు తీసికొనబడును.)

(సం.) యం. కోటేశ్వరరావు,
కార్యనిర్వాహణాధికారి,
తాడేపల్లి పంచాయితీ, 2-2-59

దొంగలనుండి, అడవిమృగాల నుండి కాపాడుకొనండి.



దృఢమైన ఈ రివాల్వర్ 6 ఆటోమటిక్ తోటాలను కాల్చును. వనభోజనాలకు, ప్రయాణాలకు, డ్రామాలకు బాగా పనికివస్తుంది. తేలికైనది. వివిధ సైజులలో దొరకును. పెద్ద ధ్వని యిచ్చును. కండ్లు మిరిమిట్లు గొలిపే నిప్పు రవ్వలు లేచి మిమ్ము అపాయము నుంచి కాపాడును.

| ధర నం. | 777 | 888 | 999 |
|---|---|---|---|
| | రు. 8-50 | 10-50 | 15-00 |

25 తోటాలు ఉచితం. 25 అదనపు తోటాలు రు 1.50 న. పై. 100 తోటాలు రు. 5/-, తోలు సంచి రు. 6/-, ఆయిల్ బాటిల్ రు. 1/-, పోస్టేజి రు. 2/- రెండు అంతకంటె ఎక్కువ పిస్టల్సుకు ఆర్డరు యిస్తే పోస్టేజి ఉచితం. వి. పి. గా పంపబడును. లైసెన్సు అవసరంలేదు.

ATOMIC CORPORATION (V.A)
Post Box No. 4088, Bombay-7.

జమ్మివారి "లివర్ క్యూర్"
పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులకు
ప్రతినెలా ఆగమన తేదీలు:

మా కష్టమర్సు ఉపయోగం నిమిత్తం మా డాక్టరు ప్రతినెలా క్రింద తెలిపిన విధముగా ఆయా తేదీలలో ఆయా ప్రదేశములలో సలహా లొసంగుటకు విచ్చేతురు

| స్థలము | తేదీ | ప్రతిచోటా సలహా లిచ్చు టైము: ఉదయం: 9 నుండి 11 వరకు; సాయంత్రం: 3 నుండి 5 వరకు | అడ్రసు |
|---|---|---|---|
| నెల్లూరు | 6 | ఉ॥ 9 నుండి 11 గం॥లు మాత్రం | అజంతా హోటల్, ట్రంక్‌రోడ్. |
| సికింద్రాబాద్ | 8 | 9 నుండి 12 | తాజ్‌మహల్ హోటల్. సరోజినీదేవి రోడ్. |
| హైద్రాబాద్ | 9 | .. .. | రాజమహల్‌హోటల్. కింగ్‌కోటీరోడ్. |
| తెనాలి | 12 | 9 నుండి 11 | కన్యకా పరమేశ్వరీ సత్రం. |
| గుంటూరు | 14 | ... .. | మెడికల్ స్టోర్సు, కొత్తపేట |
| బందరు | 18 | ... .. | ఆనందాఫార్మసీ,కెమిస్టు, మెయిన్ రోడ్ |
| రాజమండ్రి | 19 | ... .. | యీశ్వరదాస్ & కో. జండు కంపెనీ ఏజెంట్లు; యిన్నీసుపేట. |
| భీమవరం | 20 | ... .. | ప్రసాద్ సన్సు అండ్ కో. కెమిస్టు. |
| జంషెడ్‌పూర్ | 15 తేది | ఉ॥ 9-11 సా॥ 4- 6 | సిటీకెమిస్ట్సు, సాక్చి |
| ఖరగ్‌పూర్ | 4 తేదీ | ఉ॥ 9-11 సా॥ 3-5 | యునైటెడ్ మెడికల్‌స్టోర్సు, కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు |

N. T. E. 155 రైల్వే మార్కెట్

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్సు,
(బ్రాంచి)

గుండా కృష్ణమూర్తి బిల్డింగ్
17/329 నాగేశ్వరరావు పంతులురోడ్
గాంధీనగర్-విజయవాడ.

ఒడుగంటివారి వీధి,
విజయనగరం సిటీ.

182/1 మహాత్మా
గాంధీరోడ్,కలకత్తా.

# ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజనోత్సవాలు

## రాజమండ్రిలో మే 17 నుండి 24 వరకు జరపాలని నిర్ణయం

గుంటూరు, ఫిబ్రవరి 2

ఆంధ్రప్రదేశ్ ప్రథమ విద్యార్థి యువజనోత్సవాలు రాజమండ్రిలో మేనెల 17 నుండి 24 వ తేదీవరకు జరపాలని ప్రదేశ్ యువజన సమాఖ్య కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు.

ఈ సమావేశం జనవరి 31, ఫిబ్రవరి 1 తేదీలలో గుంటూరులోని ప్రదేశ్ యువజన సమాఖ్య కార్యాలయంలో శ్రీ జి. వి. నారాయణరావుగారి అధ్యక్షతన జరిగింది. కార్యవర్గసభ్యులు తమ తమ జిల్లాలలో ఉద్యమపరిస్థితులను వివరించారు.

కార్యవర్గానికి శ్రీయుతులు ఏ. వెంకటరెడ్డి (చిత్తూరు), యస్. బి. శ్రీహరి (మహబూబ్ నగర్ జిల్లా) గార్లను కో-అప్ట్ చేసుకున్నారు. సంఘాలను అనుబంధించుకోడానికి నియమాలను రూపొందించారు.

ప్రథమ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజనోత్సవాలు రాజమండ్రిలో మేనెల 17 వ తేదీ నుండి 24 వరకు జరపాలని నిర్ణయించారు.

ఉత్సవాలలో ఫుట్ బాల్, వాలీ బాల్, బాడ్మింటన్, హాకీ, బేస్ బాల్, చెడుగుడు, ఖోఖో, చెట్టుపట్టీ, బాస్కెట్ బాల్, క్యారమ్సు, చెస్సు మొదలగు ఆటలలోను; కుస్తీలు, బరువు ఎత్తుట, గుండు విసరుట, హైజంప్, లాంగ్ జంప్, పోల్ జంప్, డిస్కస్ త్రో, ఈటె విసరుట, 100, 400 మీటర్లపరుగు, మోకులాగుట, ఈత సైకిల్ రేస్ మొదలగు స్పోర్ట్సులోను, యువతులకు ప్రత్యేకంగా బ్యాడ్మింటన్, రింగ్ టెన్నిస్, సూదిలో దారం గుచ్చుట, పొటాటో రేస్, మ్యూజికల్ చెయిర్సు, స్పూన్ అండ్ లైమ్ మొదలగు వాటిలోనూ పోటీలు జరపాలనినిర్ణయించారు.

నాటకాలు, నాటికలు, బుర్రకథలు, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషాలు, వీణ, ఫిడేలు, మృదంగం, నాదస్వరం, క్లారనెట్, ఫ్లూట్, హాత్ ఆర్గన్, గాత్రం, జానపదనృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, డప్పు వాద్యాలలోకూడా పోటీలు జరపాలని నిశ్చయించారు.

తెలుగులో నాటిక, కథానిక, గేయ, వ్యాస, పద్యరచనలలోను, ఉరుదూలో కథానిక, గేయ, వ్యాస రచనలలోను; వక్తృత్వం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, శరీర సౌష్ఠవంలోను పోటీలు జరపాలని నిశ్చయించారు.

ఈ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన బడ్జెట్టు, ఇతర వివరాలను చర్చించారు. ఉత్సవ నిర్వహణకు గాను మార్చి 1 వ తేదీన విజయవాడలో ఒక సమావేశం జరిపి సన్నాహకసంఘాన్ని ఏర్పరచాలని, ఆ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని రాజకీయపార్టీల, వివిధ ప్రజాసంఘాల, యువజన, విద్యార్థి సంఘాల, క్రీడా, సాంస్కృతిక వైజ్ఞానిక సంఘాల ప్రతినిధులను, యువజనోద్యమంపట్ల, కార్యక్రమాల పట్ల ఆసక్తిగల పార్లమెంటు, శాసనసభల సభ్యులను, సినీ నటీనటులను, రచయితలు, ఇతర వైజ్ఞానిక, క్రీడా రంగాల నిపుణులను, అన్ని పత్రికల సంపాదకులను ఆహ్వానించాలని నిర్ణయించారు.

తరువాత ఈ దిగువ తీర్మానాలు ఆమోదించబడినవి.

అల్జీరియా విమోచనోద్యమ నాయకుని పర్యటనను జయప్రదమొనరించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

మూడవ పంచవర్ష ప్రణాళికలో యువజన సంక్షేమ కార్యక్రమాలకు రెండవ ప్రణాళికలోకంటె హెచ్చు మొత్తాలను కేటాయించవలసిందిగా భారతప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ బస్సులలో రేట్లు పెంచాలనే ప్రతిపాదన అక్రమమనీ, ఆ ప్రయత్నాన్ని విరమించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు.

లైబ్రరీ సెస్సు పేర వసూలు చేసిన మొత్తాలను ఖర్చుపెట్టే అధికారంకూడా వసూలు చేసిన ప్రాంత పంచాయితీలకు, మునిసిపాలిటీలకు యివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇకముందు ఏర్పాటు చేయబోయే డెవలప్ మెంటుబ్లాకులను నిర్ణయించటంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యత యివ్వవలసిందిగా కోరారు.

### బొడ్డువారిపాలెం

ఒంగోలు తాలూకా సంతనూతలపాడు శివారు బొడ్డువారిపాలెం హరిజన పాలెంలో వ్యవసాయకూలీ యువకులు ఈనెల 24వ తేదీ "విశాలాంధ్ర" పత్రికా పఠనమందిరాన్ని ప్రారంభించారు. మందిరనిర్వాహణకు నూతలపాటి పున్నయ్య, వంజా వెంకయ్య, ఎద్దుకోటయ్య గార్లతో ఒక కమిటీని ఎన్నుకొన్నారు.

### యువ సమాచార్

గుంటూరు, ఫిబ్రవరి 2

ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య తరఫున "యువసమాచార్" అను పేరుతో బులిటెన్ ప్రచురించాలని సమాఖ్యకార్యవర్గం నిర్ణయించింది.

"యువసమాచార్" తొలిసంచిక, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రపంచ విద్యార్థి యువజన దినోత్సవము గు ఫిబ్రవరి 21 వ తేదీకి వెలువడుతుంది.

ఒక్కొక్క ప్రతి ఖరీదు ఆరు నయా పైసలు. వివిధ యూనిట్లు తమకు కావలసిన కాపీలకు ఈనెల 10 వ తేదీలోగా డబ్బు పంపాలి. ఒక్కొక్క కాపీ కావలసినవారు కాపీ ఖరీదు, పోస్టేజి కలిసి 14 న. పై. పోస్టల్ స్టాంపులు పంపాలి.

### ఆంధ్ర లయోలాకాలేజి ఆటల పోటీలు

విజయవాడ, జనవరి 31

ఆంధ్ర లయోలాకాలేజీలో జనవరి 24 వ తేదీన సాంవత్సరిక ఆటలపోటీలు జరిగాయి. ప్రదేశ్ గృహనిర్మాణ, సహకారశాఖా మంత్రి శ్రీ నవాబ్ మెహదీనవాజ్ జంగ్ ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు పంచిపెట్టారు.

### కాంట్రాక్టు బ్రిడ్జి ఆటలపోటీలు

తెనాలి, జనవరి 28

లజపతిరాయ్ మెమోరియల్ క్లబ్ యాజమాన్యాన అఖిలభారత కాంట్రాక్టు బ్రిడ్జి ఆటలపోటీలు ఈనెల 24, 25, 26 తేదీలలో తెనాలిలో జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్యశాఖా కార్యదర్శి శ్రీ కపూర్ గారిఅధ్యక్షతను 26 వ తేదీని బహుమతి ప్రదానోత్సవం జరిగింది. గుంటూరు జిల్లా జడ్జి శ్రీ వరపుద్దీన్ గారు బహుమతులు పంచారు. డూప్లికేట్ నాకౌట్ లో గెల్చినవారికి బంగారు పతకాలు, తక్కినవారికి వెండికప్పులు యివ్వబడ్డాయి.

### ఎమెచ్యూర్ ఎథెలిటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు

ఏలూరు, జనవరి 31

ఆంధ్ర ఎమెచ్యూర్ ఎథెలిటిక్ ఆరవ ఛాంపియన్ షిప్ పందెములు జనవరి 16, 17, 18 తేదీలలో ఏలూరులో సి. ఆర్. రెడ్డి కాలేజీ గ్రౌండ్సులో జరుపబడ్డాయి. మొత్తం 80 మంది పురుషులు, 30 మంది బాలురు, 15 మంది స్త్రీలు పాల్గొన్నారు. ఈ సంవత్సరం మొదటిసారిగా, సదరన్ రైల్వే టీము, పోస్టు అండ్ టెలిగ్రాఫ్ ఆంధ్రసర్కిల్ టీములు పాల్గొన్నాయి.

ఏడవ ఆంధ్రరాష్ట్ర ఛాంపియన్ షిప్ పోటీలు తిరుపతిలో జరుగగలవని గౌరవ కార్యదర్శి శ్రీ వి. ఎస్. ఎన్. మూర్తి తెలియజేశారు. జిల్లాకలెక్టరు సతీమణి విజేతలకు కప్పులను, సర్టిఫికెట్టులను బహూకరించారు.

### మధిర తాలూకా ఆటల పోటీలు

వైరా, జనవరి 28

ఖమ్మం జిల్లా మధిర తాలూకా జానకీపురం గ్రామంలో జనవరి 25 వ తేదీన ప్రారంభమైన తాలూకా చెడుగుడు, బ్యాట్ మింటన్, వాలీ బాల్ పోటీలు నిన్నటితో సమాప్తమైనాయి. రిపబ్లిక్ దినోత్సవ సందర్భముగా ఏర్పాటైన ఈ ఆటలపోటీలలో 12 చెడుగుడు టీములు, 16 బ్యాట్ మింటన్ టీములు పాల్గొన్నాయి. ఆటగాండ్ర కోరికపై వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేయడంచేత 5 టీములు మాత్రమే పాల్గొన్నాయి.

27 వ తేదీ రాత్రి బహుమతి ప్రదానోత్సవం జరిగింది. శ్రీ పాటిబండ్ల రఘుపతిరావుగారు అధ్యక్షత వహించారు. విజేతలకు అధ్యక్షులు బహుమతులు పంచారు. అనంతరం బాలురకు, బాలికలకు పాటలపోటీ ఏర్పాటు చేయబడింది.

ఆల్జీరియాలో ఫ్రెంచి దుష్కృత్యాన్ని ఖండిస్తూ పశ్చిమబెంగాల్ ఎ. ఐ. టి. యు. సి. వారు ఒక తీర్మానం చేశారు.

### నర్సారావుపేట కళాశాల వార్షికోత్సవం

నర్సారావుపేట, జనవరి 30

నర్సారావుపేట శ్రీ సుబ్బరాయ, నారాయణ కళాశాల నవమ వార్షిక సభలు జనవరి 26, 27, 28 తేదీలలో జరిగాయి. జనవరి 26 న శ్రీ మద్ది సుదర్శనం కళాశాల ఎన్. సి. సి. విద్యార్థులనుండి వందనం స్వీకరించారు. సాయంత్రం సభలకు శ్రీ వి. సుబ్బారావు (ప్రిన్సిపాలు, హిందూకళాశాల గుంటూరు) అధ్యక్షత వహించారు. శ్రీయుతులు "అమరేంద్ర", గుఱ్ఱం మల్లయ్య, 'ధనరుధరం' వెంకటాచార్యులు ఉపన్యసించారు. తరువాత "లివింగ్ డెజర్ట్" అను సినిమా ప్రదర్శింపబడింది.

రెండవరోజు సభకు శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. శ్రీయుతులు వేదుల సత్యనారాయణశాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, డాక్టరు జార్జి థామస్ గార్లు ఉపన్యసించారు. ఆ పిదప 'బంగారు సంకెళ్లు' అను నాటిక ప్రదర్శింపబడింది.

మూడవరోజు సభలకు శ్రీ ఎం. ఆర్. నారాయణమూర్తిగారు అధ్యక్షత వహించారు. శ్రీ ప్రయాగ నరసింహశాస్త్రిగారు (ఆకాశవాణి, విజయవాడ) "దేశకవిత – జానపద వాఙ్మయా"న్ని గూర్చి ఉపన్యసించారు. తదుపరి విద్యార్థి సంఘ కార్యదర్శి శ్రీ దొంతరాజు సుబ్బారావు తననివేదికను చదివారు. శ్రీ ఇలింద్ర రంగనాయకులు, (ప్రిన్సిపాలు) తమనివేదికలో కళాశాల అభివృద్ధిని గురించి వివరించారు.

పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక బాలికా పాఠశాల ప్రధానోపాధ్యాయిని కుమారి జి. ప్రభావతిగారు బహుమతి ప్రదానం చేశారు. తరువాత "మొండిఘటాలు" "ఎత్తుకు పైఎత్తు" అను నాటికలు ప్రదర్శింపబడ్డాయి.

# ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్

## ఖర్గపూర్ లో ప్రారంభోత్సవం

ఖర్గపూర్, జనవరి 26

ఎన్నో సంవత్సరాలుగా జరిగిన కృషిఫలితంగా నిన్న ఖర్గపూర్ లో ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్ ఏర్పడింది. కన్నులపండువుగా అలంకరింపబడిన సభా ప్రాంగణంలో సహృదయ ప్రేక్షకలోకంతో నిండిన హాల్లో పరిషత్ నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. సభకు ప్రొఫెసర్ వల్లూరి సుబ్బరాజుగారు (ఐ. ఐ. టి.) అధ్యక్షత వహించారు.

పరిషత్ నాటకోత్సవాలకు శ్రీ చలంగారు ప్రారంభోత్సవం చేశారు.

శ్రీ చలంగారు తన ఉపన్యాసంలో నాటకాలు, నటులను గురించి ప్రస్తావించారు. నాటకాలకూ, నటులకూ ముఖ్యంగా కావల్సింది సహృదయ ప్రేక్షకలోకం. నాటకాల్లో పద్యాలనేవి మధ్యస్థంగా వచ్చిపడ్డాయి. సాంఘిక నాటకాల్లో పద్యాలు ఉండకూడదని వాదించే వాళ్లుందరూ, నాటక కళకేదో పెద్ద ఉపద్రవాన్ని తెచ్చిపెడుతున్నారనేది నిజంకానేకాదు. రాష్ట్రేతరాంధ్రుల్లో మంచి కళాకారులున్నారు. విజయనగరం, రాజమహేంద్రవరాల్లో జరిగిన నాటకోత్సవాల్లో రాష్ట్రేతరాంధ్ర ప్రాంతంనుండి రెండే రెండు నాటకసమాజాలు వెళ్ళి పాల్గొన్నాయి. రెండిటికీ బహుమతులు వచ్చాయి. విజయనగరంలో మా సమితివారికి (ఎ. డి. యల్. సొసైటీ -జంషెడ్ పూర్), రాజమహేంద్రవరంలో "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" వారికీ బహుమతులు వచ్చాయి. ఆంధ్రదేశంనుండి వచ్చిన నాటక సమాజాలవారిలో, ప్రవాసాంధ్ర కళాకారులు ఏమాత్రం తీసిపోరని ఈ సంఘటనలు చాటుతున్నాయన్నాడు.

ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ ఎం. వి. రావుగారు ఉపన్యసిస్తూ, ఆంధ్రకు అయిదారు వందలమైళ్ళ దూరంలో వున్న రాష్ట్రేతరాంధ్రులకోసం ఈ ఉత్సవాలుఏర్పాటు చేసినప్రవాసాంధ్ర కళాకారులకు జోహార్లు అర్పించారు.

కుమారి ఎమ్. ఉష ప్రార్థన గీతంతో సభ ప్రారంభమైంది.

పరిషత్ తరఫున కార్యదర్శి శ్రీ శశిభూషణపాత్రో ఉపన్యసిస్తూ ఇలా అన్నారు:

"పారిశ్రామికంగా మన ఆంధ్రదేశం ఎంతో వెనుకబడి వుండటంవల్ల తెలుగు ప్రజలు బ్రతుకు తెరువుకోసం పరరాష్ట్రాలకూ, పరదేశాలకూ వలసలు పోతున్నారు. ఇలా వలసపోయిన వారిలో కళారాధకులకు చేయూత నివ్వడం మా ఉద్దేశం.

ఆధునిక లలితకళలకు ఆయువుపట్టు అయిన వంగదేశం నడిగడ్డమీద, తెలుగు జాతి సంస్కృతినీ, సాహిత్యాన్నీ, కళలనూ వంగీయులకూ, మిగతాజాతుల వారికీ ప్రదర్శించి ఆంధ్రమాత గొప్పతనాన్ని ప్రదర్శించుకొనే అవకాశం ఈనాటికి కలిగింది.

ఆంధ్రప్రభుత్వమూ, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ కూడా, ఈ ప్రవాసాంధ్రలోని కళాకారులను, తమ తమ సంఘాల్లో సభ్యులు గాచేర్చుకొని, కోటిమంది ప్రవాసాంధ్రులకు న్యాయంచేకూర్చగలరని ఆశిస్తున్నాం"

తదుపరి నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో ఎనిమిది నాటికలు ప్రదర్శింపబడ్డాయి. ఒక ప్రత్యేక ప్రదర్శన ఇవ్వబడింది. ప్రథమ బహుమతి "మానవుడు" నాటికను ప్రదర్శించినవారికి, ద్వితీయ బహుమతి "యీ యిల్లు అమ్మబడును" ప్రదర్శించిన సమాజానికీ వచ్చాయి. ఉత్తమ నటుడు ప్రథమ బహుమతి "ఏ మిజీవితాలు" లో నటించిన శ్రీ పి. జి. కాశ్యప్ గారికీ, ద్వితీయ బహుమతి "స్వప్నసీమ"లో నటించిన శ్రీ కె. వి. ఆర్. మూర్తిగారికీ లభించాయి. ప్రథమ బహుమతి పొందిన శ్రీ కాస్యప్ గారికి శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారి రోలింగ్ కప్ కూడ బహూకరించబడింది.

ఇవిగాక ప్రత్యేక బహుమతులు 'నాగశ్రీ' రచించిన "కళకోసం"లో నటించిన శ్రీ ప్రసాద్ గారికీ, కుమారి ప్రయాగ అన్నపూర్ణకు, "ఈ యిల్లు అమ్మబడును"లో విశాలాంధ్రుడుగా నటించిన శ్రీ జె. వి. శ్రీరామమూర్తి గారికి, "ఏ మిజీవితాలు"లో మురుగేశం అయ్యర్ గా నటించిన శ్రీ చింతల అప్పారావుగారికీ లభించాయి.

ఉత్సవాలు ముగించేముందు "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" ప్రముఖసభ్యులు (మాజీ సంయుక్త కార్యదర్శి) శ్రీ అతి జగన్నాథం పంతులుగారు, రాష్ట్రేతరాంధ్రులు నాటకాలువేస్తూ ఎదుర్కొనే చిక్కులను వివరించారు. 'ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్' సంగ్రహ చరిత్రను చెబుతూ, అది 1955 నుంచీ సాధించిన మహత్తర కార్యాలను ఉద్ఘాటించారు.

పోటీల్లో పాల్గొన్నవారికి రసాయనిక శాస్త్రోపన్యాసకులు డాక్టరు ఎం. నరసింగరావు (ఐ. ఐ. టి.)గారు బహుమతులు పంచిపెట్టారు.

పరిషత్ కార్యదర్శులు శ్రీ శశిభూషణ పాత్రో, శ్రీ ఎస్. ఆర్. నందిగార్ల వందన సమర్పణతో నాటకోత్సవాలు సమాప్తమైనాయి.

# పన్ను బకాయీల వసూళ్ళలో ప్రభుత్వ మిచ్చిన సౌకర్యం

## వమ్ముచేస్తూన్న గ్రామాధికారుల చర్యలకు నిజామాబాద్ జిల్లా రైతుమహాసభ నిరసన

మాధవనగరం, జనవరి 31

రైతులు తక్కావీ బకాయీలు 6 కిస్తీలలో చెల్లించవచ్చునని ప్రభుత్వం కల్పించిన సౌకర్యానికి విరుద్ధంగా గ్రామాలలో పటేల్, పట్వారీలు మొత్తమంతా ఒకేసారి వసూలు చేస్తున్నందుకు నిజామాబాదుజిల్లా తృతీయ రైతు మహాసభ నిరసిస్తూ తీర్మానించింది.

చెరకు పండించే రైతులకు గత మూడు సీజనులనుండి యివ్వవలసిన 1 కోటి రూపాయలను వెంటనే యిప్పించే ఏర్పాటు చేయించాలనీ, యీ జిల్లాలో స్థాపించదలచిన కో-ఆపరేటివ్ పంచదార ఫ్యాక్టరీకి ప్రభుత్వం తన వంతు కేటాయించవలసిన 12 లక్షలను వెంటనే కేటాయించాలనీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతూ మహాసభలో మరొక తీర్మానం చేశారు.

నిజామాబాద్ జిల్లా తృతీయ రైతు మహాసభ జనవరి 26, 27 తేదీలలో నిజామాబాద్ తాలూకా మాధవనగరంలో శ్రీ రాజాగణేష్ అధ్యక్షతన జరిగింది. సభకు జిల్లా నలుమూలలనుండి షుమారు150 మంది ప్రతినిధులు, సౌహార్ద ప్రతినిధులు హాజరయ్యారు.

రైతుల హక్కులకోసం, తమప్రాణాలను అర్పించిన వీరులకు, సానుభూతిసూచకంగా ప్రతినిధులంతా రెండు నిమిషాలు లేచి నిలబడ్డారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ వై. వి. కృష్ణారావుగారు ప్రారంభోపన్యాసం చేశారు. వారి ఉపన్యాసంలో రైతాంగం ప్రపంచంలో జరిగే ప్రతిమార్పును జాగ్రత్తగా అర్థంచేసుకొని, మార్పులకు అనుగుణంగా తమకార్యవిధానాలను రూపొందించుకోవాలనీ, మన పొరుగుదేశమైన చైనా ఎందుకు శరవేగంతో ముందుకు పోతుందో ఆలోచించాలనీ, మనరైతాంగంకూడ పంటలు పండించడంలో ముందుకు పోవాలని అన్నారు. రైతులంతా విరివిగా రైతుసంఘాలలో చేరాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణారావుగారి ఉపన్యాసఅనంతరం జిల్లాసంఘకార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికలో రైతుసంఘం తమ హక్కుల కొరకై పోరాడుతుందనే విశ్వాసం రైతులకు కలిగిందని, అందువల్ల రైతుసంఘంయొక్క పలుకుబడి పెరిగిందని, దానినంతా రైతుసంఘ కార్యకర్తలు సంఘటిత రూపంలో నిర్మించుకోవాలని హెచ్చరించారు. కొలది మార్పులతో నివేదిక ఆమోదింపబడింది. పిమ్మట కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టబడ్డాయి.

27 వ తేదీన ప్రతినిధుల సమావేశానికి మేకా పట్టాభిరామయ్య అధ్యక్షత వహించారు.

మహాసభలో ఇంకా క్రింది తీర్మానాలు చేశారు:

నిజాంసాగర్ కాలువను యింకా పెంచి ఎక్కువ నీరు పారేటట్టు చేయాలి. చిన్న కాలువలకుకూడా ఆయకట్టును స్థిరీకరించి, నీటిపారకాన్ని క్రమబద్ధంచేసి, పెద్దకాలువ చివరనున్న ఆర్మూర్ తాలూకాకుకూడ నీరు పూర్తిగా అందేటట్టు ప్రభుత్వం శ్రద్ధవహించాలి.

ఖారిజ్ ఖాతా, బంచరాయి, సైరాన్ మొదలైన భూములను సేద్యం చేసుకుంటున్న రైతులపై తావాన్లు వేయరాదు. భూములలోఉన్న సాగుదార్లందరికి వెంటనే పట్టాలివ్వాలి.

భూములకు రిజిస్ట్రేషన్ ఏర్పాట్లు చేయాలి. గ్రామాలలోని పటేల్, పట్వారీల, రెవెన్యూ అధికారుల అన్యాయాలను అరికట్టాలి. రోజువారీ పరిపాలనలో అధికారపక్షంవారు జోక్యం కలిగించుకోరాదు. పరపతి సౌకర్యాలు రైతులకు విరివిగా ప్రభుత్వం కలిగించేటట్టు చూడాలి. జిల్లా కేంద్రంలో ఒక అగ్నిమాపకదళ కేంద్రాన్ని ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి. కామారెడ్డి, ఎల్లారెడ్డి తాలూకాలలో ఉన్న చెరువులను శ్రద్ధతీసుకుని ప్రభుత్వం వెంటనే మరమ్మతు చేయించాలి. రు 3600/- లు నికరాదాయం వచ్చే భూమి గరిష్ఠపరిమితిగా నిర్ణయించాలి.

నూతన సంవత్సరానికి 51 మందితో కూడిన ఒక స్థాయిసంఘం ఎన్నుకోబడింది. స్థాయిసంఘం సమావేశమై క్రింది 17 మందితో కూడిన ఒకకార్యనిర్వాహకవర్గాన్ని ఎన్నుకుంది.

అధ్యక్షులు: శ్రీయుత మేకాపట్టాభి రామయ్య, ఉపాధ్యక్షులు: శ్రీయుత రాజేశ్వరగౌడ్, ఎం. గోపాలరెడ్డిగారు; ప్రధానకార్యదర్శి: ఓబులం శివోలయ్య సహాయ కార్యదర్శులు: శ్రీ వేములపల్లి వెంకటదాసు, నర్సారెడ్డిగార్లు.

సభ్యులు: శ్రీయుతులు వేమూరి బాలయ్య, ముమ్మలనేని రామారావు, నర్సాగౌడ్, నారాయణరెడ్డి, కోగంటి సత్యనారాయణ, బోడే వెంకట్రాజు, గంగారెడ్డి, త్రిపురనేని రాఘవేంద్రరావు, రామకృష్ణయ్య, వి. వి. రాజాగణేష్ వకీలు, ఇనుగంటి రంగనాయకులుగార్లు.

### 'రైల్వే అధికారి సర్క్యులర్ ఉపసంహరించాలి'

చీరాల, జనవరి 31

దక్షిణరైల్వే ఎంప్లాయిస్ యూనియన్ చందాలు రైల్వే ఆవరణలో వసూలుచెయ్యకూడదని విజయవాడ డివిజనల్ సూపరింటెండెంటు పంపినసర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని, ఈ సర్క్యులర్ ట్రేడ్ యూనియన్ ప్రాథమిక హక్కులకు భంగకరమని చీరాల రైల్వేకార్మికులు రైల్వే జనరల్ మేనేజరుకు టెలిగ్రాం పంపించారు.

### అరబ్ రిపబ్లిక్ - రష్యా సంబంధాలు

#### రిపబ్లిక్ ఉపాధ్యక్షుని ప్రకటన

కైరో, ఫిబ్రవరి 1

ఐక్య అరబ్ రిపబ్లిక్ కు వ్యతిరేకంగా సిరియా ప్రాంతంలో కమ్యూనిస్టులు తలపెట్టిన 'చర్యల్ని' రిపబ్లిక్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా ఎదుర్కొంటుందని ఐక్య అరబ్ రిపబ్లిక్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్ బోగ్దాదీ నేడిక్కడ ఒక ఇంటర్వ్యూలో అన్నారు.

స్థానిక కమ్యూనిస్టులు సాగిస్తున్న ఈ చర్యలవల్ల ఐక్య అరబ్ రిపబ్లిక్ - సోవియటు యూనియన్‌ల మధ్య సంబంధాలేవీ చెడిపోవని కూడా ఆయన అన్నారు. ఈ సంబంధాలు ఉభయదేశాల ప్రభుత్వాలపట్ల హృదయపూర్వకంగాపరస్పర గౌరవాభిమానాల మీద ఏర్పడ్డమే ఇందుకు కారణమని ఆయన అన్నారు.

### శ్రీ మాతంగి మైసయ్య స్మారకోత్సవసభ

ఖమ్మంమెట్టు, జనవరి 28

ఖమ్మంతాలూకా పాతర్లపాడు గ్రామంలో వ్యవసాయ కార్మికుడు అయిన శ్రీ మాతంగి మైసయ్య స్మారక దినోత్సవం నిన్నటిరోజున అతివైభవంగా జరిగింది. సాయంత్రం గ్రామంలోని వ్యవసాయ కార్మికులు, రైతులు ఊరేగింపుగా అమరజీవి సమాధివద్దకు ఊరేగింపుగా వెళ్ళి పుష్పాలు సమర్పించారు.

జిల్లావ్యవసాయ కార్మిక కార్యదర్శి శ్రీ యం. రజబ్ అలీగారు, సమాధివద్ద ఎర్రజండాను ప్రతిష్ఠిస్తూ అమరజీవి మైసయ్య ఆశయాలు సాధించేందుకు ఈ ఎర్రజండా నీడన ఈనాడు ప్రజలంతా ప్రతినబూనాలని ఉద్బోధించారు. ఈ సందర్భంలో ఈఉత్సవంలో పాల్గొన్న జిల్లా రైతు నాయకులు శ్రీ రాయల వీరయ్య, తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ దొండేటి వాసుదేవరావు, వంకాయలపాటి దాసయ్య, శాసనసభ్యులు శ్రీ నామవరపు పెద్దన్న గారలు అమరజీవి జీవి యింటికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

తరువాత గ్రామంలో పెద్ద ఊరేగింపు జరిగి, బహిరంగ సభాస్థలికి చేరుకుంది. సభకు శాసనసభ్యులు శ్రీ నామవరపు పెద్దన్న అధ్యక్షత వహించారు. సభలో 2 వేలమందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.

తరువాత గార్ల బాలికలచే బుర్రకథ, ప్రొద్దుటూరు గ్రామ మండలి వారిచే సైసై నృత్యాలు, రామకృష్ణాపురం ప్రజానాట్యమండలివారిచే "ఓటెవరికి" అనే నాటిక ప్రదర్శించబడింది.

శ్రీ మాతంగి మైసయ్య పాతర్లపాడు గ్రామంలో ఒక వ్యవసాయ కార్మిక కుటుంబంలో జన్మించి స్థానిక భూస్వాములు గావిస్తున్న అన్యాయాలను ఎదుర్కొంటుండేవాడు. ఇతన్ని 1956 జనవరి 27 వ తేదీన పట్టపగలు స్థానిక గూండాలు కొందరు నడిబజారులో పట్టుకొని చంపారు. తరువాత గ్రామంలో కమ్యూనిస్టుపార్టీ కార్యకర్త లెవరూలేకుండా వెళ్ళగొట్టారు. అనేకమంది పైన చాలా నిర్బంధ విధానాలు అమలుపర్చారు. ఒక్క సంవత్సరంపైగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలంతా వలసవెళ్లవలసివచ్చింది. గ్రామాల్లో జరుగు యీ నిర్బంధ విధానంగురించి పార్లమెంటులోనూ, శాసనసభల్లోనూ ప్రస్తావనకు వచ్చింది. అనేక పర్యాయాలు ప్రభుత్వ ఉద్యోగస్తులకు విజ్ఞప్తులు వెళ్ళినవి. అయినా ప్రభుత్వం గట్టిచర్య తీసుకోనలేదు.

గ్రామంలోని కొందరు పెద్ద మనుష్యులు ఈ పద్ధతి మంచిదికాదని, కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు తిరిగి తమ ఇండ్లకు చేరుకోనేట్లుగా తోడ్పడినారు. తిరిగి ఆ గ్రామంలో 25మంది సభ్యులతో కమ్యూనిస్టుపార్టీ శాఖ ఏర్పడింది. గ్రామంలోని అనేకమంది రైతులు, పెద్దల తోడ్పాటుతో యీ స్మారకసభ విజయవంతంగా ముగిసింది.

ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం ఏర్పడింది.

# హరిజన విద్యార్థుల నిరాహార దీక్ష: హాస్టల్ మేనేజరు అక్రమానికి నిరసనగా

కర్నూలు, ఫిబ్రవరి 2

స్థానిక హరిజన హాస్టలునుండి బయటకు పంపబడిన విద్యార్థులు ఫిబ్రవరి 5 వ తేదీ నుండి నిరాహారదీక్ష బూనుటకు నిశ్చయించారు. కాంగ్రెసు శాసనసభ్యుడు శ్రీలింగం యీ హాస్టలుకు మేనేజరు.

హాస్టల్లో జరుగుతూన్న అన్యాయాలను తెలుపుతూ ఇటీవల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గారికి విద్యార్థులు పిటీషన్ పెట్టుకున్న కారణాన 13 మంది విద్యార్థులను మేనేజరు బయటకు పంపాడు. దాదాపు 5 నెలలనుండి వారు సరియైన ఆహారంలేక బాధపడుతున్నారు. ఈ విషయాన్ని గురించి స్థానిక పెద్దలనుండి, విద్యార్థి సంఘాలనుండి అనేక పిటీషన్లు ప్రభుత్వానికి పోయాయి. కాని ఇంతవరకు ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. అందుచేత విద్యార్థులు చివరి సాధనంగా యీ నిశ్చయానికి వచ్చారు.

హరిజన విద్యార్థుల కోర్కెను బలపరుస్తూ స్థానిక విద్యాసంస్థలనుండి దాదాపు 150 మంది విద్యార్థులు నేడు నినాదాలిస్తూ కలెక్టరు ఆఫీసువద్ద నిరసనప్రదర్శన చేశారు.

బయటకు పంపబడిన విద్యార్థులను వెంటనే హాస్టల్లో చేర్చుకోవాలనీ, ఈ హాస్టలును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, వారు కలెక్టరుకు ఒక మెమొరాండం సమర్పించారు.

తరువాత విద్యార్థులు సమావేశమై ఈసమస్యపై ఇంకా ఆందోళనసాగించడానికి ఒక కార్యాచరణ సంఘాన్ని నియమించారు.

ఈ నెల 6 వ తేది సంపూర్ణహార్తాళ్ జరపాలని కార్యాచరణ సంఘం నిర్ణయించింది.

పోలమూరులో జనవరి 24, 25 తేదీలలో శ్రీ శారదాదేవి 106 వ జయంత్యుత్సవాలు స్థానిక శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యమున జరిగాయి.

లేఖ:

# కోర్టులో కేసు విచారించకనే 'జుల్మానా'లు వసూలు!

మహాశయా,

అమలాపురం బెంచి కోర్టు ప్రెసిడెంటు ప్రవర్తన అరాచకంగావుంటున్నట్లు మా పార్టీ కార్యాలయానికి వార్తలుచేరుతున్నాయి. పట్టణ పోలీసువారు బీటులో వున్నప్పుడు, లేనప్పుడు కొన్ని న్యూసెన్సు కేసులు ప్రజలపై బనాయించి, చార్జిషీటు పెట్టకుండానే, విచారణ జరపకుండానే బెంచికోర్టు ప్రెసిడెంటు జరిమానాలు విధిస్తున్నట్లు వాటిని వసూలుచేసి రశీదులివ్వకుండా పంపించివేస్తున్నట్లు తెలియవచ్చింది.

జనవరి 25 వ తేదీ రాత్రి విలస వాస్తవ్యులు శ్రీ కుసుమ సూర్యారావుగారు డైనమో లైటు వేసుకొని సైకిల్ పై వెళ్ళుతుండగా అమలాపురంలో నున్న ముమ్మిడివరం బీట్ కానిస్టేబుల్ ఆపి, బెంచిప్రెసిడెంట్ ఇంటికి తీసుకెళ్ళారు. లైట్ లేదని తప్పుడు రిపోర్టు చేశాడు. లైట్ వెలుగుతుందని సూర్యారావుగారు చూపించినా ప్రెసిడెంటు లెక్కచేయలేదు. నీవు సైకిల్ వేగంగా తొక్కలేదు కాబట్టి రెండు రూపాయలు జరిమానా విధించానని చెప్పి వసూలుచేశారు. రసీదు ఇవ్వమని అడిగినందుకు, రు 50 లు జరిమానా విధించానని, నీ సైకిల్ ఇక్కడపెట్టి వెళ్ళమని బెదరించారు. సూర్యారావుగారు ఈ విషయమై జిల్లా స్పెషల్ జడ్జికి టెలిగ్రాము ఇచ్చారు.

ఇలాంటివే ఇంకా కొన్ని ఉదాహరణ లున్నాయి. తన ఇంటివద్దనే జరిమానాలు వసూలుచేస్తూ రశీదులుకూడా ఇవ్వటంలేదు. ఈ అరాజక పద్ధతివల్ల అనేకమందికి అన్యాయం జరుగుతున్నది. ఈవిషయమై ప్రభుత్వం విచారించి, సరియైన ప్రవర్తన కలిగిన వారినే ఈస్థానంలో నియమించాలని కోరుతున్నాను.

కొప్పిల వీరరాఘవులు, కార్యదర్శి,
తాలూకా కమ్యూనిస్టుకమిటీ ఆఫీసు,
అమలాపురం.

### ఉద్యోగం దొరకక ఆత్మహత్య

కనిగిరిలో ముతరాసికులస్థుడు ఈగ్ల గురవయ్య హైయ్యర్ గ్రేడ్ ప్యాసైన వుపాధ్యాయుడు. మూడు సంవత్సరములనుండి వుద్యోగానికై దాదాపు యిరువై పర్యాయములు నెల్లూరికి తిరిగాడు. లాభం లేకపోయింది. కుటుంబమును పోషించలేక నిరాశతో జనవరి 25 న అగ్నిద్రావకము త్రాగి మరణించాడు. ప్రస్తుతము రికమెండేషన్ తోనే వుద్యోగాలు దొరుకుతున్నాయి. పేదవారికి రొటుకంటి ఆదరణలేక వుద్యోగాలు దొరకక పెక్కు అగచాట్లకు గురియగుచున్నారు. వెనుకబడిన జాతులలో చదువుకున్నవారికి ప్రతి వుద్యోగాలలో నూటికి ఇన్ని కేటాయించామని ప్రభుత్వం చెప్తున్నది. కాని ఇది ఆచరణలోలేదు. ప్రస్తుతము ఆత్మహత్యకు గురియైన వుపాధ్యాయుడు వెనుకబడిన జాతికి చెందిన ముతరాసి.

జిల్లా వెంకటేశ్వర్లు
వెనుకబడిన జాతుల బాలుర హాస్టలు
మేనేజరు, కనిగిరి.

### కొణిజర్లలో దోవ లేక ఇబ్బంది

ఖమ్మంతాలూకా కొణిజర్ల గ్రామంలో రెండోవార్డునుంచిమూడవ వార్డుకు దోవలేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురికావలసివచ్చింది. లోగడ దోవ వుండగా దీన్ని ఒక రైతు బంద్ చేసి యీ దోవను ప్రక్కనేవున్న వాగులో కలిపినఫలితంగా ప్రతి సంవత్సరం వర్షానికి వాగు వర్రెలు కోసి ప్రజలు నడిచే వీలులేకుండాపోయింది. ఇవతలివారు అవతలవీధికి వెళ్ళాలంటే చాలా ప్రయాస పడాల్సివస్తుంది.

ఈ రెండు వార్డులకు మధ్యనవున్న రైతు పొలంలోనుంచి యీ బజారు ఇప్పించితే దానికయ్యే నష్టపరిహారాన్ని భూస్వామికి చెల్లిస్తామనికూడా ప్రజలు చెప్పారు. కావున ప్రభుత్వం వారు వెంటనే కలుగజేసుకొని మా గ్రామం వచ్చి, ప్రజల కష్టాలను విచారించి,యీ బజారు వేయించేందుకు పూనుకుంటారని కోరుతున్నాను.

మహమ్మద్, మహబూబ్ అలీ
కొణిజర్ల.

### ఉదయగిరి తాలూకాలో ఎరువుల కొరత

ఉదయగిరితాలూకాలో యూరియా సల్ఫేటులాంటి ఎరువులు దొరకక, రైతులంతా నానా అవస్థలకు లోనౌతున్నారు. ఒక సొసైటీ ఉంటే ఆ సొసైటీకి కూడా ఎరువులు సప్లయి చేయడంలేదు. అసలు తాలూకా వ్యవసాయశాఖ ఆఫీసులో ఎరువులే లేవు. బ్లాకుమార్కెట్ లో రైతులు ఎరువులు కొనలేక బాధపడుతున్నారు. అది కూడా దొరకటం కష్టంగావుంది.

ఆ యా ప్రాంతాలలో వుండే కో-ఆపరేటివ్ సొసైటీలకు ఎక్కువగా ఎరువు సప్లయిచేసి అధికాహారోత్పత్తికి తోడ్పడవలసిందిగా కోరుతున్నాను.

యస్. ఖాదరవల్లి,
తాలూకా రైతుసంఘం, ఉదయగిరి.

### ఓమన్ గ్రామాలపై బ్రిటిష్ దాడులు

కైరో, ఫిబ్రవరి 1

ఓమన్ తూర్పుప్రాంతాల్లో బ్రిటిష్ సామ్రాజ్యవాద సైన్యాలకు, ఓమన్ జాతీయవాదులకు మధ్య జరిగిన బ్రహ్మాండమైన పోరాటంలో పది మంది బ్రిటిష్‌వారు మరణించారని, మరో తొమ్మిది మందికి బాగా గాయాలు తగిలాయని ఓమన్ లోని కైరో ప్రతినిధి షేక్ ఎల్ హార్థీ నేడు చెప్పారు.

ఓమన్‌లో నేడు తీవ్రమైన పోరాటాలు జరుగుతున్నాయి. ఓమన్ తూర్పు ప్రాంతంలో అనేక చేతులు మారాయి. నేడది బ్రిటిష్‌వాళ్ళక్రింద వుందని ఆ ప్రతినిధి తెలియజేశారు.

ఆయనింకా ఈ క్రింది విషయాల్ని తెలియజేశారు: బ్రిటిష్ రాయల్ నావికాదళానికి చెందిన దళాలు ఓమన్ గ్రామాలపై నిరంతరం బాంబులతో దాడులు జరుపుతున్నాయి. ఈ దాడులకు గ్రామాలకు గ్రామాలు భీతిగొలిపోతున్నాయి. ఈ ఘోరకృత్యాలకు ముందరే ఓమన్ ఇమామ్ (సుల్తాన్) దేశం విడిచి పారిపోయాడన్న వార్త నిజం కాదు."

### మంగుళూరు మున్సిపల్ ఎన్నికలు

మంగుళూరు, ఫిబ్రవరి 1

మంగుళూరు మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెసుకు 18 స్థానాలు, కమ్యూనిస్టుపార్టీకి 8 స్థానాలు, మిగతా 10 స్థానాలు స్వతంత్రులకు లభించాయి.

ఇంతకుముందు ఈ మున్సిపాలిటీలో కాంగ్రెసుసభ్యుల సంఖ్య 23.

### కాశ్మీర కుంకుమ పూవు

శ్రీనగర్, జనవరి 29

ఇప్పుడు కాశ్మీర్ కుంకుమపూవుగా చలామణీ అవుతున్న పదార్థంలో అమృతసర్‌లో తయారయే నకిలీ కుంకుమపూవు చాల కలుస్తున్నదనీ, కుంకుమపూవు రైతులే ఈ కల్తీ కలుపుతున్నారనే అపోహ దేశంలో ప్రబలిందనీ ప్రజాతంత్ర జాతీయపార్టీనాయకుడు శ్రీ జి. ఎం. మసూదీ అంటున్నారు.

అందుకని కాశ్మీర్ ప్రభుత్వం కుంకుమ పూవును నేరుగా రైతులవద్ద నుంచి కొని కాశ్మీర్ ఎంపోరియం ద్వారా అమ్మించాలని ఆయన సూచన చేశారు.

ప్రస్తుతం కాశ్మీర్ ప్రభుత్వం కంట్రాక్టర్లద్వారా కుంకుమపూవుకొని అమ్మిస్తున్నది. ఈ కంట్రాక్టర్లు కల్తీ కలుపుతున్నారు. దీనివల్ల కాశ్మీర్ రైతుకు అప్రతిష్ఠ వస్తున్నది అని ఆయన పేర్కొన్నారు. (ఐ.పి.పి.)

### రామభద్రపురంలో 'ప్రి ఎక్స్ టెన్షన్ బ్లాక్'

రామభద్రపురం, జనవరి 31

శ్రీకాకుళంజిల్లా సాలూరుతాలూకా రామభద్రపురంలో జనవరి 28 వ తేదీ పార్వతీపురం అసిస్టెంటు కలెక్టరు శ్రీ దొరైస్వామి 'ప్రీ ఎక్స్ టెన్షన్ బ్లాక్'ను తెరచారు. ఈ బ్లాకు 171 గ్రామాలలో వున్న 80,000 జనాభాకు వ్యాప్తి చెందుతుంది.

శ్రీ యాండ్రప్ప అప్పలనాయుడుగారు పతాక ఆవిష్కరణ జరిపారు. స్థానిక హైస్కూలు ప్రాథమిక బడుల విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగ సిబ్బంది, పురజనులు ఊరేగింపులో పాల్గొన్నారు. బడిపిల్లలకు మిఠాయిలు పంచిపెట్టబడ్డాయి.

సాయంత్రం శ్రీ అల్లు ఎరుకు నాయుడు (ఎం. ఎల్. ఏ., సాలూరు) గారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. జిల్లాప్లానింగ్ ఆఫీసరు శ్రీ ఎం. వి. ఎస్. సుబ్రహ్మణ్యం, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎన్. జగన్నాధరావు ప్రభృతులు ఉపన్యసించారు.

# కమ్యూనిస్టుపార్టీ నిధి

## రు 15 వేలు సేకరించాలని తెనాలి తాలూకా కమ్యూనిస్టు కౌన్సిల్ నిర్ణయం

తెనాలి, ఫిబ్రవరి 1

తెనాలి తాలూకా కమ్యూనిస్టు కౌన్సిల్ కార్యనిర్వాహకవర్గ సమావేశం జనవరి 30, 31 తేదీల్లో పార్టీకార్యాలయంలో జరిగినది. పార్టీ నిధికి తాలూకాలో పదిహేను వేలరూపాయలు వసూలుచేయాలని కోటాలు తీసుకొన్నారు. తెనాలి పట్టణంలో మూడువేల రూపాయలు వసూలుకు బాధ్యత తీసుకొన్నారు. కార్యవర్గ సభ్యులు రంగాలవారిగా బాధ్యతలు, పనివిభజన చేసుకొన్నారు.

ఫిబ్రవరి 15 వ తేదీనుండి 21 వ తేదీవరకు తాలూకాలో మూడుదళాలుగా పాదయాత్ర బయలుదేరి అన్ని గ్రామాల్లో "భూసంస్కరణల"ను గురించి ప్రచారం చేయాలని, ఫిబ్రవరి 22 వ తేదీన తెనాలి పట్టణంలో బహిరంగసభ జరపాలని, కలెక్టరువద్దకు రాయబారం వెళ్ళి, మెమొరాండం ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ సందర్భంలో ఫిబ్రవరి 6 వ తేదీ నేమూరు, 7 వ తేదీ కొల్లిపర, 8 వ తేదీ తెనాలిలో పార్టీ సర్వసభ్య సమావేశాలు జరపాలని నిశ్చయించారు.

సమావేశానికి జిల్లాకమిటీ కార్యదర్శి శ్రీ కొల్లా వెంకయ్య, శ్రీ లావు బాలగంగాధరరావు గార్లు హాజరైనారు.

# రేడియో

## గురువారం, ఫిబ్రవరి 5

### విజయవాడ

ఉదయము : 6-30 శుభోదయము; 6-40 భక్తిరంజని; 7-0 (తె. వా); 7-15 నాదస్వరం; 7-45 సంగీతశిక్షణ; మధ్యాహ్నము : 12-30 వధూటిన్; 1-0 కార్మికులకు; (హైద్రాబాద్ ఎ నుండి రిలే); 1-50 (తె. వా); 3-0 మా. పా. విద్యార్థులకు; 3-30 నాదస్వరం; 3-45 ఉ. పా. విద్యార్థులకు (హైద్రాబాద్ ఎ నుండి రిలే); సాయంత్రము : 6-0 స్థానిక ప్రకటనలు; 6-15 గ్రామస్థులకు; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థులకు; 7-30 రసరుచి; 8-40 చెంబై వైద్యనాథ భాగవతార్; 9-15 లలితసంగీతం; 9-30 అఖిల భారత నాటక కార్యక్రమం; 10-30 సమాప్తి.

### హైదరాబాద్-బి

ఉదయం : 6-30 సుప్రభాత్; మధ్యాహ్నం : 12-30 వాద్యగోష్ఠి; 2-10 సారంగి; 2-50 వాద్యసంగీతం; సాయంత్రం : 6-0 స్థానిక ప్రకటనలు; 6-15 గ్రామస్థులకు; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థులకు; 9-15 విజయవాడవేళ; 10-30 సమాప్తి.

# బజారు ధరలు

విజయవాడ, ఫిబ్రవరి 3

[మధ్యాహ్నం గం॥ 1 వరకు]

### బంగారం ధరలు

| | | |
|---|---|---|
| మేలిమి : పొల్లా | | 118 0 0 |
| మూస | | 117 4 0 |
| సవరకు | | 76 0 0 |
| వెండి : 100 తులములు | | 194 0 0 |
| తులము | | 2 0 0 |

### ధాన్యం ధరలు

| | | |
|---|---|---|
| 24 నెంబరు | రు. | 25 0 0 |
| వంకసన్నాలు | | 23 8 0 |
| 12 నెంబరు | | 22 8 0 |
| అక్కుళ్ళు | | 22 0 0 |
| కుసుమ | | 22 4 0 |

### బియ్యం ధరలు

| | | |
|---|---|---|
| 24 నెంబరు | రు. | 58 0 0 |
| వంకసన్నాలు | | 56 0 0 |
| 12 నెంబరు | | 54 0 0 |
| అక్కుళ్ళు | | 51 8 0 |
| కుసుమ | | 51 8 0 |

### అపరాల ధరలు

| | | |
|---|---|---|
| మినుములు 240 సౌ॥ | | 54 0 0 |
| కందులు | 56/- | 62 0 0 |
| పచ్చపెసలు (మెట్టవి) | 50/- | 60 0 0 |
| సెనగలు దేశవాళీ | | 67 0 0 |
| ,, (పంజాబ్) | | 62 0 0 |
| ధనియాలు 26 కుంచాలు | 40/- | 42 0 0 |
| ఉలవలు | | 39 0 0 |
| ఆముదాలు | | 42 0 0 |
| పంచదార (వుయ్యూరు) | | 107 12 0 |
| కొబ్బరినూనె డబ్బా | | 40 0 0 |
| బెల్లం మణుగు | 10/- | 14 0 0 |
| జొన్నం మణుగు | 4-8-0 | 5 10 0 |
| మిర్చి ,, | 17-0-0 | 25 0 0 |
| నీరుల్లి ,, | 1-7-0 | 2 4 0 |
| చింతపండు ,, | 6-8-0 | 8 0 0 |
| నువ్వులనూనె ,, | | 33 8 0 |
| నేము సెనగపప్పు 177 సౌ॥ | | |
| జగ్గయ్యపేట | | 61 8 0 |
| కోవాడ | | 63 0 0 |
| నూనె మణుగు | | 16 13 0 |
| కేక్ 160 సౌనులు | | 22 0 0 |
| కొబ్బరికాయలు 1000 కొ॥ | | 322 8 0 |
| సంచులు | | 97 0 0 |
| ట్విల్ శాక్సు | | 89 4 0 |

## కొత్తపేట తాలూకా కమిటీ కార్యక్రమం

కొత్తపేట, ఫిబ్రవరి 1

కొత్తపేట తాలూకాలో ఏప్రిల్ నెలాఖరులోగా కమ్యూనిస్టుపార్టీ నిధికి రు 4000 లు సేకరించాలని, అందుకు హెచ్చుగా విరాళాలిచ్చి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ జనవరి 27, 28 తేదీలలో కొమరాజులంకలో జరిగిన తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం తీర్మానించింది.

మొదటిరోజు సమావేశానికి శ్రీ వాకలపూడి రామారావు, రెండవరోజు సమావేశానికి శ్రీ వక్కలంక భీమేశ్వరశర్మ గార్లు అధ్యక్షత వహించారు. రాష్ట్రకౌన్సిలు సభ్యులైన శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణగారు రాష్ట్ర మహాసభ రిపోర్టు, తాలూకాకమిటీ కార్యదర్శి శ్రీ వీరఘంటు గంగాధరరావుగారు జిల్లామహాసభ రిపోర్టు యిచ్చారు.

ఫిబ్రవరి మూడవ వారంలో రాష్ట్ర కమిటీఆదేశానుసారం "భూసంస్కరణల వారం" తాలూకాలో జరపాలని; రోజుకొక గ్రామంలో బహిరంగసభ జరుపుతూ, పగలు చుట్టూవున్న గ్రామాలలో ప్రచారం చేయాలని, ఇందుకు ముందుగా "భూసంస్కరణల వార" ప్రాముఖ్యతను వెల్లడిచేసేందుకు ఒక కరపత్రం తీసుకురావాలని తీర్మానించారు.

పుల్లేటికుర్రు బ్లాక్ సలహాసంఘంలోని నామినేటెడ్ సభ్యులు సమావేశాలకు సరిగా హాజరు కాని కారణంచేత వారిని ఎందుకు తొలగించరాదో తెలియపర్చవలసిందిగా నోటీసులు జారీచేయబడినట్లు తెలియవచ్చింది. కొత్తపేట తాలూకాలో 1957 పార్లమెంటరీ ఎన్నికలలో కాంగ్రెసుకన్న హెచ్చువోట్లు సంపాదించిన కమ్యూనిస్టుపార్టీకి బ్లాక్ సలహాసంఘంలో ప్రాతినిధ్యం లేకుండాచేసి ప్రజాసమస్యలను పట్టించుకోనివారిని సమావేశాలకే హాజరుకాని వారిని నామినేట్ చేసిన పాలకవర్గపార్టీ వైఖరిని ఖండిస్తూ మరో తీర్మానం చేశారు.

ఆఖరురోజు రాత్రి శ్రీ దేయపు సుబ్బారావుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ, శ్రీ వీరఘంట గంగాధరరావు, శ్రీ అల్లూరి సోమరాజుగార్లు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులనుగూర్చి మాట్లాడారు.

వచ్చేతాలూకా కమిటీ సమావేశం పేరవరం గ్రామంలో జరపాలని నిర్ణయించారు.

## నూజివీడు తాలూకాలో 5 వేలు సేకరణకు నిర్ణయం

నూజివీడు, ఫిబ్రవరి 1

1959 వ సంవత్సరానికి మొత్తం 5 వేల రూపాయలు పార్టీ నిధికి వసూళ్ళకు పూనుకోవాలని నూజివీడు తాలూకా కమ్యూనిస్టు కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. కౌన్సిల్ సభ్యులు రు 1100/-లు వాగ్దానం చేశారు. ఈ సమావేశం నూజివీడుపార్టీ కార్యాలయంలో శ్రీ ఎ. బసివిరెడ్డిగారి అధ్యక్షతను జరిగింది. మొత్తం 30 మంది సభ్యులు హాజరయ్యారు.

ప్రజాసంఘాల నిర్మాణం, పార్టీ నిధి వసూళ్లు మొదలగు విషయాలు చర్చించబడ్డాయి. కార్యదర్శి శ్రీ దాసరి నాగభూషణరావుగారు ఖమ్మంలో జరిగిన రాష్ట్రపార్టీ మహాసభపై రిపోర్టుయిచ్చారు. వివిధ ప్రజాసంఘాలు, పార్టీ నిర్మాణం, ఆఫీసు మొదలగు ఉపసంఘాలను ఎన్నుకొన్నారు.

ఫిబ్రవరి 15 నుండి 21 వరకు తాలూకాలో భూసంస్కరణలు, స్థానిక సమస్యలు మొదలగువాటిపై ప్రచారం చేయడానికి మూడు దళాలు వివిధ గ్రామాల్లో పర్యటించాలని నిర్ణయించారు.

## సింగలూరు

గుడివాడ తాలూకా కమ్యూనిస్టు నాయకులు అల్లూరి సీతారామయ్య, బొన్నేని సుబ్రహ్మణ్యంగార్లు సింగలూరు గ్రామంలో స్థానిక కార్యకర్తలతో కలిసి కమ్యూనిస్టుపార్టీ నిధి వసూళ్ళు ప్రారంభించారు. సింగలూరు చాలా చిన్నపల్లె. ఉన్నవారందరూ బీదవారు. చేతిపరిశ్రమమీద ఆధారపడి జీవించేవారు. అయినా ప్రతివారూ తమకుతోచిన విధంగా విరాళం యిచ్చారు. ఒక్క యిల్లుకూడా వదలకుండా 45 మంది రు. 45 లు వాగ్దానం చేశారు. కొంతమంది అప్పుడే యిచ్చివేశారు.

## మొవ్వపాలెం

దివి తాలూకా మొవ్వపాలెంలో శ్రీ శివరామకృష్ణయ్యగారి నాయకత్వాన కమ్యూనిస్టుపార్టీ సభ్యులు ఒక దళంగా బయలుదేరి 80 మందిని కలుసుకొని, రు 87 లు పార్టీ నిధికి వాగ్దానాలు చేయించారు. వెంటనే రు 75-8-0 లు వసూలు అయింది. అన్ని రాజకీయ పార్టీలవారు విరాళాలిచ్చారు.

గ్రామంలో కొత్తగా కమ్యూనిస్టు పార్టీశాఖ ఏర్పరచబడింది. తాలూకా కౌన్సిలు సభ్యులు శ్రీశివరామకృష్ణయ్యగారు పార్టీ రాజకీయాలు, స్థానిక సమస్యలను సభ్యులకు వివరించారు. పార్టీలో 12 మంది సభ్యులు చేరి వెంటనే రుసుంకూడా చెల్లించారు. కార్యదర్శిగా శ్రీ చలాది రాఘవయ్యగారిని ఎన్నుకొన్నారు.

## ఇసుకపూడి

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట తాలూకా ఇసుకపూడి గ్రామ కమ్యూనిస్టుశాఖ శ్రీ షేక్ దావూద్ నానాబాయి అధ్యక్షతన సమావేశమై, గ్రామంలో పార్టీ నిధి కనీసం 116 రూపాయలు సేకరించాలని నిర్ణయించింది. పార్టీశాఖ సమావేశంలోనే రు 60లు వాగ్దానాలు వచ్చాయి.

## అవనిగడ్డ

దివితాలూకా అవనిగడ్డ సెంటరు దళం పర్చూరి సోమేశ్వరరావుగారి నాయకత్వాన బందలాయి చెరువు, నాగాయతిప్ప గ్రామాలలో కమ్యూనిస్టుపార్టీ నిధికి ఇంతవరకు రు 200 లు వాగ్దానాలు చేయించారు.

శ్రీ కోట కామయ్యలుగారి నాయకత్వాన మరొక దళం సాలెంపాలెం ప్రాంతంలో రు 100 లు వాగ్దానం చేయించారు.

## కొలనుపాక

భువనగిరి తాలూకాలోని కొలనుపాక గ్రామంలో శ్రీ ఆరుట్ల లక్ష్మీనర్సింహారెడ్డి, రామచంద్రారెడ్డిగారలు గ్రామ పార్టీ సభ్యుల సహాయంతో ఒకరోజు 3 వందల రూపాయల నగదు, 3 వందల రూపాయల విలువగల ధాన్యాన్ని పార్టీ నిధికి వసూలుచేశారు. ఇంటింటికి వెళ్ళి పార్టీ నిధి వసూలు చేయడం ఇదే మొదలు. ఒక రూపాయనుండి 25 రూపాయల వరకు పార్టీ నిధికి యిచ్చినవారు గలరు.

పటేలుగూడెంలో రైతాంగమంతా కలిసి 12 తూముల ధాన్యం పార్టీ నిధికి యిచ్చారు.

## శాయిపేట

నెల్లూరుజిల్లా కావలి తాలూకా శాయిపేట గ్రామంలో యీనెల 25 తేదీన కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన 20మందియువతులు స్త్రీలు రాత్రిపూట ముప్పాతిక ఎకరం వరికోసి వచ్చిన కూలి 6 రూపాయలు కమ్యూనిస్టుపార్టీ నిధికి సమర్పించారు.

ఇందులో మహమ్మదీయస్త్రీ శ్రీమతి వస్తాద్ బీ పాల్గొనుట గమనార్హం.

## సౌతుమోపూరు

నెల్లూరు తాలూకా సౌతుమోపూరు గ్రామంలోని పార్టీ సభ్యులు రైతులు వ్యవసాయకూలీలు మొగళ్ళపాలెం రైతులు మొత్తం 52 మంది రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో 5 ఎకరాల వరికోసి రు 72-10-0 లు కమ్యూనిస్టు పార్టీ నిధికి ఇచ్చారు.

## మహదేవపురం

మధిర తాలూకా మహదేవపురం గ్రామ కమ్యూనిస్టుపార్టీ సభ్యులు సానుభూతిపరులు వ్యవసాయ కూలీలు మొత్తం 90 మంది జనవరి 27 న కనపర్తి బాలస్వామి నల్లపు ముత్యాలుగారి నాయకత్వాన జొన్నచేను కోయగా వచ్చిన కూలి రు 27 లు మధిరతాలూకా కమ్యూనిస్టుపార్టీ నిధికి యిచ్చారు. వీరిలో 48 మంది మహిళలు వున్నారు.

# భిలాయ్ ఉక్కు-ఫ్యాక్టరీ విశేషాలు

భిలాయ్ బొంబాయి - కలకత్తా ప్రధాన రైలుమార్గంలో నాగపూరుకు 156 మైళ్ళ దూరంలో వున్నది. ఇక్కడ నిర్మాణంలోవున్న ఫ్యాక్టరీ 10 లక్షల టన్నుల ముడి ఉక్కునుంచి 770 వేల టన్నుల బరువుగల ఉక్కుకడ్డీలు, పట్టాలు, ఉక్కునిర్మాణ సామగ్రిని తయారుచేస్తుంది. ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తిసామర్థ్యాన్ని పన్నెండున్నర లక్షల టన్నులకు పెంచవచ్చును. ఉత్తరోత్తరా దీనిని 25 లక్షల టన్నులకు విస్తరింపజేయడానికి యీఫ్యాక్టరీ ప్రణాళిక అవకాశాలను కల్పిస్తున్నది.

ఈ ఫ్యాక్టరీకి ఇనుము, ఖనిజం యిక్కడికి 60 మైళ్ళ దూరంలోని రాజ్ మహాల్ వద్ద అభివృద్ధి చేస్తున్న కొత్త గని నుంచి రాగలదు. బొగ్గు బీహారులోని బొకారో, కర్గాలి, ఝరియా గనులనుంచీ, మధ్యప్రదేశ్ లోని కోర్బా గనినుంచీ లభించగలదు. సున్నపురాయి యిక్కడికి పన్నెండు మైళ్ళ దూరంలోగల నందినీలోని కొత్త క్వారీనుంచి సరఫరా అవుతుంది. ఈ ముడి సరకులను తెచ్చే రైళ్ళు ఆగడానికి సరకు దిగుమతికి ఒక మార్షలింగు యార్డును నిర్మిస్తున్నారు.

## రాతిబొగ్గు బట్టీలు

ఇక్కడ రాతిబొగ్గు బట్టీలు మూడు వరుసలలో వున్నాయి. ఒక్కొక్క వరుసలో 65 బట్టీలున్నాయి. మూడు మరకొలుములు కూడ వున్నాయి. ఒక్కొక్కటీ రోజుకు 1135 టన్నుల ఉక్కు పరికరాలను ఉత్పత్తిచేయగలదు. ఇనుమును సాంప్రదాయ సిద్ధమైన పద్ధతిప్రకారమే ఉక్కు క్రింద తయారు చేస్తారు. ఈ పద్ధతిక్రింద కొలిమి బహిర్గతమై వుంటుంది.

ఇందుకుగాను 256 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంగల ఆరు కొలుములు యిక్కడ వున్నాయి. ఇక్కడ వున్న రోలింగు మిల్లులలో కడ్డీలను తయారు చేసేమిల్లు, బిల్లెట్లు తయారుచేసే మిల్లు, పట్టాలను ఉక్కు నిర్మాణ సామగ్రిని తయారుచేసే మిల్లు, ఒక మర్చెంటు మిల్లు వున్నాయి. ఇవి ఒక లక్షటన్నుల ఉక్కు కడ్డీలనుంచి యీ క్రింది వాటిని తయారు చేస్తాయి.

| | టన్నులు |
|---|---|
| 1. స్టాండర్డు సెక్షన్లు | 100,000 |
| 2. నారోగజ పట్టాలు | 10,000 |
| 3. రైల్వే స్లీపర్ కడ్డీలు | 90,000 |
| 4. స్టాండర్డు వెడల్పు అంచుగల ఉక్కుదూలాలు, ఛానెల్సు మొదలైనవి | 284,000 |
| 5. 7/8 అంగుళంనుంచి 3 అంగుళాల వ్యాసంగల రౌండ్లు | 151,000 |
| 6. 2 నుంచి 5 అంగుళాల వెడల్పుగల బద్దలు | 15,000 |
| 7. బయటి రోలింగుమిల్లులలో తిరిగి రోలింగు చేయడానికి కడ్డీలు | 130,000 |
| మొత్తం | 770,000 |
| దుక్క ఇనుము | 300,000 |

ఈ ఫ్యాక్టరీని సోవియట్ రష్యా ప్రభుత్వ సాంకేతిక, ఆర్థిక సహకారాలతో నిర్మిస్తున్నారు. 63 కోట్ల 17 లక్షల రూపాయల విలువ గల ప్రధాన యంత్రం, పరికరాలను 12 సాలుసరి సమాన వాయిదాలలో చెల్లించే పద్ధతిని సప్లయి చేస్తున్నారు. వడ్డీ నూటికి రెండున్నర వంతులు. తరుణంలో భారతదేశంలో లభ్యంకాని యితర స్టోర్సును నగదును సప్లయి చేస్తున్నారు. సోవియట్ రష్యాలో చేసుకున్న ఒప్పందంమేరకు ఇండియా, రష్యాలు నిర్వహించవలసిన బాధ్యతలు యీ దిగువ విధంగా వున్నాయి:

### రష్యా

1. సమగ్రమైన ప్రాజెక్టు నివేదిక తయారీ, డ్రాయింగులు, నిర్మాణాలు, యంత్రాల స్థాపన కార్యక్రమం తయారీ.
2. ప్రధాన యంత్రం, యితర పరికరాల సప్లయి.
3. ఈ యంత్ర నిర్మాణం, స్థాపన, పని ప్రారంభాలపై సాంకేతిక అజ్మాయిషీ.
4. భారతీయులకు రష్యాలో శిక్షణ, భారతదేశంలో సిబ్బందికి శిక్షణలో సహాయపడ్డం.

### భారతదేశం

1. ఫ్యాక్టరీ స్థలాన్ని తెరేలు చేయడం.
2. పునాదులకు పనికివచ్చే స్థల నిర్ణయాన్ని గురించి ప్రాథమిక పరిశీలన.
3. సోవియటు నిపుణుల అజ్మాయిషీ క్రింద యంత్ర నిర్మాణ స్థాపన కలాపాలు.
4. రష్యానుంచి భారతదేశానికి వచ్చిన సామగ్రిని రేవులనుంచి ఫ్యాక్టరీ స్థలానికి చేరవేత, దేశంలో లభించే యంత్ర పరికరాల సేకరణ.
5. రోడ్లు, రైలుదార్లు, వసతివాడ నిర్మాణం.
6. ఉక్కు-ఫ్యాక్టరీ పరిహద్దువరకూ నీరు, విద్యుచ్ఛక్తి సరఫరా ఏర్పాట్లు.
7. ఖనిజాల గనులు, సున్నపురాయి క్వారీల అభివృద్ధితోసహా అన్ని ముడి సరుకుల సప్లయి.

ఒక భారతీయ చీఫ్ ఇంజనీరు అనేకమంది ఇంజనీర్ల సహాయంతో అక్కడ నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణంపై సాంకేతిక అజ్మాయిషీకి, భారతీయ సిబ్బందికి శిక్షణ యివ్వడంలో సహాయపడడానికీ, సోవియట్ రష్యా ప్రభుత్వం అర్హతలు గలిగిన ప్రవీణుడైన ఒక చీఫ్ ఇంజనీరును పంపింది. అనేకమంది రష్యన్ ఇంజనీర్లు ఆయనకు సహాయపడుతున్నారు.

రష్యా సప్లయిచేసిన ప్రధానయంత్రం యితర పరికరాలు పనిచేయడం విషయంలో రష్యా పూచీ యిచ్చింది. ఈ ఫ్యాక్టరీ పని చేయడం ప్రారంభించినప్పటినుంచీ మూడు సంవత్సరాల వరకూ భారత ప్రభుత్వంకోరిన సాంకేతిక అజ్మాయిషీ నిర్వహణకూ, సలహాలివ్వడానికి చాలినంత మంది ప్రవీణులను కూడ రష్యా సమకూర్చగలదు.

ఈ ఫ్యాక్టరీ ప్రధాన భాగాలకు సంబంధించిన సివిలు ఇంజనీరింగు పని రెండు భారతీయ సంస్థలకు అప్పగించారు. ఇతర చిల్లర పనులు ప్రభుత్వశాఖద్వారానూ, లేక చిన్న కంట్రాక్టర్ల ద్వారానూ నిర్వహిస్తున్నారు. కొన్ని ఉక్కు నిర్మాణాలను భారతీయ సంస్థలకు వినియోగించారు. మిగిలిన ఉక్కు నిర్మాణాలూ, విద్యుచ్ఛక్తి ఏర్పాట్లతో యితర యంత్ర పరికరాలను అమర్చడం మొదలైన పనులను ప్రభుత్వశాఖ పరంగా భారతీయ ఇంజనీర్లు నిర్వహిస్తారు.

### మీకు తెలుసా?

1. రూర్కెలా, భిలాయి కర్మాగారాలలో ఉక్కు ఉత్పత్తి యీయేఖాది మధ్య నాటికల్లా ప్రారంభమవుతుందని అనుకుంటున్నారు. ఇక్కడ మొదటి రోలింగు మిల్లులు అమర్చడానికి వీలైన ఉక్కును యీ యేడాది ఆఖరులోగా ఉత్పత్తిచేస్తాయి.

2. ఉక్కు కర్మాగారంలోని అన్ని శాఖలూ పని ప్రారంభించిన తరువాత రూర్కెలా కర్మాగారం 2 లక్షల టన్నుల ప్లేటులనూ, 4700,00 టన్నుల రేకులనూ వివిధ కొలతలు గలవి, 50 వేల టన్నుల లేతరవు ప్లేటులనూ, 50 వేల టన్నుల పోతయినుమునూ ఉత్పత్తి చేస్తుంది. ఈ కర్మాగారంలోని ఉప ఉత్పత్తులు రోజుకు 130 టన్నుల తారును ఉపయోగించి బెంజాల్ నూ, క్రియోసాట్ నూ, నాప్తలీన్ నూ ఇతర పదార్థాలనూ ఉత్పత్తి చేస్తాయి.

3. ఆక్సిజని యంత్రాగారంలో మిగిలే నత్రజనిని వాడుకచేసే ఒక యెరువుల ఫ్యాక్టరీనికూడా రూర్కెలా వద్ద నెలకొల్పుతారు. ఇది 5,80,000 టన్నుల నైట్రోలైమ్ స్టోన్ ను ఉత్పత్తి చేస్తుంది. ఇది సింద్రీ యెరువులఫ్యాక్టరీకి అంత పెద్దదిగా వుంటుంది.

భిలాయి ఉక్కు కర్మాగారం 2 లక్షల టన్నుల ఇరుపుగొట్టాలనూ, స్లీపర్లు, పట్టాలనూ, 16000 టన్నుల భారీ సామగ్రులనూ, 2,60,000 టన్నుల మధ్యరకం సామగ్రులనూ, రిరోలింగు పరిశ్రమకు పనికి వచ్చే 150000 టన్నుల బిల్లెట్లనూ, పోత పరిశ్రమలకు పనికివచ్చే 3,00,000 టన్నుల ఇనుమునూ ఉత్పత్తి చేస్తుంది. భిలాయి కర్మాగారంలో ఉప ఉత్పత్తులు రోజుకు 130 టన్నుల తారును వాడుతూ రూర్కెలా కర్మాగారం ఉత్పత్తిచేసే పదార్థాలనే ఉత్పత్తి చేస్తుంది.

5. ఎంతోకాలంగా భారతదేశానికి ఉక్కు కొరతగా వుండేది. యిప్పుడు భిలాయి, రూర్కెలా కర్మాగారాల ఉత్పత్తి యీ కొరతను చాలావరకు తీర్చగలవు.

6. భిలాయి కర్మాగారమూ, సాధన సామగ్రులూ అన్నిటినీ సోవియట్ యూనియనే సప్లయిచేసింది. అయితే దానిని భారతదేశంలో నిర్మించే పూర్తి బాధ్యత ప్రాజెక్టు అధికారులదే.

7. ఇక, రూర్కెలా కర్మాగారానికి సాధన సామగ్రులూ, యంత్రాలూ - వీటిని సుమారు 50 విదేశ వ్యాపార సంస్థలు సప్లయిచేస్తున్నాయి.

# భిలాయ్, రూర్కెలా ఉక్కు-కర్మాగారాల ప్రధాన శాఖలు

| శాఖ | రూర్కెలా కర్మాగారం | భిలాయి కర్మాగారం |
|---|---|---|
| రాతిబొగ్గు బట్టీలు | ఒక్కొక్కదాంట్లో 70 బట్టీలున్న 3 బ్యాటరీలు | ఒక్కొక్కదాంట్లో 65 బట్టీలున్న 3 బ్యాటరీలు |
| గాలి బట్టీలు | వెయ్యేసి టన్నుల శక్తిగలవి మూడు | 1135 టన్నులశక్తి గలవిమూడు |
| ఉక్కు కరిగింపుశాఖ | పదకొండు వందల టన్నుల మిక్సర్ యంత్రాలు<br>40 టన్నుల ఎల్. డి. కన్వర్టర్లుమూడు<br>80 టన్నుల బహిర్గత కొలుములు నాలుగు | ఒక మిక్సర్ యంత్రం.<br>250 టన్నుల బహిర్గత కొలుములు ఆరు |
| రోలింగు మిల్లులు | కడ్డీలూ, పలకలూ తయారుచేసే మిల్లు,<br>ఒక భారీ ప్లేటు మిల్లు<br>ఒక కంటిన్యువస్ స్ట్రిప్ మిల్లు<br>రెండు స్టాండు సెట్టులలో ఒక కోల్డ్ రోలింగ్ మిల్లు | కడ్డీలు తయారుచేసే మిల్లు 45½,<br>ఒక పట్టాల మిల్లు,<br>ఒక మర్చెంటుమిల్లు<br>బిల్లెట్ మిల్లు |
| విద్యుత్కేంద్రం | 75,000 కిలోవాట్లు | 24,000 కిలోవాట్లు |

సూచన: 1. భిలాయిలో ఒక సింటరింగు యంత్రాగారం వుంటుంది. ముడి యినుమును సింటరింగు చేయడంవల్ల గాలిబట్టీల ఉత్పత్తి పెరుగుతుందని సోవియట్ రష్యాకు వెళ్ళిన భారత ప్రతినిధివర్గం గమనించింది. రూర్కెలాలో కూడా సింటరింగు యంత్రాగారాన్ని నెలకొల్పాలని ఆ తరువాత నిర్ణయమయితే, దానిని నెలకొల్పడానికి రూర్కెలా కర్మాగారం ప్లానులో యేర్పాటు చేశారు.

2. సోవియట్ రష్యాలో భారీ ఒత్తిడిశక్తితో గాలిబట్టీల ఉత్పత్తిని పెంపొందిస్తున్నారు. భిలాయిలో కూడా అదేపద్ధతిని అవలంబిస్తారు.

3. రూర్కెలా ఉక్కు కర్మాగారంలో ఉపఉత్పత్తులనువాడుకచేసే ఒక యెరువుల కర్మాగారం కూడా వుంటుంది.

## ప్రొద్దుటూరులో యువజన సంఘం

ప్రొద్దుటూరు, జనవరి 31

యువక ప్రముఖులు కొందరు యిటీవల సమావేశమై పట్టణంలో యువజన సంఘాన్ని ఏర్పరచటానికి తీసుకోవలసిన కార్యక్రమాన్ని గురించి చర్చించారు. యువకులంతా విరివిగా సమీకృతమై యువజనసంఘాన్ని ఏర్పరచుకోవాలనే విజ్ఞప్తిగల కరపత్రాలను ప్రకటించి పట్టణంలో చురుకుగా [illegible] యువజనసభ్యత్వాన్ని చేర్పిస్తున్నారు.

## వైరా ఉన్నతపాఠశాలకు భూదానం

వైరా, జనవరి 31

ఖమ్మంజిల్లా వైరా ఆంధ్ర నికేతన్ ఉన్నతపాఠశాలకు వైరా గ్రామస్థులు శ్రీ రంగుబల్లి వెంకటప్పయ్యశాస్త్రిగారు రు 1500 ల విలువగల యకరం మాగాణి భూమిని విరాళంగా సమర్పించారు. మరో యకరం భూమిని, లక్ష్మీపురం శ్రీరామ లింగేశ్వర దేవాలయానికి భూదానం చేశారు. విద్యాసంస్థలకు యిలాంటి భూదానాలు ఖమ్మం జిల్లాలో యీ ప్రాంతంలో వీరే ప్రథములు.

# స్విట్జర్లెండులో స్త్రీలకి ఓటింగు హక్కు శూన్యం

## జనవాక్య సేకరణ ఫలితం

బెర్నె, ఫిబ్రవరి 1

స్విట్జర్లెండులో నేడు మెజారిటీ పురుషుల ఓటింగ్ ఫలితంగా దేశంలోని స్త్రీలకు వయోజన ఓటింగ్ హక్కు లేకుండా నిర్ణయమైంది.

గత రెండు రోజులుగా సాగుతున్న జనవాక్యసేకరణ (రిఫరెండం) కార్యక్రమం నేటితో పూర్తయింది. స్త్రీల వోటింగ్ హక్కుకు వ్యతిరేకంగా వోటు చేసిన పురుషుల సంఖ్య 6,54,924 మంది.

ఇటువంటి సమస్యపై దేశవ్యాపితంగా జనవాక్య సేకరణ జరపడం స్విట్జర్లెండు చరిత్రలో ఇదే మొట్టమొదటిసారి.

అయితే 1920 సంవత్సరంనుండి జాతీయ సమస్యలపైన ఓటు చేసే హక్కును స్త్రీలకు కల్పిస్తూ స్విట్జర్లెండు పార్లమెంటులో 25 ఓట్లు, స్వయంపాలిత 'కేంటన్' లలో 22 ఓట్లు కేటాయించారు. కానీ ఇప్పుడవి కూడా పూర్తిగా వీగిపోయాయి.

విచిత్రమేమంటే స్విట్జర్లెండ్ స్త్రీలలో చాలామంది అత్యధిక సంఖ్యాకులు వోటింగ్ హక్కు తమకు అక్కర్లేదని వాదిస్తున్నారట. చాలా కాలంనుంచి అందుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారట.

స్త్రీల ఆశయం హాయిగా పెళ్ళి చేసుకోవడం, పిల్లలతో ఆనందంగా యింట్లో గడపడంవినా, రాజకీయాల్లో పాల్గొనడంకాదని వారు వాదిస్తున్నారట.

స్త్రీలకే ఓటింగ్ హక్కు వస్తే వారి వైవాహికజీవితం దుఃఖభాజనమవుతుందనీ, కడకు విడాకులు కూడా తప్పవనీ వీరు అనుకొంటూరట!

* * *

పశ్చిమగోదావరిజిల్లా చెరుకువాడ మిత్రవాణి గ్రంథాలయ తృతీయ వార్షికోత్సవం జనవరి 25 వ తేదీన జరిగింది. సర్వసభ్యసమావేశంలో 17 మందితో నూతన కార్యనిర్వాహకవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఆ రాత్రి బహిరంగసభ జరిగింది. శ్రీ జవ్వాని లక్ష్మయ్యనాయుడుగారు అధ్యక్షత వహించారు. శ్రీ లక్ష్మయ్యగారు, శ్రీసుబ్రహ్మణ్యంగారు గ్రంథాలయ భవననిర్మాణానికి సహాయం చేయగలమని వాగ్దానం చేశారు.

## 'కేశవరం బంజరుపై పెనాల్టీ రద్దుచేయాలి'

కాకినాడ, జనవరి 31

కమ్యూనిస్టు శాసనసభ్యులు గంజి నాగేశ్వరరావుగారి నాయకత్వాన రామచంద్రపురం తాలూకా కేశవరం చెరువు పోరంబోకు సాగుదార్లు జనవరి 27 వ తేదీ జిల్లా కలెక్టరును కాకినాడలో కలుసుకున్నారు.

కేశవరం చెరువులో తూర్పుభాగం, సుమారు 14 ఎకరాలు పూర్తిగా మెరకపడి వ్యవసాయానికి వుపయోగం లేకుండా పోయింది. దానిని తొమ్మిది మంది వ్యవసాయ కార్మికులు అయిదారు సంవత్సరాల క్రితం ఆక్రమించుకొని సాగుచేస్తున్నారు. 1958 లో సాగుచేసినందుకు రు. 2727 లు పెనాల్టీ విధించి చేసుమీదవుండగానే ప్రభుత్వంపంట స్వాధీనం చేసుకుని, డిసెంబరుఆఖరువారంలో రు.2727లకు వేలం వేసుకుంది. చేను కాపలా కూలి, కోత, నూర్పుడుకూలి బాపతుకు ఇంట్లు వేలం వేస్తే ప్రయత్నం చేస్తాంది.

ఈ అధిక పెనాల్టీలను రద్దుచేయాలని, యింజక్షన్ను ఆపు చేయాలని రాయబారవర్గంవారు కలెక్టరును కోరారు. ఇదే సాగుపై గత సంవత్సరం విధించిన అధిక పెనాల్టీల అప్పీలు విషయంలో యింతవరకు చర్యతీసుకోలేదని, వెంటనే దాని విషయంలోకూడా చర్యతీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టరు సమాధానం చెపుతూ పెనాల్టీ విషయం రాజమండ్రి సబ్ కలెక్టరుకుపంపి చర్యతీసుకుంటానని, గత సంవత్సరం అప్పీలుకు వెంటనే సమాధానం యిస్తానని చెప్పారు.

## ఏలూరు

భారత రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో ఏలూరు హిందీ ప్రచారసభ యాజమాన్యాన జాతీయగీతాలపోటీ జరిగింది.

## వేలం నోటీసు

1959-60 సంవత్సరం ఆచంట పంచాయితీ ఏరియాలో (1) శుక్రవారం మార్కెట్టు, (2) లక్ష్మీవారం మార్కెట్టు, (3) కార్టు స్టాండ్లలో సుంకము వసూలు చేసుకొనే హక్కు ది 12-2-59 వ తేదీ పగలు 11 గం॥ల నుండి సాయంకాలము 5 గం॥ల వరకు ఆచంట పంచాయితీ ఎగ్జిక్యూటివు ఆఫీసరు గారిచేగాని, వారి అనుమతి పొందిన యితర అధికారిచేగాని బహిరంగముగా వేలం వేయబడును. వేలం షరతులకు, యితర వివరములకు పంచాయితీ కార్యాలయములో తెలుసుకొనవచ్చును.

(సం) డి. వి. సింహాద్రిరావు, బి. ఏ.,
ఎగ్జిక్యూటివు ఆఫీసరు,
ఆచంట పంచాయితీ, 30-1-59

చర్మ వ్యాధులు విలవుండ జాలవు...
జండూస్
ప్సోబిజన్ ఆయింట్మెంటు
దీనిలో శక్తివంతమైన చర్మవ్యాధి శమన గుణాలుగల పదార్థమున్నది.
జండూ ఫార్మసుటికల్ వర్క్సు లిమిటెడ్,
గోఖలే రోడ్ సౌత్, బొంబాయి-28.

## టెండరు నోటీసు

పశ్చిమగోదావరిజిల్లా తణుకు తాలూకా మంచిలి పంచాయితీలో చేయవలసిన యీదిగువ పనులకై ది14-2-59 సాయంత్రం 2 గంటలవరకు టెండరు అందుకొనబడి ఆరోజు సాయంత్రం 4 గంటలకు తెరువబడును. ప్రతి టెండరుతోను రు 100 కి రు 5-00 ల చొప్పున ఇనిషియల్ డిపాజిట్టు దాఖలు చేయవలెను. మిగతా వివరములు పనిచేయు కాలమందు ఆఫీసులో అడిగి తెలుసుకొనవలెను.

| పనుల వివరం | ఎస్టిమేటు మొత్తం |
|---|---|
| 1. పెదఅది ఆంధ్రపల్లె చెరువుచుట్టూను ముళ్ళతీగ వేయుట | రు 1500-00 |
| 2. R. S No. 347/3 లో చినఆదిఆంధ్రపల్లె పాయిఖానాదొడ్డి కట్టించుట. | 1900-00 |
| 3. R. S No. 283/2 లో మంచిలి ఖానలుకద్ద పాయిఖానాదొడ్డిని కట్టించుట. | 2000-00 |
| 4. గొల్లెముక్కల రామరాజుగారి వీధిలో క్వారీరబ్బిష్ రోడ్డువేయుట. | 340-00 |
| 5. కర్రి వెంకన్న గారివీధిలో క్వారీ రబ్బిష్ రోడ్డు వేయుట | 400-00 |
| 6. రైల్వే క్రాస్ లెవెల్ To చిన ఆదిఆంధ్రపల్లె వరకు రోడ్డు వేయుట, కిరసన్ నూనె దీపములు వెలిగించుటకు స్థంభములు, లాంతర్లు, లాంతరు స్టాండులు వగైరాలు సప్లయి చేయుటకు. | 6,000-00 |

విలేజి పంచాయితీఆఫీసు, మంచిలి.
ది 2—2—1959

దండే సుబ్బారాయుడు,
ప్రెసిడెంటు.



ఆమెకు సౌందర్య పోషణ మాత్రమేగాక

పొదుపుగూడా తెలియును. ఆమె ఆర్థిక స్థితి సాధారణమైనను, ఆడంబరమైన దుస్తులు ధరించువారిలో ఆమె ఒకతెగా పరిగణింపబడుతోంది. కారణము. ఆమె ఎల్లప్పుడు 'రెసిస్ట్-ప్రింట్' గుడ్డంనే ధరిస్తుంది. పట్టువంటి మన్నికమైన నేతకు, మన్నికకు రాయ తగ్గని రంగులకు ఇవి సాటిలేనివి. మనోహరమైన డిజైనులలోను, ముచ్చటైన రంగులలోను, లభించు యీ 'రెసిస్ట్-ప్రింట్' గుడ్డలు రవికలకు పిల్లలదుస్తులు వగైరాలకు ఆదర్శమైనవి.

పాప్లినులు. కోటింగులు. 'రెసిస్ట్ ప్రింటులు' కొనునప్పుడు

[illegible] 'సాన్ఫొరైజ్డ్' ఈ గుర్తు వున్నదా అని గమనించండి

జహంగీర్ వకీల్ మిల్
అహమ్మదాబాద్.

# కాంగ్రెసు అధ్యక్షురాలుగా ఇందిరాగాంధీ ఎన్నిక

### ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2

శ్రీమతి ఇందిరా గాంధీ భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షురాలుగా పోటీ లేకుండా ఎన్నికైనట్లు రిటర్నింగ్ ఆఫీసరుగా వ్యవహరించిన ఎ.ఐ.సి.సి. ప్రధాన కార్యదర్శి నేడు ప్రకటించారు.

అధ్యక్ష పదవికి శ్రీమతి ఇందిరా గాంధీ నామినేషన్ ఒక్కటే వచ్చింది.

శ్రీ యస్. నిజలింగప్ప, శ్రీ కుంభ రామ ఆర్య (రాజస్థాన్) గార్ల తరఫున కూడా నామినేషన్లు వచ్చాయి. కాని వారిరువురూ ఉపసంహరించుకొన్నారు.

శ్రీమతి ఇందిరా గాంధీ పేరును ఆంధ్ర, బీహార్, బొంబాయి, ఢిల్లీ, హిమాచల ప్రదేశ్, కేరళ, మధ్యప్రదేశ్, మైసూరు, పంజాబు, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ నుంచి ప్రతిపాదించారు.

## నాగపూర్ కాంగ్రెస్ తీర్మానాలు

### అమలుజరుపుతానని బొంబాయి ముఖ్యమంత్రి

బొంబాయి, ఫిబ్రవరి 2

ప్రణాళికపైనా, వ్యవసాయ విధానంపైనా నాగపూర్ కాంగ్రెసు మహాసభ చేసిన తీర్మానాలను సాధ్యమైనంత త్వరలో అమలు జరపడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నేడిక్కడ కాంగ్రెస్ శాసనసభపార్టీలో ప్రసంగిస్తూ బొంబాయి ముఖ్యమంత్రి శ్రీ వై. బి. చావన్ నేడు అన్నారు.

రాష్ట్రం అంతటికీ ఒకే ప్రదేశ్ కాంగ్రెసుకమిటీ ఏర్పడినందుకు ఆయన తన సంతసం వెల్లడించారు.

## బొంబాయి శాసనసభ సమావేశం

### సమితి, పరిషత్ సభ్యుల వాకౌట్

బొంబాయి, ఫిబ్రవరి 2

నేడు జరిగిన బొంబాయి ఉభయ శాసనసభల సంయుక్త సమావేశంనుండి సంయుక్త మహారాష్ట్ర సమితికీ, మహాగుజరాత్ జనతా పరిషత్‌కు చెందిన సభ్యులు వాకౌట్ చేశారు.

ప్రారంభోపన్యాసం యివ్వడానికి గవర్నర్ శ్రీ ప్రకాశ్ వచ్చి కూర్చొనగానే నూతనంగా ప్రతిపక్ష నాయకుడుగా ఎన్నికైన శ్రీ వి. డి. దేశ్‌పాండే (కమ్యూనిస్టు) లేచి ఒక ప్రకటనను చదివారు. ద్విభాషా రాష్ట్రాన్ని కొనసాగించడం అన్యాయమనీ, ప్రజాతంత్ర విరుద్ధమనీ ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ద్విభాషా రాష్ట్రాన్ని కొనసాగించుతున్నందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని తెలిపి బయటకు తన సహచరులతో కలసి వెళ్ళిపోయారు.

మహాగుజరాత్ జనతా పరిషత్ నాయకుడు కూడా ఇలాంటి ప్రకటనే చేసి, సహచరులతో సభనువిడిచి వెళ్ళారు.

సభ్యులు వెళ్ళిపోతూ మరాఠీ, గుజరాతీ భాషారాష్ట్రాలను వెంటనే ఏర్పరచాలని నినాదాలు యిచ్చారు.

## ఆఫ్ఘనిస్తాన్ ప్రధానమంత్రి భారతదేశ పర్యటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2

ఆఫ్ఘనిస్తాన్ ప్రధానమంత్రి సర్దార్ మహమ్మద్ దావూద్ ఫిబ్రవరి అయిదవ తేదీన ఇక్కడికి వస్తున్నారు. ఆయన ఎనిమిదిరోజుల పాటు మనదేశంలో పర్యటించుతారు. ఆయన వెంట ఆఫ్ఘనిస్తాన్ గనుల పరిశ్రమల మంత్రి, ప్రణాళికా ఉపమంత్రి వస్తున్నారు.

* * *

అల్జీర్స్, ఫిబ్రవరి 2

ఈ వారంలో తబ్లాత్ సమీపంలో జరిగిన ఒక సాయుధ సంఘర్షణలో ఫ్రెంచివారు 63 గురు అల్జీరియా విప్లవకారులను చంపి, పదిమందిని ఖైదీలుగా స్వాధీనం చేసుకొన్నట్లు నేడిక్కడ ఫ్రెంచి మిలిటరీ అధికారులు ప్రకటించారు.

విళంబినామ సంవత్సర
చాంద్రమాన పుష్యమాసం
బహుళ ద్వాదశి తె. 3-46
మూలా రా. 11-8

## హైద్రాబాద్‌లో జీప్ ప్రమాదం

### మండల కాంగ్రెసు అధ్యక్షుని దుర్మరణం

హైద్రాబాద్, ఫిబ్రవరి 2

నేడుదయం ఇక్కడ జరిగిన జీప్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సిద్దిపేట మండలకాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ రామచంద్రారెడ్డిగారు సాయంత్రం ఉస్మానియా ఆసుపత్రిలో మరణించారు.

శాసనసభ్యుడు శ్రీ పి. వి. రాజేశ్వరరావు (కాంగ్రెసు - సిద్దిపేట) స్థానిక వారపత్రిక "నయామజ్దూర్" సంపాదకుడు శ్రీ సి. శ్రీవాస్తవగార్లు కూడా ఆ జీపులోనే వున్నారు. ఇక్కడికి పాతికమైళ్ల దూరంలో వున్న పటంచేరుకు వారు జీప్‌లో వెడుతున్నారు. పటంచేరులో శాసనసభ్యులకూ, పార్లమెంటు సభ్యులకూ ఒక అధ్యయన కేంద్రం ఒకటి నిర్వహింపబడుతున్నది.

దారిలో రామచంద్రపురంవద్ద ఒక మలుపులో ఈ జీపు ప్రమాదం జరిగింది. శ్రీ రాజేశ్వరరావు, శ్రీ వాస్తవ, కారు డ్రైవరుకూడా గాయపడ్డారు.

శ్రీ రాజేశ్వరరావు, డ్రైవర్ల పరిస్థితి కూడా ప్రమాదకరంగానే వున్నదని తెలుస్తోంది. (వి. వి.)

## ఐక్య కార్మిక సంఘానికి ప్ర. సో. పార్టీ కార్యవర్గ ప్రాతికూల్యం

బొంబాయి, ఫిబ్రవరి 2

బొంబాయిలో 'జౌళి' కార్మికుల నూతన ఐక్య కార్మిక సంఘాన్ని స్థాపించడంపట్ల బొంబాయి ప్రజా సోషలిస్టుపార్టీ కార్యవర్గం తన వ్యతిరేకతను వెల్లడించింది. పార్టీ సభ్యులెవరూ ఆ కార్మిక సంఘంలో చేరవద్దని, ఆసంఘ కార్యకలాపాలలో ఎట్టి సంబంధం పెట్టుకోరాదని కార్యవర్గం ఆదేశించింది.

ఈ వారాంతంలో బొంబాయి ప్రజా సోషలిస్టు పార్టీ 'కార్యవర్గం' అఖిల భారత పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. జి. గోరే అధ్యక్షతను సమావేశమై, ఇప్పుడున్న హింద్ మజ్దూర్ సభను బలపరచుకోవడానికి సభ్యులంతా కేంద్రీకరించి పనిచేయాలని తీర్మానించింది.

## హైద్రాబాద్ విశేషాలు

### కార్పొరేషన్ సమావేశం

హైద్రాబాదు, ఫిబ్రవరి 2

హైద్రాబాదు మున్సిపల్ కార్పొరేషను సమావేశం ఫిబ్రవరి 4-5 తేదీలలో కార్పొరేషను భవనంలో జరుగుతుంది.

కార్పొరేషను స్థాయీసంఘం వారు 1959-60 బడ్జెటు విషయంలో చేసిన సూచనల పరిశీలన, ఆక్ట్రాయ్ పన్నుల విషయంలో కార్పొరేషను కార్యదర్శి సమర్పించే నివేదిక. చర్చనీయాంశాలు.

సుల్తాన్‌బజారులో ఒక మురుగు కాల్వలో పడి గోపాలకృష్ణ అనే బాలుడు మరణించిన దారుణోదంతంపై కార్పొరేషన్ కమిషనరు సమర్పించే మెమొరాండం పరిశీలన.

### బాలల సంక్షేమం

బాలల సంక్షేమసంఘం హైద్రాబాదు శాఖవారు ఈనెల మధ్యలో బాల సంక్షేమ కార్యకర్తలకు తరగతులు నడిపిస్తున్నారు. ఈ తరగతులు మూడు నెలలపాటుంటాయి. ఉపన్యాసాలు ఇంగ్లీషులో వుంటాయి. బాలల సంక్షేమాన్ని గురించి ఆసక్తిగలవారు ఇంగ్లీషు ఉపన్యాసాలను అర్థంచేసుకొనగలిగినవారు తరగతులకు హాజరుకావచ్చును. దరఖాస్తుఫారాలు నారాయణగూడాలోని వై. యం. సి. ఏ.లో ఫిబ్రవరి 9వ తేదీవరకూ దొరుకుతాయి. ప్రత్యేక పరిశీలన తర్వాత తరగతుల్లో చేర్చుకొంటారు.

### చైనా చిత్రకారబృందం

చైనా చిత్రకార బృందంవారు నిన్న ప్రభుత్వ లలితకళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ విశ్వనాథముఖర్జీ వారికి కళాశాల విశేషాల నన్నింటినీ చూపించారు. కళాశాల విద్యార్థులూ అధ్యాపకులూ గీసిన చిత్రాలను వీరు చాలా ఆసక్తితో తిలకించారు.

### ఏనుగు గున్న

హైద్రాబాదులోని పబ్లిక్ గార్డెన్స్‌కి కొత్తగా ఒక ఏనుగు గున్న వచ్చింది. ఆంధ్ర బాలబాలికలకు మైసూరు ప్రభుత్వం ఈ ఏనుగు గున్నను బహూకరించింది.

ఇరిగేషన్ మంత్రి జె. వి. నరసింగరావుగారు మాకో ఏనుగు గున్న కావాలని ఢిల్లీలోని వన్య మృగ సంఘానికి చెప్పారు. ఆ విషయం తెలుసుకొని మైసూరు ప్రభుత్వం ఈ బహుమతిని పంపించింది.

### బసవపున్నయ్యగారి రాక

భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శులలో ఒకరైన శ్రీ మాకినేని బసవపున్నగారు నిన్న సాయంత్రం ఇక్కడికి వచ్చారు. ఆయనిక్కడ మూడు రోజులపాటుంటారు.

### ఆస్‌బెస్టాస్ సిమెంటు కంపెనీ కార్మిక సంఘం

భారత జాతీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుకు అనుబంధంగావున్న ఆస్‌బెస్టాస్ సిమెంటు కంపెనీకార్మికసంఘం అధ్యక్షుడుగా శ్రీ మహబూబ్ బేగ్ ఎన్నికయ్యారు. రహస్య వోటింగు జరిగింది. ఈయనకు ఎక్కువవోట్లు వచ్చాయి.

### పృథ్వీ ఫలానికి అంతర్జాతీయ బహుమానం

సీతాఫలాన్ని లక్ష్మణఫలాన్ని అంటుకట్టిగా కొత్తగా తయారయిన "పృథ్వీ ఫలా"నికి వేయిరూపాయల అంతర్జాతీయ బహుమానం లభించింది. సంగారెడ్డి ఉద్యానక్షేత్రం వారు ఈ పృథ్వీఫలాన్ని రూపొందించారు.

ఈ పృథ్వీఫలంలో సీతాఫలానికున్న రుచి వుంటుంది. కాని సీతాఫలానికున్నన్ని గింజలుండవు. సీతాఫలంలో నాలుగవవంతు గింజలు మాత్రమే ఉంటాయి.

### కాంగ్రెసుశాసనసభ్యుడు శ్రీ దొడ్డా నరసయ్య

హైద్రాబాదు, ఫిబ్రవరి 2

తనకు చెన్నారెడ్డిగారి వర్గంతో ఎట్టి సంబంధమూ లేదని ఎల్లెందునుంచి ఎన్నికైన కాంగ్రెసు శాసనసభ్యుడు శ్రీ దొడ్డా నరసయ్యగారు ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారికి ఒక లేఖ రాశారు. తాను ఎప్పటికీ కాంగ్రెసుకు విధేయుడుగానే ఉంటానని ఆయన అన్నారు.

### నిర్మల మున్సిపల్ వ్యవహారాలు

హైద్రాబాదు, ఫిబ్రవరి 2

నిర్మల మున్సిపల్ కౌన్సిలర్లు ముగ్గురి అర్హతలను రద్దుచేస్తూ మున్సిపల్ చైర్మన్ జారీచేసిన ఉత్తర్వులను ఆదిలాబాదుజిల్లా కలెక్టరు మహమ్మద్ మొహిబుల్లా సస్పెండు చేశారు. అందుకని ఇప్పుడీ ముగ్గురుకౌన్సిలర్లుకూడా కౌన్సిలు సమావేశాల్లో మామూలుగా పాల్గొనవచ్చును.

మొన్న జనవరి 22వ తేదీన నిర్మల మున్సిపల్ కౌన్సిలు సమావేశం జరిగింది. చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ పదకొండుగురు సభ్యులు తీర్మానం ప్రతిపాదించారు. అప్పుడు ముగ్గురు కౌన్సిలర్లు అర్హతలు కోల్పోయారని చైర్మన్ ప్రకటించారు. దానికి నిరసనగా కొందరు కౌన్సిలర్లు సభనుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత వారు కలెక్టరును కలుసుకొని చైర్మన్‌చర్య అక్రమంగా ఉన్నదనీ అవిశ్వాస తీర్మానం చర్చను నిరోధించడానికి ఆయన పన్నిన పన్నాగమిదనీ వివరించారు.

### ఆర్. టి. సి. బిల్లు

### శ్రీ అంజయ్య హర్షం

హైద్రాబాదు, ఫిబ్రవరి 2

కృష్ణాజిల్లాలో జాతీయంచేసిన కొన్ని బస్సురూట్లను ఖాయపరుస్తూ ప్రభుత్వం ఒక బిల్లు ప్రకటించినందుకు ఆర్. టి. సి. ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. ఎల్. అంజయ్య హర్షం వెలిబుచ్చుతూ నేడొక ప్రకటన చేశారు.

జాతీయకరణ పథకంలో చిక్కులు, ఇబ్బందులు ఏవి వున్నప్పటికీ భారత పౌరుడైనవాడెవ్వడూ జాతీయాభివృద్ధికీ, సోషలిస్టుధ్యేయానికీ, కీలక పరిశ్రమల జాతీయకరణకూ అడ్డు రాకూడదని ఆయన పేర్కొన్నారు. జాతీయకరణవల్ల అధిక లాభాపేక్ష గలవారికి కడుపుమండవచ్చును. కాని ఈ జాతీయకరణవల్ల ప్రజలకు సరైన రవాణా సౌకర్యం ఏర్పడ్డమే కాకుండా పనివారి కొలువులకు భద్రత ఏర్పడుతుంది. జాతీయాదాయం పెరుగుతుంది. ఈ జాతీయాదాయం అనేక ఇతర అభివృద్ధి పథకాలకు వినియోగపడుతుంది అని శ్రీ అంజయ్యగారు పేర్కొన్నారు. అందుకని ఈ బిల్లునంతా బలపరచవలసిందని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఆస్పత్రుల్లోని నాల్గవ తరగతి ఉద్యోగుల సెలవులు

హైద్రాబాదు, ఫిబ్రవరి 2

తెలంగాణా వైద్యసంస్థల్లోని నాల్గవ తరగతి ఉద్యోగులందరికీ ఏడాదికి 30 రోజుల కాజువల్ లీవు ఇవ్వాలని ఆంధ్ర ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

అత్యవసరమైనప్పుడు క్రమశిక్షణ చర్య గైకొనవలసి వచ్చినప్పుడు తప్ప లేనిపక్షంలో ఆస్పత్రుల్లో నాల్గవ తరగతి ఉద్యోగులను బదిలీ చేయరాదని ప్రభుత్వం వైద్య శాఖాధికారులకు ఆదేశాలు పంపింది.

వారానికొకరోజు సెలవు, రోజుకెనిమిది గంటలపని విధానాన్ని అమలు జరపవలసిందని ఆస్పత్రి అధికారులకు కూడా ఉత్తర్వులు వెళ్ళాయి.

## జర్మనీ సమస్యపై పశ్చిమ రాజ్యాలమధ్య విభేదాలు

లండన్, ఫిబ్రవరి 2

జర్మనీ సమస్యను గురించి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ ప్రభుత్వాలమధ్య భేదాభిప్రాయాలు తీవ్రమయాయన్న వదంతులు ప్రబలంగా ఉన్నాయి. బ్రిటిష్ పత్రికలుకూడా ఈ విభేదాలవార్తలు ప్రచురించాయి. తక్కిన మూడు ప్రభుత్వాలతోనూ సంప్రతింపులకై అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ హుటాహుటిని విమానంలో బయలుదేరి రావడానికి కారణంకూడా ఇదే అని పత్రికలు వ్యాఖ్యానించాయి.

బ్రిటిష్ విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు ఈ వేళ జరిపిన పత్రికాగోష్టిలో విలేఖరులు యీ వదంతులను గురించి గుచ్చిగుచ్చి ప్రశ్నించారు.

డల్లెస్ రాకలో విశేషం ఏమీలేదనీ, అది మామూలు పర్యటనే అనీ ఆయన అన్నారు. విలేఖరులు మరింత నొక్కి ప్రశ్నించగా, "జర్మనీ సమస్యపై పశ్చిమ రాజ్యాలు నాలుగింటి మధ్య పూర్తి అంగీకారంలేని మాట నిజమే" అని ఆయన ఒప్పుకున్నారు.

అంగీకారం ఉన్నదనిగాని, లేదనిగాని ఖచ్చితంగా చెప్పగలదశకు పశ్చిమ రాజ్యాల సమాలోచనలింకా చేరలేదని కూడా ఆయన అన్నారు.

తూర్పు పశ్చిమ జర్మనీల సమాఖ్య ప్రతిపాదనను బ్రిటనుకెవ్వరూ చేయలేదని కూడా ఆయన అన్నారు.

## ఇరాక్‌పై దుష్ప్రచారం

లండన్, ఫిబ్రవరి 2

ఇరాక్‌లోని జనరల్ ఖాసిమ్ విప్లవ ప్రభుత్వం బాగ్దాద్ కూటమిలోనే ఉండడానికి నిశ్చయించుకున్నదనీ, ఆ విషయాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి కూడా తెలిపిందనీ కొన్ని వర్గాలవారు ప్రచారం ప్రారంభించారు.

ఈవేళ బ్రిటిష్ విదేశాంగశాఖ ప్రతినిధి జరిపిన పత్రికాగోష్టిలో విలేఖరులు ఈ విషయమై ప్రశ్నలడిగారు. ఇది నిజంకాదనీ, ఇరాక్ రిపబ్లిక్ ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వానికి అలాంటి సందేశం ఏమీ పంపలేదని ఆయన తెలిపారు.

## "హరిజన" నామానికి స్వస్తి

### రాష్ట్ర మంత్రుల సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2

కాలనీలకు, హాస్టళ్ళకు, షెడ్యూల్డ్ తరగతులకు చెందిన తదితర సంస్థలకు యింతవరకూ వుంటూ వచ్చిన "హరిజన" అనే నామధేయాన్ని యికనుండి వివిధ రాష్ట్రాలు విసర్జించడానికి నిశ్చయించుకున్నాయి.

ఈ నిర్ణయాన్ని వెనుకబడ్డ జాతుల అభివృద్ధి విషయమై ఢిల్లీలో జరిగిన వివిధ రాష్ట్ర మంత్రుల సమావేశంలో తీసుకున్నారు.

సమావేశంలో వచ్చిన సూచనలను మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ యూనియన్ ప్రాంతం, రాజస్థాన్ రాష్ట్రాలు అమలు జరుపుతున్నాయి. ఈ రాష్ట్రాలలో "హరిజన" అనేపదాన్ని ఉపయోగించడంలేదని ఒక ప్రభుత్వ ప్రకటనలో తెలియవచ్చింది. పంజాబులో ఏ కళాశాలనుగాని, హాస్టల్‌నుగాని ఈ పేరు పెట్టడం విరమించారు. హిమాచల్ ప్రదేశ్, మణిపూర్‌లలో అసలు పాఠశాలలే లేవు కాబట్టి "హరిజన" నామాన్ని వుంచడమా లేదా అనే ప్రసక్తేలేదు.

# అదనపుపన్నులు విధించకుండా ఉద్యోగుల వేతనాలు పెంచవచ్చు

## దీక్షాదిన సభలలో ఎన్. జి. వోల, ఉపాధ్యాయుల కోర్కెలను బలపరుస్తూ ప్రసంగాలు

విజయవాడ, ఫిబ్రవరి 2

వేతనాలకమిటీ సూచనలవల్ల ఎన్. జి. వో. లకు, ఉపాధ్యాయులకు కలుగుతున్న అన్యాయాన్ని తొలగించాలనీ, ప్రజలపై అదనపు పన్నులు విధించకుండానే ఉద్యోగుల జీతాలు పెంచటం సాధ్యమని రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో దీక్షాదిన సందర్భంలో జరిగిన సభలలో వక్తలు ప్రసంగించారు.

విజయవాడలో నిన్న గాంధీనగరం హిందూ హైస్కూలులో దాదాపు అయిదువేలమంది హాజరైన సభకు రాష్ట్ర ఎన్. జి. వోల సంఘ ఉపాధ్యక్షులు శ్రీ రాజారావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ రాజారావుగారు తమ ప్రసంగంలో ఎన్. జి. వోల ఉద్యమ చరిత్రనువివరించారు. ప్రస్తుత వేతనాల కమిటీలో శాసనసభ ప్రతిపక్షనాయకులు సభ్యులుగాఉండి తీవ్రకృషి చేసినా వేతనాలు పెంచబడలేదన్నారు. నూతన వేతనాల స్కేళ్ళు శాస్త్రీయ దృక్పథంతో నిర్ణయించబడలేదన్నారు. అయిదువందల రకాలకుపైగా ఉన్న స్కేళ్ళను కుదించాలన్న ఆదుర్దాతో కొన్ని తరగతులకు అన్యాయం జరిగిందన్నారు. ఎంతో నిగ్రహంతో తాము ఇంతకాలం వేచివున్నామనీ, కడకు ముఖ్యమంత్రి మా ప్రతినిధులను కలుసుకోనిరాకరించడంవలన ఇటువంటి ప్రదర్శనలద్వారా కోర్కెలను వెల్లడించవలసి వచ్చిందనీ అన్నారు. ఇంకా ఇలా అన్నారు:

"మీ జీతాలు పెంచాలంటే అదనపు పన్నులు విధించాలంటూ ప్రజలకు - మాకు మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రభుత్వాధిపతులు ప్రయత్నిస్తున్నారు. వాస్తవికంగా చూస్తే మాజీతాలు పెంచడంవలన రు. 4½ కోట్లు ఖర్చుకానేకాదు. మొత్తం 25 సంవత్సరాల కాలంలో ఎంత అదనపు ఖర్చు అవుతుందో లెక్క చూసి సరాసరి ఖర్చును ఇప్పుడే లెక్క తేల్చి అందుకు అదనపు పన్నులు వేయడం భావ్యమా? ముందు పరిస్థితులు మారవచ్చు. మన రాష్ట్ర [illegible] అదనపు పన్నులను ప్రజలపై విధించవలసిన అవసరం ఏమీ లేదు".

ఆంధ్ర శాసనమండలి ఉపాధ్యక్షులు శ్రీ జి. సుబ్బరాజుగారు మాట్లాడుతూ ఉద్యోగుల కోర్కెలపట్ల సానుభూతిని ప్రకటించారు.

తరువాత కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావుగారు మాట్లాడుతూ వేతనాల కమిటీ సిఫారసులు ఇంకా మెరుగుగా ఉండవలసిన అవసరం ఉందనీ, కేంద్రప్రభుత్వంనుండి మన రాష్ట్రానికిరావలసిన వాటాను రాష్ట్ర ప్రభుత్వం, మనం కలిసి రాబట్టుకోవాలని అన్నారు. మన రాష్ట్రంలో వాణిజ్య పంటల పన్నులద్వారా వచ్చే ఆదాయంతో కేంద్రం తన ఉద్యోగులకు ఎక్కువ జీతాలు యిస్తున్నదనీ, రాష్ట్ర ఉద్యోగుల అవసరాలు చూడటంలేదనీ, అందువల్ల మనవాటాను మనంతీసుకొని ఉద్యోగుల జీతాలు పెంచాలనీ అన్నారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల కోర్కెలను శాసనసభలో తాము బలపరుస్తామని వాగ్దానం చేశారు.

శాసనమండలిలో సోషలిస్టుసభ్యులు శ్రీగుత్తా రాజారావుగారు మాట్లాడుతూ డబ్బులేదని చెప్పేవాదనలో అర్థంలేదన్నారు. మంత్రులు తమ జీతాలను పెంచుకోడానికి, ఇతర ఖర్చులు చేయడానికి డబ్బుకొరత ఎందుకు అడ్డు రాలేదని అడిగారు.

### ప్రభుత్వ యంత్రాన్ని సంస్కరించాలి

శాసన మండలి సభ్యులు శ్రీ పి. శ్రీరామమూర్తిగారు మాట్లాడుతూ మనఆశయాలకు, సామాన్యప్రజల ఆశయాలకు వైరుధ్యంలేదనీ, ప్రజలూ, మనంకలిసిముందుకుపోవాలనీఅన్నారు. స్వాతంత్ర్యంవచ్చి 12సంవత్సరాలైనా పరిపాలనా యంత్రంలో ప్రజాస్వామిక పద్ధతులు ప్రవేశపెట్టబడలేదని అన్నారు. కేరళ ప్రభుత్వం పరిపాలనాసంస్కరణల కమిటీ నియమించి ముందుకు పోతూంటే మన ప్రభుత్వం చూస్తూ కూర్చున్నదని అన్నారు. లంచగొండితనం, రెడ్‌టేపిజం పోవాలనే ప్రతి ఉద్యోగి కోరుతున్నాడనీ, ప్రస్తుత ఆర్థికదుస్థితిని తొలగించడం ద్వారా పర్సనల్ [illegible] తొలగించడం ద్వారా, ప్రభుత్వం నూతన వాతావరణాన్ని నెలకొల్పాలనిఅన్నారు. నేడు ప్రభుత్వయంత్రాంగంలో అధికార పార్టీనాయకుల జోక్యంమరీ విపరీతమైపోయిందనీ, ఇది మరింత అవినీతికి దారితీస్తున్నదనీ అన్నారు. రికమండేషన్లకు తావు ఉండకుండా చేయాలన్నారు. జిల్లా, తాలూకా స్థాయిల్లో పరిపాలనా అజమాయిషీ కమిటీలను వివిధ రాజకీయ పార్టీల వారితో నియమించడం ద్వారా ఆయూబ్‌ఖాన్ ధోరణులు ప్రబలకుండా చేయవచ్చునన్నారు. దీక్షాదినం సందర్భంలో వ్యక్తమైన ఐక్యతను ఇంకా దృఢవంతం చేయాలన్నారు. వేతనాల కమిటీ సిఫారసులు ఏవిధంగా అసంతృప్తికరంగా ఉన్నదీ వివరించారు.

తరువాత స్కూళ్ళ డిప్యూటీ ఇన్‌స్పెక్టరు గారు మాట్లాడుతూ ఎన్. జి. వోలు, ఉపాధ్యాయులు ఏరాజకీయ పార్టీకి చెందినవారు కారనీ, వారిది "పొట్టకూటి" పార్టీ అనీ అన్నారు. వారేదైనా కోరుతూంటే అన్నం పెట్టమనిమాత్రమేననీ, అంతేకాని ప్రభుత్వాన్ని దించాలనికాని, మంత్రులం కావాలనికాని, కాదన్నారు.

శ్రీ వెంపటి పురుషోత్తంగారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులజీతాలు పెంచితేనే వారి కప్పగించబడిన బాలబాలికల భవిష్యత్తు బాగుంటుందన్నారు.

అధ్యక్షులు శ్రీ రాజారావుగారు సభను ముగిస్తూ ఎన్. జి. వోలు, టీచర్లు ఏ రాజకీయ పక్షానికి చెందినవారు కాదనీ, ప్రభుత్వానికి వారు విధేయులై ఉన్నారనీ, అందు చేతవారి న్యాయమైన కోర్కెలను మన్నించడం ప్రభుత్వ ధర్మమనీ అన్నారు.

శ్రీ పూర్ణచంద్రరావుగారి గేయాలతోను, శ్రీ ఆచార్యగారి వందన సమర్పణతోను జనగణమనతోను సభముగిసింది.

### తెనాలిలో

తెనాలిలో ఫిబ్రవరి 1వ తేదీన జరిగిన దీక్షాదినం సందర్భంలో ఎన్. జి. వోలు, టీచర్లు, నాల్గవతరగతి ఉద్యోగులు సుమారు 300 మంది ఊరేగింపు జరిపారు. ఎన్. జి. వోల క్లబ్ ఆవరణలో సాయంత్రం జరిగిన బహిరంగ సభకు శ్రీ శెట్టి నాగేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ రావి అమ్మయ్య (కమ్యూ), శ్రీ లక్కరాజు పాండురంగ వెంకట విశ్వేశ్వర శర్మ (జనసంఘం), శ్రీ నన్నపనేని వెంకట్రావు (పి. యస్. పి.), శ్రీ యస్. కృష్ణమూర్తి (తంతి-తపాలా), శ్రీ వై. కృష్ణమూర్తి (తాలూకా యస్. జి. వో. ల సంఘం), శ్రీ తారానాథ్, (అడ్వకేట్) గార్లు ఎన్. జి. వోల కోర్కెలను బలపరుస్తూ మాట్లాడారు. రాష్ట్ర సంఘ తీర్మానాలను బలపరిచారు. కార్యదర్శి వందన సమర్పణతో సభ ముగిసింది.

### నందిగామలో

నందిగామలో 400 మంది ఉపాధ్యాయులు, ఎన్. జి. వోలు ఉదయం తాలూకా ఆఫీసులో చేరి జెండా ప్రతిష్ఠాపన చేశారు. ఆ తరువాత పట్టణ వీధుల్లో ఊరేగింపు జరిగింది. సాయంత్రం సత్యదేవ టాకీస్‌లో శ్రీ బండారు సత్యనారాయణగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. మాజీ ఎం. ఎల్. ఎ. శ్రీ వాసిరెడ్డి రామారావు శ్రీ వెంజెండ్ల వెంకటసుబ్బయ్య (సోషలిస్టు) శ్రీ వి. కేశవరావు (జిల్లా ప్లానింగ్ కమిటీ సభ్యుడు) గార్లు ఎన్. జి. వోల, టీచర్ల కోర్కెలను బలపరుస్తూ మాట్లాడారు.

ఉపాధ్యాయసంఘ కార్యదర్శి శ్రీ కె. సుబ్బారావు, సహాయ కార్యదర్శి శ్రీ కె. వెంకటరత్నం, శ్రీ జి. మార్కు, శ్రీ ఐ. గోవిందరాజులు, శ్రీ యు. ఎస్. అవతారంగార్లు కూడా మాట్లాడారు. నందిగామ బోర్డు హైస్కూలు ఉపాధ్యాయులు శ్రీ ఎన్. సీతారామయ్యగారు ప్రవేశపెట్టిన కోర్కెల తీర్మానాలను సభవారు ఆమోదించారు.

### బందరులో

బందరులో జరిగిన దీక్షా దినంలో చినముత్తేవి, పెడనలలోని ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. ఉదయం ఎన్. జి. వోల సంఘాధ్యక్షుడు శ్రీ ఎస్. వెంకటరత్నంగారు జెండాను ప్రతిష్ఠించారు. సంఘ కార్యదర్శి శ్రీ సోమయాజులుగారు వేతనాల కమిటీ సిఫారసులను నిరసించారు. ఆ తరువాత అరమైలు పొడుగున పట్టణ వీధులలో పెద్ద ఊరేగింపు జరిగింది. ఊరేగింపు వేలాది ప్రజలను ఆకర్షించింది. సాయంత్రం శ్రీ వెంకటరత్నంగారి అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలో కృష్ణాజిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘాధ్యక్షులు శ్రీ డి. వెంకట్రామయ్య, లోకల్‌బోర్డు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శ్రీ బి. సీతారామయ్య, ఆంధ్రకేసరి సంపాదకులు శ్రీ పి. లక్ష్మీపతి, న్యాయవాది శ్రీ జి. సుబ్బరాయశాస్త్రి, కమ్యూనిస్టుపార్టీతరఫున డాక్టరు కొప్పా వెంకట్రామశాస్త్రి గార్లు ఎన్. జి. వో. ల. టీచర్ల కోర్కెలను బలపరుస్తూ మాట్లాడారు.

వేతనాల సమస్య పునఃపరిశీలనకు ఉన్నతాధికార సంఘాన్ని నియమించాలనీ, ఈలోగా రాష్ట్ర ఎన్.జి.వోల సంఘం పేర్కొన్న కోర్కెలను ఆమోదించాలనీ కోరుతూ తీర్మానాలు చేశారు.

### గన్నవరంలో

కృష్ణాజిల్లా గన్నవరంలో ఉదయం తాలూకా ఆఫీసులో స్థానికహైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ కృష్ణయ్యగారు ఎన్. జి. వో. ల జెండాను ఎగురవేశారు. డిప్యూటీ తహశీల్‌దారు రాష్ట్ర ఎన్. జి. వో సంఘ మాజీ అధ్యక్షుడు శ్రీ ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి పతాక ప్రాముఖ్యతను వివరిస్తూ "శ్రమ జీవులమైన మనం తెల్ల ఎరుపురంగులతో ఉత్తేజపడుతూ, చక్రం అనే ఈ ప్రభుత్వ యంత్రాన్ని, కలం అనే బుద్ధి వికాసంతో నడుపుతామని చెప్పేందుకే ఈ చిహ్నాలను" జెండాపై చిత్రించామని అన్నారు. సాయంత్రం జరిగిన బహిరంగసభకు శ్రీ కృష్ణయ్య అధ్యక్షత వహించారు. శ్రీ ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి, నాల్గవతరగతి ఉద్యోగుల తరఫున శ్రీ డబ్ల్యు. వెంకటేశ్వరరావు, [illegible] ఎన్. జి. వోల సంఘ కార్యదర్శి శ్రీ టి. వెంకటేశ్వరరావు, జిల్లా ప్రాథమికోపాధ్యాయుల సంఘ కార్యదర్శి శ్రీ ఎస్. సీతారామాచారి, సెకండరీ ఉపాధ్యాయుల తరఫున శ్రీ సి. నరసింహం గార్లు మాట్లాడారు.

స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులందరూ, గ్రామాలనుండి సెకండరీ, ప్రాథమిక ఉపాధ్యాయులూ సభకు హాజరయ్యారు.

### నూజివీడులో

నూజివీడులో దీక్షాదినం సందర్భంలో శాసనసభ్యుడు శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారు ఎన్. జి. వో. ల క్లబ్‌లో జెండా ప్రతిష్ఠించారు. తరువాత జరిగిన బహిరంగ సభకు ఆయనే అధ్యక్షత వహించారు. గన్నవరం తాలూకా ఎన్. జి. వో. ల సంఘ కార్యదర్శి శ్రీ టి. వెంకటేశ్వరరావుగారు మాట్లాడారు.

## శ్రీ రంగాపై విమర్శ

(1వ పేజీ తరువాయి)

శ్రీ రంగా అభివృద్ధి నిరోధక భూస్వామ్య వర్గాలకు మద్దతునిస్తూ, గతించిపోయిన వ్యక్తిగత నినాదాల రొచ్చులో పడి ఫ్యూడల్ ఆర్థిక విధానాన్ని రైతాంగ ఆర్థిక విధానంతో ముడిపెట్ట పూనుకున్నందుకు శ్రీ సింగ్ బాధను వ్యక్తం చేశారు.

శ్రీ రంగా వాదనలో కనపడుతున్న వైరుధ్యం యిట్టే అవుపిస్తుంది. ఆయన ప్రజాతంత్ర సోషలిజాన్ని, గరిష్ఠ పరిమితిలేని భూమిల్ని గూర్చి ఒకే దృష్టితో మాట్లాడుతారు. "శ్రీ రంగా మార్కు సోషలిజం" నుండి భగవంతుడు మనల్ని రక్షించుగాక! భూములపై పరిమితులు విధించకపోవడమంటే దున్నే వారికి, పేదరైతులకు భూమిఎగనామం పెట్టడన్నమాట. సహకార నిరాకరణ ప్రాతిపదికపై తమకు తాముగా అభివృద్ధిచెందాలనే రంగాగారి ధోరణి దేశాన్ని అధోగతికి తీసుకువెళ్తుంది; కోట్లాది భారత రైతాంగం నిత్యదారిద్ర్యంతో, నిరుద్యోగబాధతో సతమతమవక తప్పదు. ఒకవేళరంగాగారి వాదనల్ని ఫ్యూడలిజానికి వత్తాసుగా పలికివున్నట్లయితే యింకా బాగా వుండేది; అప్పుడు ఆయన వాదనల్ని మనం అర్థంచేసుకోగలిగివుండేవాళ్ళం" అని శ్రీ సింగ్ విమర్శించారు.

* * *

రాష్ట్రప్రభుత్వం ఆహారధాన్యాల ధరల్ని అదుపులో పెట్టలేకపోయినందుకు నిరసనగా పంజాబు జనసంఘ అధ్యక్షుడు నేడు నిరశనవ్రతం పూనారు.

ట్రూటెక్స్

క్యాలండర్ రిస్టువాచ్

తేదీతో సహా టైమ్ తెలుపుఅందమైనవాచి. యాంటీమాగ్నెటిక్ C/S, రేడియంముళ్ళు, అంకెలు.

వ్యాపారికి, అందరికి మిక్కిలి ఉపయోగం.

15 జ్యూయల్స్ రు. 48/-
15జ్యూయల్స్‌వాటర్‌ప్రూఫ్ రు.64/- 17 జ్యూయల్స్ వాటర్‌ప్రూఫ్‌రు.74/-
ప్యాకింగ్ & పోస్టేజి అదనం రు. 2/-
ప్రత్యేక క్యాటలాగులేదు. 5 సం॥లు గ్యారంటీ.

ఓస్కా వాచ్ కంపెని,
35 హమామ్‌స్ట్రీట్, బొంబాయి-1.

దక్షిణ రైల్వే

ప్రయాణీకులకు సౌకర్యము

ప్రయాణీకుల సౌకర్యము నిమిత్తం అన్ని ప్రయాణీకుల బండ్లను ప్లాట్‌ఫారం లైను మీదనే నిలుపుటకు నిర్ణయించడమైనది. ఒకే ప్లాట్‌ఫారం కలిగియున్న స్టేషన్లలో రెండు ప్రయాణీకుల బండ్లు వచ్చుట తటస్థించినప్పుడు మొదట వచ్చిన బండిని ప్లాట్‌ఫారం లైనుమీదికి రప్పించబడును. ప్రయాణీకులు బండి ఎక్కుటకు, దిగుటకు పూర్తయిన తర్వాత వ్యవధి ఉన్నచో రెండవ బండి ప్లాటుఫారము మీదికి రాగలందులకై, మొదటి బండిని ప్లాటుఫారములేని లైనుమీదికి తీసుకపోబడును. రెండవ బండి రాగానే మొదటి బండి ప్లాటుఫారములేని లైనుమీదనుండి వెడలిపోవును. మొదటిబండిని ప్లాట్‌ఫారమ్‌లేని లైనుమీదకు తెచ్చుటకు వ్యవధి లేనిచో రెండవ బండి ప్లాట్‌ఫారమ్‌లేని లైనుమీదుగా ముందుకుపోయి మొదటి బండి వెళ్ళిన తర్వాత ప్లాట్‌ఫారమ్ లైనుమీదకు వెనకకు రప్పింపబడును.

పై యేర్పాటు, పగటి వేళలలో ప్రయాణీకులకు యిబ్బంది కలుగకుండా ప్లాటుఫారములేని లైనుమీద నుండియే రెండవ బండిని రప్పించుటకు, వదలుటకు వసతులున్న స్టేషనులకు వర్తించదు.

డివిజనల్ సూపరింటెండెంట్.

విజయవాడ సదరన్ రైల్వే

(శాకాహార) కేంటీన్‌లో యీ క్రింది టెంపరరీ వుద్యోగములకై దరఖాస్తులు కోరబడుచున్నవి.

1. కుక్ (వంట [illegible]) 1, నెలసరి జీతము రు. 60/-.
2. అసిస్టెంట్ కుక్ 2, నెలసరి జీతము రు. 40/-.
3. సర్వరు 8, నెలసరి జీతము రు. 25/-.
4. క్లీనరు 3, నెలసరి జీతము రు. 20/-.
5. టోకెన్ యిష్యూయర్ 1, నెలసరి జీతము రు. 60/-

(జీతమునకు తోడు ప్రతి వుద్యోగికి కేంటీన్ పనిచేయు రోజులలో దినమునకు ఒకపూట భోజనము, రెండు పూటల ఫలహారము వుచితముగా యివ్వబడును.)

2. పై సూచించిన వుద్యోగములకు వయసు పరిమితి 18 సం॥ నుండి 40 సం॥ వరకుగా నిర్ణయించబడినది. టోకెన్ యిష్యూయర్ వుద్యోగము వలయువారు 500/-రూపాయలు ధరావతు కట్టవలసి యుండును. అంతేగాక కనీసము S. .L.C వరకైనా చదివి యుండవలెను.

మంచి హోటళ్ళలోను, కేంటీన్‌లలోను పూర్వానుభవమున్న అభ్యర్థులకు అవకాశ మెక్కువగా నుండును.

3. దరఖాస్తులు అభ్యర్థిపేరు, వయసు, చిరునామా, విద్యావివరములు, పూర్వానుభవము సూచించుచూ 9-2-59 తేదీలోగా "ది చైర్మన్, సదరన్ రైల్వే స్టాఫ్ కేంటీన్ అండ్ అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ (1) విజయవాడ"కు చేరునట్లుగా పంపవలెను. దరఖాస్తుతోబాటు అభ్యర్థి చిరునామాగల 15 నయాపైసలు పోస్టు కవరు, బాధ్యతగల యిరువురు పెద్ద మనుష్యులు యిచ్చిన సర్టిఫికెట్లు జతపర్చవలెను.

9-2-59తర్వాతవచ్చు దరఖాస్తులు, పై నిబంధనలు పాటించని దరఖాస్తులు అంగీకరించబడవు.

వుత్తర ప్రత్యుత్తరములు ఇంగ్లీషులోనే జరుపవలెను. ఇంటర్వ్యూకు పిలువబడినవారు తమ ఖర్చులు తామే భరించవలెను.

చైర్మన్,
సదరన్ రైల్వే స్టాఫ్
క్యాంటీన్ & అసిస్టెంటు
పర్సనల్ ఆఫీసర్.

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు, (అధ్యక్షులు) కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి: విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్, కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్, విజయవాడ - 2